సెప్టెంబర్ 2024

221

సంపుటి : 20 సంచిక : 4

వెల రు. 15 /-

# MARXISTU
# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో ........

సిపిఐ(ఎం) కార్యక్రమం: వ్యూహం, ఎత్తుగడలపై వివరణ

కొత్త క్రిమినల్ చట్టాలు : ప్రజా హక్కులు

జమ్ము-కాశ్మీర్‌లో పెరిగిన తీవ్రవాద కార్యకలాపాలు

అభ్యుదయ సాంస్కృతికోద్యమ చరిత్ర : ఒక పరిశీలన

ఉత్తర భారత రాజ్యాధిపత్య పోరులో మూడు సామ్రాజ్యాలు

ఆదాయం కేంద్రానికి, ఖర్చులు రాష్ట్రాలకి


ఖజానా రాజకీయాలు

అక్రమాల ఊబిలో సెబి ఛైర్మన్

మార్క్సిస్టు విలువల మేలి ముత్యం కామ్రేడ్ బుద్ధదేవ్

నివాళి

# మార్క్సిస్టు విలువల మేలి ముత్యం కామ్రేడ్ బుద్ధదేవ్



యు రామకృష్ణ

ఇరవై మూడేళ్లపాటు అవిచ్ఛిన్నంగా పశ్చిమ బెంగాల్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన జ్యోతిబసు వామపక్ష ప్రభుత్వ వారసుడుగా, 11 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా సేవలందించిన కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మార్క్సిస్టు విలువల మేలి ముత్యం. ముఖ్యమంత్రి వంటి గొప్ప పదవిలో ఉన్నా సామాన్య, ఆదర్శ జీవితాన్ని గడిపిన మహోన్నతుడు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చి.. మార్క్సిస్టు విలువలకు, విధానాలకు కట్టుబడి.. తుది శ్వాస విడిచేవరకూ ప్రజల బాగోగుల కోసం తపించిన నిస్వార్థ ప్రజా సేవకుడు. తన జీవితంలో ఎన్నో విజయాలు, అపజయాలు ఎదురైనా స్థితప్రజ్ఞతతో ముందుకు సాగిన మార్క్సిస్టు సైనికుడు. ప్రభుత్వ సారధిగా పశ్చిమ బెంగాల్ ప్రజలకూ, కమ్యూనిస్టుగా దేశానికీ సేవలందించి.. తన 80వ యేట దీర్ఘకాలిక అనారోగ్యంతో ఆ2024 గస్టు 8 ఉదయం కన్నుమూశారు బుద్ధదేవ్. ప్రభుత్వ లాంఛనాలతో తన అంత్యక్రియలు జరపకూడదన్నది ఆయన చివరి కోరిక. తాను కోరుకున్న విధంగానే 'గన్ సెల్యూట్' లేకుండా ఆయన భౌతికదేహాన్ని ఎన్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు. తన మరణానంతరం కళ్లు అవసరమైన వారికి అమర్చేలా, భౌతిక దేహం వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసుకున్నారు. బెంగాల్ ప్రజానీకం నిబద్ధతగల మార్క్సిస్టు యోధునికి కన్నీటి వీడ్కోలు పలికింది.

బుద్ధదేవ్ ఉత్తర కలకత్తాలోని ఓ బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో 1944 మార్చి 1వ తేదీన జన్మించారు. తాత కృష్ణచంద్ర స్మృతి తీర్థ సంస్కృత పండితుడు. తండ్రి నేపాల్‌చంద్ర. బెంగాలీ కవి సుకాంత భట్టాచార్య నేపాల్ చంద్ర వారి బంధువు. బుద్ధదేవ్ శైలేంద్ర సర్కార్ విద్యాలయంలో విద్యనభ్యసించారు. కోల్‌కతా ప్రెసిడెన్సీ కళాశాలలో బెంగాలీ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. బెంగాలీలో బిఏ డిగ్రీ పొందారు. దమ్‌దమ్‌లోని ఆదర్శ్ శంఖ విద్యామందిర్‌లో కొంతకాలం ఉపాధ్యాయుడుగా పనిచేశారు. విద్యార్థి సంఘాల ద్వారా 1966 లో ప్రజాతంత్ర ఉద్యమంలో ప్రవేశించి ఆ తరువాత సిపిఐ(ఎం) లో చేరారు. బెంగాల్ అగ్రనేత ప్రమోద్‌దాస్ గుప్తా.. బుద్ధదేవ్‌లోని నాయకత్వ లక్షణాలు గుర్తించారు. బిమన్ బసు, అనిల్ బిస్వాస్, సుభాష్ చక్రవర్తి, శ్యామల్ చక్రవర్తి వంటి నేతలకు రాజకీయ గురువుగా ఉన్న ప్రమోద్.. బుద్ధదేవ్ రాజకీయ నాయకత్వ అభివృద్ధికీ తోడ్పడ్డారు. 1968లో డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) బెంగాల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వియత్నాం సంఘీభావ కమిటీలో ముఖ్య భూమిక పోషించారు. 1971లో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఎన్నికయ్యారు. హోచిమిన్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా వియత్నాంలో పర్యటించారు. 1977 అసెంబ్లీ ఎన్నికల్లో కొస్సిపూర్ నుంచి సిపిఐ(ఎం) అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో సిపిఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష సంఘటన తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. జ్యోతిబసు ముఖ్యమంత్రి అయ్యారు. ఆ మంత్రివర్గంలో బుద్ధదేవ్ సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రిగా నియమితులయ్యారు. ఎమ్మెల్యే కావడమూ, మంత్రి కావడమూ ఒకేసారి జరిగాయి. అప్పటికి ఆయన వయసు 33 సంవత్సరాలు. 1982 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందారు. ఈ సమయంలో ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ బాధ్యతల్లోకి వచ్చారు. అప్పుడే ప్రమోద్‌దాస్ గుప్తాతో కలిసి చైనాలో పర్యటించారు. 1984లో కేంద్ర కమిటీకి శాశ్వత ఆహ్వానితుడుగా నియమితులయ్యారు. 1985లో పార్టీ జాతీయ మహాసభలో కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఐదేళ్లపాటు పార్టీ బాధ్యతలను నిర్వహించారు. 1987 అసెంబ్లీ ఎన్నికల్లో జాదవ్‌పూర్ నుంచి విజయం సాధించి వామపక్ష ప్రభుత్వంలో సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రిగా చేరారు. ఓ అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించారని ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడంతో 1993లో మంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పటికి జ్యోతిబసు 16 యేళ్లుగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. వృద్ధాప్యం కారణంగా ఆయనకు ప్రభుత్వంలో తనతో సమానంగా పనిచేసే ఇతరుల సహకారం అవసరమైంది. ఆ సమయంలో బుద్ధదేవ్‌ను మంత్రి మండలిలోకి తీసుకున్నారు. ఈసారి ఆయనకు హోం మంత్రిత్వ బాధ్యతలు అప్పగించారు. మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగిన తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు.

వృద్ధాప్యమూ, అనారోగ్యమూ వల్ల జ్యోతిబసు ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకున్నాక, ఆ స్థానంలో బుద్ధదేవ్ నియమితులయ్యారు. 2000 సంవత్సరంలో బుద్ధదేవ్ పార్టీ పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. మరుసటి సంవత్సరం (2001) జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష సంఘటనకు నాయకత్వం వహించి అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిపెట్టారు.

జ్యోతిబసు పాలనా కాలంలో భూ సంస్కరణలను చేపట్టి విజయవంతంగా పూర్తి చేయగా.. మలి అడుగుగా పారిశ్రామికీకరణ కోసం కేంద్ర సహకారంతో హాల్దియా వంటి పెట్రోకెమికల్ కర్మాగారాలను స్థాపించారు. దీన్ని అందిపుచ్చుకున్న బుద్ధదేవ్ రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించేందుకు ఎనలేని కృషి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పరిశ్రమలు, సేవలను అభివృద్ధి చేశారు. 2003లో

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...


1. మార్క్సిస్టు విలువల మేలి ముత్యం
కామ్రేడ్ బుద్ధదేవ్
యు రామకృష్ణ........2

2. సిపిఐ(ఎం) కార్యక్రమం: వ్యూహం, ఎత్తుగడలపై వివరణ
మాకినేని బసవపున్నయ్య........4

3. కొత్త క్రిమినల్ చట్టాలు : ప్రజా హక్కులు
సుంకర రాజేంద్రప్రసాద్........9

4. జమ్మూ-కాశ్మీర్‌లో పెరిగిన తీవ్రవాద కార్యకలాపాలు
అశుతోష్ శర్మ........ 13

5. అభ్యుదయ సాంస్కృతికోద్యమ చరిత్ర : ఒక పరిశీలన .......17

6. ఉత్తర భారత రాజ్యాధిపత్య పోరులో మూడు సామ్రాజ్యాలు
ఎంవిఎస్ శర్మ........24

7. ఆదాయం కేంద్రానికి ఖర్చులు రాష్ట్రాలకి
ఎం సురేష్ బాబు........ 27

8. ఖజానా రాజకీయాలు ........29

9. అక్రమాల ఊబిలో సెబి ఛైర్మన్
ఎ కోటిరెడ్డి........ 33



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org


# హత్యాచారం

కొల్‌కతాలోని ఆర్‌జి కార్ వైద్య కళాశాల హాస్పటల్‌లో ఆగస్టు 9న మహిళా ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అతి కిరాతక అత్యాచారం, హత్య ఘటన ప్రజానీకంలో తీవ్రమైన ఆగ్రహావేశాలు రగిలించడమే కాక మన దేశంలో పితృస్వామిక భావజాలం మహిళల మానప్రాణాలకు విలువ లేకుండా ఎంత నీచంగా వ్యవహరిస్తున్నదో మరోసారి లోకానికి చాటి చెప్పింది. ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, హాస్పిటల్ అధికారులు ప్రవర్తించిన తీరూ, హత్యాచారాన్ని కప్పిపుచ్చడానికి అందరూ కలిసి చేసిన, చేస్తున్న కుట్రలు సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునేట్లు చేస్తున్నాయి. చివరికి కొల్‌కత్తా హైకోర్టు జోక్యం చేసుకుంటే గానీ యంత్రాంగంలో కదలిక రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో తెలుస్తుంది.

అతి కిరాతకమైన ఈ ఘటనకు వ్యతిరేకంగా డాక్టర్లు ఆందోళన చేపట్టారు. అది తొందరలోనే దేశమంతటికీ వ్యాపించింది. ఆగస్టు 15వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశప్రజల నుద్దేశించి సుదీర్ఘ ఉపన్యాసం చేస్తున్న సమయంలోనే డాక్టర్లు ఆగస్టు 14 రాత్రి జాగరణ జరిపారు. దేశవ్యాపితంగా జూనియర్ డాక్టర్లు సమ్మె జరిపారు. మహిళా సంఘాలు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ వంటి ప్రజా సంఘాలు నిరసన ప్రదర్శనల్లో పెద్దఎత్తున పాల్గొన్నాయి.

యువ డాక్టర్ శరీరంపై రక్తమోడుతున్న గాయాలు కనిపిస్తున్నప్పటికీ ఆసుపత్రి అధికారులు ఆమె ఆత్మహత్య చేసుకున్నదని తొలుత బుకాయించారు. కొల్‌కతా పోలీస్ కమిషనర్ అడుగడుగునా కేసును నీరుగార్చడానికి ప్రయత్నించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ బాధితురాలిపైనే ఎదురు ఆరోపణలు చేశారు. సందీప్ ఘోష్ వ్యవహారశైలిపై తీవ్రమైన విమర్శలు రావడంతో రాజీనామా చేసిన అతన్ని కొద్ది గంటల్లోనే కొల్‌కొతా లోని మరో ఆసుపత్రి ప్రిన్సిపాల్‌గా నియమించడం, నిరసన వ్యక్తం చేసిన డాక్టర్లపైకి పాలక తృణమూల్ కాంగ్రెస్ గూండాలు దాడికి దిగి భీభత్సం సృష్టించడం దీని వెనుక పాలక రాజకీయ నేతల హస్తం ఉందన్న అనుమానాలను బలపరిచాయి.

ప్రజాగ్రహం ప్రబలడంతో పోలీసులు ఆగస్టు 17న సంజయ్ రాయ్ అనే ఒక ప్రభుత్వ వాలంటీర్‌ను అరెస్టు చేసి అనుమానితునితునిగా కోర్టు ముందు హాజరుపరిచారు. పాక్షిక పోలీసు అధికారాలు గల ఈ వాలంటీర్లను తృణమూల్ పార్టీ తన ప్రత్యర్థుల మీద దాడులకు ఉపయోగిస్తుంది. సంజయ్ రాయ్‌పై గతంలో అవినీతి, ఇతర ఆరోపణలున్నాయి. దీన్నిబట్టి మొత్తం వ్యవహారాన్ని కప్పిపుచ్చడానికి పై స్థాయినుండి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి.

ఏమైనా మన దేశంలో ఇటీవలి కాలంలో మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, పెరిగిపోవడమే కాకుండా నేరస్తులను కాపాడే ప్రయత్నాలు కూడా అధికమయ్యాయి. దేశానికి ఒలింపిక్ పతకాలు సాధించిన మహిళా రెజిలెర్లు ఒక బిజెపి ఎంపీ వేధింపులనుండి తమను తాము కాపాడుకోడానికి రోడ్లమీద ఆందోళన చేయాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. జాతీయ నేర పరిశోధనా సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం భారత దేశంలో ప్రతి రోజూ 86 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నారు.


ఈ ఘటన ప్రతిపక్ష పాలిత రాష్ట్రంలో జరిగింది గనుక రాష్ట్రపతితో సహా బిజెపి నేతలందరూ బెంగాల్ ప్రభుత్వంపై విరుచుకు పడుతున్నారు. కానీ బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రతినిత్యం మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు జరుగుతున్నాయి. వీటిలో పాలక పార్టీ నేతల పాత్ర ఉన్న ఘటనలు అనేకం. ఈ ఘటనలపై మాట్లాడని బిజెపి బెంగాల్‌లో ఘటనను రాజకీయంగా ఉపయోగించుకోడానికి చూడ్డం దారుణం. అలాగే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జరిగిన దారుణాన్ని ఖండించి దోషులను శిక్షించడానికి బదులు కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం ఘోరం. రాజకీయాలు పక్కనపెట్టి సమస్యకు పరిష్కారం చూడ్డం ముఖ్యం.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ చట్టం వంటి చట్టాలు ఎన్నున్నా అత్యాచారాలు తగ్గడం లేదు. సమాజంలో రానురాను మరింత లోతుగా పాతుకు పోతున్న మహిళా వ్యతిరేక సాంస్కృతిక వాతావరణమే దీనికి కారణం. పెట్టుబడిదారీ వ్యవస్థ, వినిమయదారీ తత్వం, పితృస్వామిక భావజాలం, మహిళలను అణచివేసే మనువాద ఆచారవ్యవహారాలను అందలమెక్కించడం మొదలైనవన్నీ..వారిపై అత్యాచారాలు పెరగడానికి కారణమవుతున్నాయి. మహిళలపై నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించడంతోపాటు ఇటువంటి కుళ్లిపోయిన సంస్కృతి స్థానంలో సమానత్వం, సమన్యాయంతో కూడిన సమాజ నిర్మాణానికి ఐక్యంగా కృషి చేసే క్రమంలోనే ఇటువంటి నేరాలు అరికట్టబడతాయి.

**ఈ మాసం ముఖ్యాంశం**

# సిపిఐ(ఎం) కార్యక్రమం: వ్యూహం, ఎత్తుగడలపై వివరణ

మాకినేని బసవపున్నయ్య



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వ్యవస్థాపక నాయకుల్లో ఒకరు. సిద్ధాంతవేత్త, సిపిఐ(ఎం) కార్యక్రమ రూపశిల్పి. పార్టీ తొలి పొలిట్‌బ్యూరోలో సభ్యులు

మార్క్సిస్టు–లెనినిస్ట్ పార్టీ కార్యక్రమం ప్రధానంగా విప్లవ దశ, వర్గ వ్యూహం, విప్లవ స్వభావం వంటి అంశాలను వివరిస్తుంది. ఎత్తుగడలకు సంబంధించిన అంశాలకు సాధారణంగా కార్యక్రమంలో స్థానం ఉండదు. అయితే, వీటిపై చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోకూడదని కార్యక్రమం ఎక్కడా చెప్పలేదు. అదే సమయంలో ఆ నిర్ణయాలను పార్టీ కార్యక్రమంలో చేర్చడాన్ని కూడా నిషేధించలేదు. మన ప్రస్తుత పార్టీ కార్యక్రమం.. ఎత్తుగడలకు సంబంధించిన అనేక ప్రతిపాదనలను చర్చిస్తుందన్న విషయాన్ని తెలివైన చదువరులు ఎవరైనా సులభంగా గుర్తిస్తారు. అయినప్పటికీ ఆ అంశాలకు సంబంధించిన ప్రశ్నలను చర్చించి, నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ కార్యక్రమం సరైన వేదిక కాదు. విప్లవోద్యమం ఎదుర్కొనే ఆటుపోట్లు, ఎప్పటికప్పుడు అంచనా వేయవలసిన ఇతర విషయాల వలన ఎత్తుగడల అంశాలు ఎప్పటికప్పుడు మారుతుండటమే దీనికి కారణం.

కానీ జాతీయం, అంతర్జాతీయ పరిస్థితుల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నప్పుడల్లా పార్టీ కార్యక్రమం మార్చడం జరగదు. రాజకీయ పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పుల ఆధారంగా ఎత్తుగడలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. దానికి భిన్నంగా కార్యక్రమం విప్లవదశ అంతటికీ వర్తిస్తుంది. గత ఇరవై సంవత్సరాల్లో నిర్దిష్ట పరిస్థితుల కనుగుణంగా మన పార్టీ మహాసభ, పొలిట్ బ్యూరో. కేంద్ర కమిటీలు అనేకసార్లు ఎత్తుగడలను మార్చుకున్నాయి. అయినప్పటికీ పార్టీ కార్యక్రమంలో ఎటువంటి మార్పూ చోటుచేసుకోకపోవడమే దీనికి ఉదాహరణ. దీని అర్థం పార్టీ కార్యక్రమాన్ని సవరించడం గానీ, విస్తృతపరచడంగానీ సాధ్యం కాదు అనా? కాదు. అవసరాన్ని బట్టి పార్టీ కార్యక్రమాన్ని మహాసభ ద్వారా మాత్రమే సవరించగలం, లేదా విస్తృతపరచగలం. జాతుల స్వయం నిర్ణయాధికారంపై 1971లో జరిగిన తొమ్మిదవ పార్టీ మహాసభ చేసిన సవరణ ఇటువంటిదే. భారతీయ పరిస్థితులకు ఆ అంశాన్ని నిర్దిష్టంగా అన్వయించి మహాసభ ఆ సవరణను ఆమోదించింది.

వ్యూహం, ఎత్తుగడలు పరస్పరం సంబంధం లేనివనీ, ఒకదానికి మరొకటి పూర్తిగా వేరు అని భావించడం సరి కాదు. వ్యూహంలో భాగంగా ఎత్తుగడలు ఉండాలి. మరో మాటలో చెప్పాలంటే ఎత్తుగడలకు సంబంధించిన నిర్ణయాలన్నీ వ్యూహంలోంచే రావాలి. పార్టీ కార్యక్రమంలో వివరించిన వ్యూహాలు, వాటిపైన లోతైన అవగాహన ఎప్పటికప్పుడు సరైన ఎత్తుగడలను రూపొందించడంలో మనకు మార్గదర్శనం చేస్తాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మితవాద సంస్కరణవాదో, వామపక్ష పిడివాదో మన కార్యక్రమాన్ని అర్థం చేసుకుని, వ్యాఖ్యానించే తీరు తప్పుడు వ్యూహాలను రూపొందించడానికి, విప్లవ లక్ష్యాన్ని ప్రమాదంలో పడేయడానికి దారి తీస్తుంది. ఒక విధంగా వ్యూహం, ఎత్తుగడలు పరస్పరం ఆధారపడి ఉంటాయి. పార్టీ కార్యక్రమం మీద లోతైన అవగాహన ఉంటే తప్ప ఏ పార్టీ సభ్యుడు కానీ, పార్టీ కమిటీ గానీ సమస్యలమీద ఎప్పటికప్పుడు సరైన ఎత్తుగడలను రూపొందించి, అమలు చేయలేరని స్పష్టంగా చెప్పవచ్చు. దీన్ని బట్టి పార్టీ కార్యక్రమంలోని వివిధ ప్రతిపాదనలను, కోణాలను పదేపదే చదవడం ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలమని స్పష్టమౌ తుంది. ఈ అధ్యయనం, ఆచరణల నుండి మాత్రమే పార్టీ సభ్యులు మన కార్యక్రమంలోని మార్క్సిస్టు–లెనినిస్ట్ సారాంశాన్ని గ్రహించగలరు.

మన పార్టీలోని సాధారణ శ్రేణుల విషయం అలా ఉంచితే, కార్యకర్తలు, నాయకులు ఈ తరహా క్రమ పద్ధతిలో అధ్యయనం చేస్తున్నారా? అన్నది ప్రశ్న. అందుకే మనం పార్టీ కార్యక్రమాన్ని మన కార్యకర్తలు పదేపదే చదవడం, అధ్యయనం చేయడం గురించి నొక్కి చెప్పాలి. అప్పుడు మాత్రమే మన పార్టీ సభ్యులు, కార్యకర్తలు అర్థం చేసుకోవడం, దానిని ప్రస్తుత జాతీయ , అంతర్జాతీయ పరిణామాలకు తగ్గట్టుగా వర్గ పరిస్థితులపై నిర్దిష్టంగా అన్వయింపచేయడం సాధ్యమవుతుంది.

**మన విప్లవ దశను ఎలా నిర్ణయించాం ?**

మొదటి అంశం. మార్క్సిస్టు–లెనినిస్ట్ ప్రమాణాల ప్రకారం ప్రతి విప్లవం దాని సొంత ప్రత్యేక దశలను కలిగిఉంటుందన్నది ప్రాథమిక వాస్తవం. సామ్రాజ్యవాదం, ప్రపంచ సోషలిస్టు విప్లవ యుగంలో అంతర్జాతీయ, అంతర్గత పరిస్థితుల ప్రాతిపదికగా వర్గ శక్తుల ఖచ్చితమైన అంచనా, వర్గ పొందిక ఆధారంగా ఏదైనా విప్లవం యొక్క దశను నిర్ణయిస్తాం. మనది కేవలం సామ్రాజ్యవాద యుగం మాత్రమే కాదు. సోషలిస్టు విప్లవం సందర్భంగా లెనిన్ తన క్లాసిక్ రచన 'సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారి విధానపు అత్యున్నత దశ' గ్రంథంలో 'శ్రామిక వర్గం యొక్క సామాజిక విప్లవానికి ముందు దశగా

**“ ‘మన దేశం భారత్, పాకిస్తాన్‌లుగా విభజించ బడింది. 1947 ఆగస్టు 15న భారతదేశంలో రాజకీయ అధికారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు బదిలీ చేయ బడింది. ఆ విధంగా భారతదేశంలో బ్రిటిష్ రాజకీయ పాలన ముగిసింది. భారతీయ బూర్జవా నేతృత్వంలో రాజ్యం అవతరించింది. దీనితో భారతీయ విప్లవం యొక్క మొదటి దశ, విదేశీ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా నిర్ధేశించిన సాధారణ జాతీయ ఐక్య ఫ్రంట్ దశ ముగిసింది’ ”**

సామ్రాజ్యవాదాన్ని పేర్కొన్నారు. సోషలిస్టు విప్లవ సాధనలో సామ్రాజ్యవాదాన్ని ఒక యుగంగా లెనిన్ అభివర్ణించిన దశ నుండి ప్రపంచ చరిత్రలో మనం చాలా దూరం ప్రయాణం చేశాము.

సోషలిస్టు విప్లవం రష్యాలో విజయం సాధించడం మాత్రమే కాదు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిస్టు వ్యతిరేక కూటమి గెలుపొందింది ఆసియా, యూరప్, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అనేక దేశాల్లో సోషలిస్టు విప్లవాలు పై చేయి సాధించాయి. దీంతో ప్రపంచ సోషలిస్టు శిబిరం ఆవిర్భవించింది. 1957, 1960ల నాటి రెండు ప్రపంచ కమ్యూనిస్టు పత్రాలు ఈ కొత్త యుగానికి సంబంధించిన వివరణాత్మక వర్ణనను ఇచ్చాయి. 1957 నాటి డాక్యుమెంట్ ‘మన యుగం యొక్క ప్రధాన అంశం పెట్టుబడి దారి విధానం నుండి సోషలిజానికి పరివర్తన చెందడం. ఇది రష్యాలో జరిగిన ‘అక్టోబర్ మహా విప్లవం ద్వారా ప్రారంభమైంది’ అని పేర్కొంది. 1960వ సంవత్సరంలో 81 పార్టీలు కలిసి ప్రచురించిన డాక్యుమెంట్‌లో ప్రస్తుత యుగం గురించి ‘మన కాలం అక్టోబర్ మహా సోషలిస్టు విప్లవం ద్వారా పెట్టుబడి దారి విధానం నుండి సోషలిజానికి పరివర్తన చెందే కాలం. ఇది రెండు వ్యతిరేక సామాజిక వ్యవస్థల మధ్య పోరాట కాలం. సోషలిస్టు విప్లవాలు, జాతీయ విముక్తి విప్లవాల కాలం. సామ్రాజ్యవాద విచ్ఛిన్న కాలం. వలసవాద వ్యవస్థ నిర్మూలన జరుగుతున్న కాలం. సోషలిస్టు మార్గంలోకి ఎక్కువ మంది ప్రజలు మారే సమయమిది! అంతర్జాతీయ స్థాయిలో సోషలిజం, కమ్యూనిజం సాధించిన విజయ మిది.’ అని పేర్కొన్నారు. 1957, 1960 సంవత్సరాలలో జరిగిన రెండు ప్రపంచ ప్రసిద్ధ కమ్యూనిస్టు సమావేశాలు ‘సమాజ అభివృద్ధిలో ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ నిర్ణయాత్మక అంశంగా మారడం మన కాలపు ప్రధాన లక్షణం’ అని పేర్కొన్నాయి. ఈ మాటలు పావు శతాబ్ధం క్రితం చెప్పారు. అక్కడ వివరించిన కొత్త యుగం యొక్క వర్గ సమాచారం మరింతగా సంపన్నమైంది.

పైన పేర్కొన్న ప్రకటనలపై అప్పుడు ఐక్య కమ్యూనిస్టు పార్టీ సిపిఐగా ఉన్న మన పార్టీ కూడా సంతకం చేసింది. అప్పటి పార్టీ నాయకత్వపు మితవాద, రివిజనిస్టు విధానాలు, ఆచరణ నుండి మనం వేరుపడ్డప్పటికీ, ఆ రెండు పత్రాల్లో పేర్కొన్న అంతర్జాతీయ పరిణామాల అంచనాల నుండి విడగొట్టుకోలేదు. కేవలం విడగొట్టుకోకుండా ఉండటమే కాకుండా ఆ రెండు పత్రాల్లో పేర్కొన్న విప్లవసూత్రాలకు మన ధృడ విధేయతను, సానుకూలతను పునరుద్ఘా టించాము. మన పార్టీ కార్యక్రమం ‘మన దేశ ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం పోరాడుతూనే ప్రపంచ వ్యాప్తంగా జాతీయ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం, శాంతి కోసం జరుగుతున్న పోరాటాల్లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తన వంతు కృషి చేసింది’ అని పేర్కొంది. మన పార్టీ 1960 నవంబర్‌లో మాస్కోలో జరిగిన 81 మార్క్సిస్ట్–లెనినిస్ట్ పార్టీల ప్రతినిధుల ప్రకటనను, అలాగే ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని విప్లవాత్మకంగా విశ్లేషించే 1957 నాటి డిక్లరేషన్‌ను గట్టిగా సమర్ధిస్తోంది. ఈ రెండు మార్క్సిస్టు– లెనినిస్టు పత్రాలు అత్యంత గొప్పవైనవిగా, ప్రపంచ కమ్యూనిస్టులందరికీ, శ్రామిక వర్గానికి, అన్ని ప్రగతి శీల శక్తులకు అమూల్యమైన మార్గదర్శకాలుగా ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వీటి విప్లవాత్మక సూత్రాలను సమర్ధిస్తుంది. మనం మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాల స్వచ్ఛతను సమర్ధిస్తాము. అన్ని రివిజనిస్టు, పిడివాదాల ప్రభావాల నుండి కాపాడతాము. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని చుట్టుముట్టి. ప్రధాన ముప్పుగా మారిన ఆదునిక రివిజనిజంతో పోరాడతామని ప్రతిజ్ఞచేస్తూనే, పిడివాద లోపాల గురించి కూడా ఏకకాలంలో పార్టీ హెచ్చరిస్తోంది. మన పార్టీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను బలోపేతం చేయడానికి పోరాడు తుంది. కొత్త యుగంలో ప్రతి దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగా అందుబాటు లోకి వచ్చిన అవకాశాలు వాస్తవికతగా రూపాంతరం చెందడానికి ఈ ఐక్యత ఒక్కటి మాత్రమే నమ్మదగిన హామీ.

మనది శ్రామిక వర్గ అంతర్జాతీయవాద పార్టీ. ఈ రెండు ప్రపంచ కమ్యూనిస్టు సమావేశాలు చేసిన రాజకీయ శక్తుల అంతర్జాతీయ స్థాయి అంచనాకు మనం కట్టుబడి ఉంటాము. అయితే, ఈ సాధారణ సూత్రాలకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేసినంత మాత్రాన సరిపోదు. మనం మన దేశంలోని వర్గ సంబంధాలను నిర్ధిష్టంగా అంచనా వేయాలి. ఇది మరింత కష్టతరమైన, కఠినమైన పని. నిర్ధిష్ట పరిస్థితులకు నిర్ధిష్టంగా దానిని వర్తింపచేడయం ద్వారా మార్క్సిస్టు లెనినిస్టు అవగాహన ఇక్కడే పరీక్షకు గురవు తుంది. 1963–67 సంవత్సరాలలో పార్టీలో జరిగిన సంఘటనల ప్రకారం మూడు విభిన్న ధోరణలు తలెత్తాయి. మొదటి దానికి సిపిఐ జాతీయ కౌన్సిల్‌లోని మెజార్టీ ప్రాతినిధ్యం వహించింది. రెండవ దృక్కోణాన్ని నేషనల్ కౌన్సిల్‌లో మైనార్టీగా ఉన్న 32 మంది సభ్యుల తో పాటు అప్పటి పార్టీ సభ్యత్వంలోని పెద్దభాగం సమర్ధించింది. ఆ తరువాత మూడవ ధోరణి వచ్చింది. ఇది వామపక్ష తీవ్రవాదానికి ప్రాతినిధ్యం వహించింది. నక్సలిజంగా గుర్తింపు పొందింది. ఈ మూడు శక్తులు తమలో ఎవరు నిజమైన మార్క్సిస్టు, లెనినిస్టులని ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారు. భారతదేశం, ప్రపంచ శక్తుల నిర్ధిష్ట తరగతులను ఎవరు సరిగా అంచనా వేశారని, మన దేశంలో నిర్ధిష్ట పరిస్థితులకు అనుగుణంగా సిద్ధాంతాన్ని ఎవరు సరిగా అన్వయింపచేస్తున్నారన్న విషయంలోనూ తీవ్ర పోటీ సాగుతోంది.

మన విప్లవ దశ గురించి మన పార్టీ కార్యక్రమం ఏం చెబుతోంది? ‘మన దేశం భారత్, పాకిస్తాన్‌లుగా విభజించబడింది. **1947 ఆగస్టు 15న భారతదేశంలో రాజకీయ అధికారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు బదిలీ చేయబడింది. ఆ విధంగా భారతదేశంలో బ్రిటిష్ రాజకీయ పాలన ముగిసింది.** భారతీయ బూర్జవా నేతృత్వంలో రాజ్యం అవతరించింది. దీనితో భారతీయ విప్లవం యొక్క మొదటి దశ, విదేశీ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా నిర్ధేశించిన సాధారణ జాతీయ

**❝ రాజకీయ అధికారం కాంగ్రెస్ పార్టీ చేతుల్లోకి రాక ముందు, సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్‌లో భాగంగా విప్లవ శ్రామిక వర్గ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ దానికి మద్దతు ఇచ్చాయి. అయితే, రాజకీయ అధికారం చేతులు మారిన తరువాత కూడా సిపిఐ అదే వర్గ కూటమి వ్యూహాన్ని అనుసరిస్తోంది. బూర్జువా శక్తుల రాజకీయ పార్టీయైన భారత జాతీయ కాంగ్రెస్‌తో శ్రామికవర్గం ఐక్య ఫ్రంట్ కట్టడమే ఆ వ్యూహం. ❞**

ఐక్య ఫ్రంట్ దశ ముగిసింది' అని పేర్కొంది. (3వ పేరా, వక్కాణింపు చేర్చబడింది)

మనం అక్కడితో ఆగిపోలేదు. పార్టీ కార్యక్రమం భారత విప్లవం యొక్క రెండవ దశ లక్ష్యాలను నెరవేర్చడం కోసం భూస్వామ్య , అర్ధ భూస్వామ్యాన్ని పూర్తిగా రద్దు చేసి, వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేసింది. దేశంలోని బ్రిటిష్ మూలధనాన్ని జప్తు చేసి, జాతీయం చేయాలని కూడా పార్టీ కార్యక్రమం డిమాండ్ చేసింది. దీనివల్ల మన జాతీయ ఆర్థిక వ్యవస్థపై విదేశీ గుత్తాధిపత్య పెట్టుబడి దోపిడి పట్టు తొలుగుతుందని పేర్కొంది. (పేరా 8)

("బ్రిటిష్ పెట్టుబడిని జాతీయం చేసే" స్థానంలో మనం ఇప్పుడు "అన్ని రకాల విదేశీ గుత్త పెట్టుబడులను" జాతీయం చేయాల్సి ఉంది –ఎంబి)

మన పార్టీ ఏడవ మహాసభ జరిగిన ఆరువారాల తరువాత సిపిఐ తన ఏడవ మహాసభను నిర్వహించుకుంది. ఈ మహాసభలో సిపిఐ తన ప్రత్యేక కార్యక్రమాన్ని ఆమోదించి, అమలుకు స్వీకరించింది. భారత విప్లవ దశ గురించి ఆ కార్యక్రమం ఏం చెబుతోంది? తన కార్యక్రమంలోని 9వ పేరాలో సిపిఐ కూడా 'సామ్రాజ్యవాదం నుండి జాతీయ స్వాతంత్ర్యం సాధించడంతో భారత విప్లవం యొక్క ఒక దశ ముగిసింది. విప్లవాన్ని మరింత కొత్త దశకు తీసుకుపోవాలని మన ప్రజలకు పిలుపునివ్వాల్సి ఉంది. అసంపూర్ణంగా ఉన్న సామ్రాజ్యవాద వ్యతిరేక, భూ స్వామ్య వ్యతిరేక లక్ష్యాలను సాధించడం, జాతీయ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేయడం తదితర లక్ష్యాలను పూర్తి చేయడమే ఆ నూతన దశ' అని పేర్కొంది. భారతీయ విప్లవ దశకు సంబంధించి రాజకీయ అధికారం భారతీయుల చేతుల్లోకి బదిలీ అయిన తరువాత విప్లవం మొదటి దశ ముగిసి, రెండవ దశలోకి ప్రవేశించిందని రెండు కార్యక్రమాలు అంగీకరించిన తరువాత సిపిఐ(ఎం)కు, సిపిఐకి మధ్య తేడా ఎక్కుడుందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇక్కడ సిపిఐ నాయకులు చేసిన మోసం, ఆత్మవంచన ఉంది. వర్గశక్తుల పొందిక, దాని నుండి అనుసరించే వర్గ వ్యూహం ఆధారంగా విప్లవం యొక్క దశ నిర్ణయించబడుతుంది. లెనినిజం బోధించేది అదే. కానీ, సిపిఐ నాయకుల చేతుల్లో లెనినిజం అద్వితీయమైన మార్పునకు గురైంది. రాజకీయ అధికారం బ్రిటిష్ సామ్రాజ్య వాదుల చేతుల నుండి కాంగ్రెస్ నాయకులకు బదిలీ అయిన తరువాత విప్లవ దశ మారుతుంది. కానీ, విప్లవ సాధన కోసం ఏర్పడాల్సిన వర్గ శక్తుల కూటమి (వర్గ వ్యూహం)ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట సమయంలో మాదిరే ఎటువంటి మార్పు లేకుండా ఉంచారు. అంటే జాతీయ విముక్తి దశ!

రాజకీయ అధికారం కాంగ్రెస్ పార్టీ చేతుల్లోకి రాకముందు, సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్‌లో భాగంగా విప్లవ శ్రామిక వర్గ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ దానికి మద్దతు ఇచ్చాయి. అయితే, రాజకీయ అధికారం చేతులు మారిన తరువాత కూడా సిపిఐ అదే వర్గ కూటమి వ్యూహాన్ని అనుసరిస్తోంది. బూర్జువా శక్తుల రాజకీయ పార్టీయైన భారత జాతీయ కాంగ్రెస్‌తో శ్రామికవర్గం ఐక్య ఫ్రంట్ కట్టడమే ఆ వ్యూహం. అధికారాన్ని పొందిన తరువాత కూడా కాంగ్రెస్‌తో ఫ్రంట్ కొనసాగించాలని సిపిఐ చెప్పింది. ఒక వర్గం నుండి (బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి) రాజకీయ అధికారం భారత బూర్జువాల చేతుల్లోకి మారినా సిపిఐ "విప్లవకారులకు" ఎటువంటి మార్పూ కనిపించలేదు.

ఇది రష్యా విప్లవంలోని ఒక అధ్యాయాన్ని మనకు గుర్తుకు తెస్తుంది. రష్యాలో 1917 ఫిబ్రవరి విప్లవం ముగిసిన తరువాత కూడా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ (బి) నాయకులు బూర్జువా డెమొక్రటిక్ విప్లవం పూర్తి కాలేదన్న అవగాహనతో విప్లవ వ్యూహాన్ని మార్చకూడదని వాదించేవారు. దీంతో లెనిన్ ఎంతో ప్రయాసపడి రష్యాకు వచ్చి తన ప్రపంచ ప్రసిద్ధ 1917 ఏప్రిల్ థీసెస్‌ను రూపొందించాల్సి వచ్చింది. కెరెన్‌స్కీ ప్రభుత్వానికి అధికార మార్పిడి జరగడంతోనే రష్యన్ విప్లవ మొదటి దశ ముగిసిందని లెనిన్ బోల్షివిక్ పార్టీ మొత్తానికి చెప్పాల్సివచ్చింది. రష్యన్ విప్లవ మొదటి దశ, దానికి సంబంధించిన వర్గ వ్యూహపు లక్ష్యాలు నెరవేర్చబడ్డాయి గనుక వాటికి కాలం చెల్లినవైపోయిందని బోల్షివిక్కులు గుర్తించినప్పుడు మాత్రమే వారు రష్యన్ విప్లవం యొక్క పూర్తి కాని లక్ష్యాలను పూర్తి చేయగలరని లెనిన్ చెప్పారు. విప్లవం రెండవ దశలోకి ప్రవేశించిందని, ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి, విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడానికి పూర్తిగా కొత్త వర్గ కూటమి అవసరమని ఆయన వాదించారు. ఫిబ్రవరి విప్లవం విజయంతో కొత్త దశలోకి ప్రవేశించిన రష్యా విప్లవం కొత్త వర్గ వ్యూహాన్ని డిమాండ్ చేసింది. అది మొత్తం బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మిక, పేద రైతుల కూటమి యొక్క నూతన వర్గ వ్యూహం! ధనిక రైతాంగంతో సహా మధ్యతరగతి రైతులను తటస్థం చేసేందుకు ప్రయత్నించే వ్యూహమిది. బూర్జువా ప్రజాతంత్ర విప్లవం అసంపూర్తిగా మిగిల్చిన లక్ష్యాలు పూర్తి చేయాలంటే విప్లవాన్ని సోషలిస్టు విప్లవదశకు తీసుకు వెళ్లడమే మార్గం.

సిపిఐ యొక్క 'మార్క్సిస్ట్ లెనినిన్' అవగాహన ప్రకారం భారత విప్లవం యొక్క దశ మారింది. 1947 ఆగస్టులో రాజకీయ అధికారం మార్పిడి తరువాత విప్లవం రెండవ దశకు చేరుకుంది. కానీ, వర్గ వ్యూహం మాత్రం మారలేదు. మొదటి దశలో మాదిరే ఉంది. రాజకీయ శక్తుల వర్గాలను నిర్దిష్టంగా అంచనా వేసిన తరువాతే విప్లవ దశను, వర్గ వ్యూహాన్ని నిర్ణయిస్తాం. వీటిలో మొదటిది మారితే, రెండవది కూడా దానికి అనుగుణంగా మారుతుంది. ఈ సాధారణ వాస్తవాన్ని సిపిఐలోని మార్క్సిస్టులు పట్టించుకోలేదు.

విప్లవం యొక్క దశను ఎలా సరిగ్గా నిర్ణయించాలనే అంశాన్ని ముగించేముందు, మార్క్సిస్టులు పరిగణనలోకి తీసుకోవాల్సిన మూడు ప్రాథమిక అంశాలు ఉన్నాయి.

మొదటిది, ఏదైనా విప్లవం యొక్క దశను విప్లవం జరగే ఆ నిర్దిష్ట కాలం, నాటి జాతీయ– అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో వర్గ శక్తుల పొందికపై నిర్దిష్టంగా వేసిన అంచనా అధారంగా మాత్రమే చర్చించి నిర్ణయించాలి.

రెండవది, నిర్దిష్ట దేశం లేదా రాష్ట్రం యొక్క సామాజిక ఆర్థిక నిర్మాణాన్ని అప్పటి అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో చర్చించి విప్లవ దశను నిర్ణయించాలి. మరో మాటలో చెప్పాలంటే, ఆ దేశం లేదా రాష్ట్రంలోని ఉత్పత్తి శక్తుల స్వభావం, ఫలితంగా ఏర్పడే ఉత్పత్తి సంబంధాల ఆధారంగా నిర్ణయించాలి.

మూడవది, విప్లవ దశను నిర్ణయించ డానికి ఆ దేశంలోని కార్మికవర్గం యొక్క ఐక్యతను, సంసిద్ధతను, విప్లవంలో కలసి వచ్చే ఇతర శక్తులతో దాని ఐక్యతను కూడా మార్క్సిస్టులు తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలని లెనినిజం చెబుతుంది.

విప్లవం యొక్క దశను నిర్ణయించడానికి ఈ మూడు ఉల్లంఘించలేని సూత్రాలు!

విప్లవ దశలను దాటవేస్తూ ఒకేదశలో సోషలిస్టు విప్లవం వస్తుందనే సూత్రీకరణను కూడా లెనిన్ తీవ్రంగా ఖండించారు. దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా, రూపొందించుకునే నిర్దిష్ట వ్యూహాల ఆధారంగా ప్రతి విప్లవానికి తనదైన సొంత దశ ఉంటుందని లెనిన్ చెప్పారు. ఆయన చేసిన పరిశీలన ఈ అంశంపై కొత్త వెలుగునిచ్చింది.

తన ప్రసిద్ధ రచన 'ది ప్రొలెటేరియన్ రివల్యూషన్ అండ్ రెనెగేడ్ కౌట్స్కీ'లో ఆయన 'మనం చెప్పినట్లుగానే విషయాలు జరిగాయి. విప్లవం సాగిన మార్గం మన ఆలోచన సరైనదని నిర్ధారించింది.' అని పేర్కొన్నారు. మొదటిది, రాచరికానికి, భూస్వాములకు, మధ్యయుగ పాలనకు వ్యతిరేకంగా మొత్తం రైతాంగం సాధ్యమైనంత మేరకు విప్లవంలోకి వచ్చారు. ఆ మేరకు అది బూర్జువా ప్రజాస్వామ్య విప్లవంగా మిగిలింది. ఆ తరువాత పేద రైతులు, శ్రామిక వర్గాలు, గ్రామీణ ధనవంతులు, లాభాపేక్షపరులు ఇలా పీడనకు గురవుతున్న వారందరూ పెట్టుడిబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కదిలితే సోషలిస్టు విప్లవంగా మారుతుంది. మొదటిది బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం, రెండవది సోషలిస్టు విప్లవం. వాటి మధ్య కృత్రిమ చైనా గోడకట్టి వాటిని వేరు చేయడానికి ప్రయత్నించడమంటే శ్రామిక వర్గం యొక్క సంసిద్ధత, పేద రైతులతో వారి ఐక్యత స్థానంలో ఉదారవాదాన్ని

**"విప్లవ దశలను దాటవేస్తూ ఒకేదశలో సోషలిస్టు విప్లవం వస్తుందనే సూత్రీకరణను కూడా లెనిన్ తీవ్రంగా ఖండించారు. దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా, రూపొందించుకునే నిర్దిష్ట వ్యూహాల ఆధారంగా ప్రతి విప్లవానికి తనదైన సొంత దశ ఉంటుందని లెనిన్ చెప్పారు. ఆయన చేసిన పరిశీలన ఈ అంశంపై కొత్త వెలుగునిచ్చింది."**

ప్రత్యామ్నాయం చేయడమే! ఇది మార్క్సిజాన్ని వక్రీకరించడం, అసభ్యంగా చిత్రీకరించడమే! (కలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్ 23, పేజి 391)

ఏదైనా ఆధునిక కార్మికవర్గం యొక్క విప్లవం మార్క్సిజాన్ని అంచనా వేయాలంటే పైన పేర్కొన్న అన్ని షరతులనూ పరిగణనలోకి తీసుకోవడం అవసరం. అభివృద్ధి చెందిన, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశంలో విప్లవం వచ్చిందా? లేక వలస, సెమీ వలస దేశాల్లో, లేదా కొత్తగా విముక్తి పొందిన దేశాల్లో విప్లవం వచ్చిందా? అన్న అంశాన్ని కూడా విప్లవం యొక్క దశ, స్వభావాన్ని నిర్ణయించడంలో పరిగణలోనకి తీసుకోవాల్సిన మరో ముఖ్యమైన అంశం.

మన భారతదేశ విప్లవ విషయానికి వస్తే, మనం ఇప్పటికే ఒక దశను దాటాము. అంటే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారతీయ బడా బూర్జువాతో సహా కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజలు కలిసి ఐక్యంగా పోరాడారు. 1947 ఆగస్టులో జాతీయ రాజకీయ స్వాతంత్ర్యం పొందడంతో భారత విప్లవం కొత్త దశలోకి ప్రవేశించింది. ఇది రెండవ దశ! పీపుల్స్ డెమోక్రటిక్ విప్లవం. ఈ రెండవ దశ వర్గ కూటమిలో కార్మికులు, రైతులు, మధ్యతరగతి, బడా యేతర జాతీయ బూర్జువాలు కలిసి... విదేశీ ద్రవ్య పెట్టుబడి సహకారంతో బడా బూర్జువాల నేతృత్వంలో సాగే బూర్జువా,భూస్వాముల వర్గ ప్రభుత్వంతో తలపడతారు. దేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి ఈ ప్రభుత్వం బాటలు వేస్తుంది.

మూడవ దశ సోషలిస్టు విప్లవ దశ. ఈ దశలో సోషలిజం, కమ్యూనిజం నిర్మాణ లక్ష్యంతో కార్మికవర్గం రాజకీయ అధికారాన్ని స్థాపిస్తుంది.

పైన చెప్పుకున్న దాని ప్రకారం భారత విప్లవం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని వర్గాలతో కూడిన సార్వత్రిక ఐక్య సంఘటనను ఇంక ఎప్పటికీ వదిలేసిందనా? అలాగే సామ్రాజ్యవాదం భారత దేశం సంపాదించు కున్న స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారాలను దానికి అలాగే విడిచిపెట్టున్నుందనా? సైద్ధాంతికంగా చెప్పాలంటే అటువంటి నిర్ధారణ తప్పు. భారత స్వాతంత్ర్యాన్ని అణగదొక్కడానికి, రాజకీయ బానిసత్వాన్ని అమలు చేయడానికి సామ్రాజ్యవాదులు మన దేశంలో జోక్యం చేసుకుంటే, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా సాధారణ ఐక్య ఫ్రంట్ మరోసారి తెరపైకి రావచ్చు. అదే విధంగా కొన్ని అనుకూలమైన జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు భారత విప్లవం యొక్క పురోగతిని సులభతరం చేస్తే పీపుల్స్ డెమోక్రటిక్ స్టేట్ స్థాపనకు ముందే మనం సోషలిస్టు దశ, సోషలిస్టు విప్లవం నినాదాన్ని ఎత్తుకోవాల్సి ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే శ్రామికవర్గం యొక్క సంసిద్ధత స్థాయి, పేదలు, దోపిడికి గురవుతున్న వారితో దాని మైత్రి స్థాయి మనల్ని సోషలిస్టు విప్లవ నినాదాన్ని ఇచ్చేలా డిమాండ్ చేయవచ్చు. మార్క్సిస్టు–లెనినిస్టులుగా మనపై దానిని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఉంది. విప్లవం యొక్క ప్రతిదశ, కొన్ని సామాజిక లేదా వర్గ వైరుధ్యాలద్వారా గుర్తించబడుతుంది. వాటిలో ఒకటి ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఉదాహరణకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే సర్వతోముఖ పోరాట దశలో మూడు ముఖ్యమైన వర్గ వైరుధ్యాలు ఉన్నాయి. అవి, కార్మికవర్గం, పెట్టుబడుదారుల మధ్య వైరుధ్యం, రైతులు, భూస్వాముల మధ్య వైరుధ్యం, దేశం, విదేశీ సామ్రాజ్యవాదం మధ్య వైరుధ్యం. జాతీయ విముక్తి దశలో దేశానికీ, సామ్రాజ్య వాదానికీ మధ్య వైరుధ్యం అగ్రస్థానంలో ఉంటుంది. అయితే, రెండవ లేదా ప్రజాస్వామ్య దశలో రైతులకూ, భూస్వాములకూ మధ్య ఉన్న వైరుధ్యం అగ్రస్థానానికి వస్తుంది. అందువల్ల ఈ దశను వ్యవ సాయ లేదా ప్రజాతంత్ర దశ అని కూడా పిలుస్తారు. దీనిలో

❝ వాస్తవానికి మన దేశంలోని ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ వంటి కొన్ని వామపక్ష పార్టీలు, గ్రూపులు తక్షణ కర్తవ్యంగా సోషలిస్టు విప్లవ నినాదాన్ని లేవనెత్తాయి. ఇది విప్లవం ప్రయాణం చేయాల్సిన వివిధ దశలను విస్మరిస్తుంది. సిపిఐ(ఎం) అటువంటి ఆలోచన విధానాన్ని అనుసరించదు. దానిని మార్క్సిస్టు వ్యతిరేకమైనదిగా, అశాస్త్రీయమైనదిగా తిరస్కరి స్తుంది. ❞

ప్రజాస్వామ్య విప్లవానికి ఇరుసుగా వ్యవసాయ విప్లవం ఉంటుంది. మూడవ లేదా సోషలిస్టు దశలో కార్మికులు – పెట్టుబడి దారులు, లేదా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని దోపిడి చేసే వారు –దోపడికి గురయ్యేవారికి మధ్య ఉన్న వైరుధ్యం మిగిలిన అన్ని వైరుధ్యాలకన్నా ముందుకు చేరుతుంది. ఇటువంటి సైద్ధాంతిక స్పష్టత గొలుసు లోని బలహీనమైన లింకును గుర్తించడానికి విప్లవ కార్మిక వర్గ పార్టీకి వీలు కల్పిస్తుంది. విప్లవం యొక్క నిర్దిష్ట దశలో ఏ ఒక్క వైరుధ్యం కూడా స్థిరంగా ఉండదు. అన్ని వైరుధ్యాలు నిరంతరం ముందుకు వస్తుంటాయి. వాటిలో ఒకటి తీవ్రతరం అవుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. విప్లవం యొక్క నిర్దిష్ట దశలో ప్రతి వైరుధ్యపు అభివృద్ధి మిగిలిన వైరుధ్యాల గమనాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ వైరుధ్యాల ఘర్షణ మొత్తం సమాజ అభివృద్ధిని, పురోగతిని వేగవంతం చేస్తుంది.

విప్లవ ప్రతిదశలో ఒక నిర్దిష్ట వైరుధ్యం ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తుందన్నది ఒక వాస్తవం. ఆ నిర్దిష్ట వైరుధ్యాన్ని పరిష్కరించడానికి అత్యంత ఏకాగ్రత పెట్టవలసి వుంటుందన్నది కూడా మరో వాస్తవం. అయితే, దీని అర్థం ఆ నిర్దుష్ట వైరుధ్యం పూర్తిగా లేదా పాక్షికంగా పరిష్కారమవుతుందని కాదు. ఆ వైరుధ్యానికి సంబంధించిన కొన్ని అంశాలు విప్లవపు తదుపరి దశల్లో పరిష్కరింపబడతాయి.

విప్లవపు వివిధ దశల్లో ప్రతి దానినీ ఎందుకు స్పష్టంగా గుర్తించాలి? ప్రతి దశ యొక్క ప్రాధాన్యతను తప్పనిసరిగా నిర్వచించి ఎందుకు గుర్తించాలి? దశలతో నిమిత్తం లేకుండా విప్లవం యొక్క మొత్తం కార్యాచరణలో అంతిమ లక్ష్యమైన సోషలిజం, కమ్యూనిజం ప్రధానమైన నినాదాలుగా ఎందుకు చేయకూడదు? అన్న ప్రశ్నలను అడగవచ్చు. లేదా విప్లవ దశలను నిర్వచించడం, గుర్తించడం, వాటికి తగ్గట్టుగా వ్యూహాలు ఎత్తుగడలు రూపొందించుకోవడం వంటి ఇబ్బందికరమైన శ్రమపడే బదులు వాటన్నింటినీ సోషలిస్టు విప్లవం అనే ఒక దశకు ఎందుకు తగ్గించకూడదు అని కూడా ప్రశ్నించవచ్చు.

వాస్తవానికి మన దేశంలోని ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ వంటి కొన్ని వామపక్ష పార్టీలు, గ్రూపులు తక్షణ కర్తవ్యంగా సోషలిస్టు విప్లవ నినాదాన్ని లేవనెత్తాయి. ఇది విప్లవం ప్రయాణం చేయాల్సిన వివిధ దశలను విస్మరిస్తుంది. సిపిఐ(ఎం) అటువంటి ఆలోచన విధానాన్ని అనుసరించదు. దానిని మార్క్సిస్టు వ్యతిరేకమైనదిగా, అశాస్త్రీయమైనదిగా తిరస్కరిస్తుంది. శ్రామిక వర్గ విప్లవపార్టీగా, మార్క్సిస్టు –లెనినిస్టు ఆలోచనలతో దిశా నిర్దేశం చేయబడిన పార్టీగా ప్రతి దశలోనూ నిర్దిష్ట పరిస్థితులను నిర్దుష్టంగా అధ్యయనం చేస్తూ ఆందోళన, ప్రచారం, కార్యాచరణకు కట్టుబడి పనిచేస్తుంది. అస్పష్టఅంశాల్లో మునిగిపోదు.

సోషలిస్టు నినాదాన్ని తక్షణమే, నేరుగా, ఆచరణ నినాదంగా లేవనెత్తడం, విప్లవ వివిధ దశలను దాటవేయడం కార్మికేతర వర్గమైన ఇతర కష్టజీవులను తమ పోరాటాలు, అనుభవంద్వారా సోషలిజం వైపుగా నడిపించి, నాయకత్వం వహించే చొరవను కార్మికవర్గానికి లేకుండా చేస్తుంది. ఈ చర్య కార్మికవర్గానికి సహాయం చేయడానికి బదులుగా వారిని భయపెట్టి, పోరాటం నుండి తప్పుకునేలా చేసే అవకాశం ఉంది. ప్రజలు తమ అనుభవం నుండి నేర్చుకోవాల్సిన దానిని, సిద్ధాంతం ద్వారా తెలుసుకుంటారని ఆశించకూడదు. ఈ విషయాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి.

సామాన్య ప్రజానీకంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక స్పృహలను పెంచాల్సిన దశలను దాటవేసి, నేరుగా సోషలిస్టు స్పృహను రగిలించే ప్రయత్నం వాస్తవంలో ప్రతికూల ఫలితాలను ఇవ్వొచ్చు. కార్మికవర్గానికి సోషలిస్టు చైతన్యాన్ని అందించాలి. అది అవసరం. అయితే, దానిని అన్ని ఇతర తరగతుల, వర్గాల ప్రజలకు నినాదంగా చేయకూడదు. అందుకే సోషలిస్టు విప్లవ నినాదాన్ని నేరుగా లేవనెత్తడం, మిగిలిన అన్ని దశలను దాటవేయడం మంచి చేయడం కంటే హాని ఎక్కువ చేస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే ఏడవ పార్టీ మహాసభలో ఇది పార్టీ కార్యక్రమం రూపంలో విప్లవం యొక్క దశ, వ్యూహంపై సంక్షిప్తీకరించిన అవగాహన.

**ఎత్తుగడలు ...**

స్టాలిన్ చెప్పినట్లు వ్యూహం విప్లవం యొక్క ప్రధాన శక్తులతో ముడిపడి ఉంటుంది. ఒక దశ నుండి మరో దశకు విప్లవం మారే కొద్దీ వ్యూహం కూడా మారుతుంది. అయితే ఒక దశ అంతా మారకుండా ఉంటుంది. ఎత్తుగడలు దానికి భిన్నం. తక్కువ వ్యవధి కాలంలో ఉద్యమం పెరుగుదల లేదా తగ్గుదలకు అనుగుణంగా కార్మికవర్గం ఎప్పటికప్పుడు తీసుకునే కార్యాచరణ ఎత్తుగడలు. పాత పోరాట రూపాలు బదలు కొత్త పోరాట రూపాలు, పాత నినాదాలకు బదులు కొత్త నినాదాలు, ఈ రెంటిని కలిపి పనిచేయడం తదితరాలు దీనికి ఉదాహరణలు. ఎత్తుగడలు కార్మికవర్గ సంస్థల్లోనూ, వాటి పోరాట రూపాల్లోనూ, వాటి మార్పుల్లోనూ వ్యక్తమవుతాయి. ఒక విప్లవ దశలో ఎత్తుగడలు అనేకసార్లు, అనేక విధాలుగా మారే అవకాశం ఉంది. విప్లవ పెరుగుదల, తగ్గుదలల ఆధారంగా ఎత్తుగడల్లో మార్పులు ఉంటాయి.

వ్యూహం, ఎత్తుగడలు పరస్పరం ఒక దానిని ఒకటి మార్చుకొనలేవు. అయినప్పటికీ అవి ఒకదానికొకటి పూర్తిగా సంబంధం లేనివీ కావు. ఎత్తుగడలు వ్యూహంలో భాగంగా ఉంటాయి. వ్యూహంలో కలిసిపోతాయి. అధికారం కోసం, సోషలిస్టు –కమ్యూనిస్టు సామాజిక వ్యవస్థ నిర్మాణం కోసం పోరాటంలో ఆయుధంగా కార్మికవర్గం చేతిలో వ్యూహం, ఎత్తుగడలు కలిసి ఉంటాయి. ఒకదానికి ఒకటి అనుగుణంగా ఈ రెండూ ఉండాలి. పరస్పరం ఎప్పుడూ విభేదించకూడదు.

(అనువాదం: పొగడ దొరువు)

**ఈ మాసం ప్రత్యేకం**

# కొత్త క్రిమినల్ చట్టాలు : ప్రజా హక్కులు



రచయిత ఆలిండియా లాయర్స్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు

**సుంకర రాజేంద్రప్రసాద్**

కేంద్ర ప్రభుత్వం గత క్రిమినల్ చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా మూడు చట్టాలు తీసుకువచ్చింది. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం అనే పేర్లతో తెచ్చిన ఈ నూతన చట్టాలు ఈ ఏడాది జులై 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చాయి. ఈ చట్టాలు తీసుకురావడానికి గల కారణాలపై మోడీ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. కాలం చెల్లిన నాటి వలసపాలకుల చట్టాలే ఇప్పటికీ మనం అనుసరిస్తున్నాం, బానిస మనస్తత్వానికి చిహ్నంగా ఉన్న చట్టాలను సంస్కరించి కొత్తగా ఆత్మ విశ్వాసంతో కూడిన భారత దేశాన్ని సృష్టించే కృషిలో భాగంగా ఈ కొత్త చట్టాలను తెచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. కొత్త చట్టాలు శిక్ష విధించడం కంటే న్యాయానికి ప్రాధాన్యత ఇస్తాయనీ, అంతే కాకుండా సత్వర న్యాయం పొందేందుకు ఇవి ప్రయోజన కరంగా ఉంటాయని చెప్పింది.

మనం ఈ కొత్త చట్టాలను ఒకసారి కూలంకషంగా పరిశీలిస్తే వీటిలో కొత్తదనం ఏమీ లేదనీ, నాటి వలస పాలకుల బానిస మనస్తత్వానికి తోడు మరిన్ని దారుణమైన, ప్రజలకు వ్యతిరేకమైన అంశాలు ఉన్నాయనీ బోధపడుతుంది. కొత్త చట్టాల్లో 90 శాతం వరకు పాత చట్టాలను మక్కికి మక్కీగా దించేశారు. చేసిన 10 శాతం మార్పులు వలస పాలకుల చట్టాలకంటే అధ్వాన్నంగానూ, మన రాజ్యాంగం, సుప్రీం కోర్టు గుర్తించిన అనేక ప్రజా హక్కులను కాలరాసే విధంగానూ ఉన్నాయి. స్వతంత్ర భారత దేశంలో చేసే కొత్త చట్టాలేవైనా పౌర సమాజానికి ప్రయోజన కరంగా ఉండాలి తప్పితే ప్రజలందరూ ప్రభుత్వాన్ని చూసి భయపడాలనో, ప్రజలందరినీ అనుమానితులుగానూ చూసే విధంగానో ఉండకూడదు. ఆ భావనలు వలస పాలకులవి. కేంద్ర ప్రభుత్వం వాటినే అనుసరిస్తోందని కొత్త చట్టాలు చెబుతున్నాయి.

భారత రాజ్యాంగం దేశ పౌరులకు ప్రసాదించిన హక్కులకు కొత్త క్రిమినల్ చట్టాలు విఘాతం కలిగిస్తాయి. న్యాయ వ్యవస్థ అధికారాలను ఇవి తగ్గించి వేసి, పోలీసు వ్యవస్థకు న్యాయాధికారాలను కట్టబెడుతు న్నాయి. ఈ విధంగా చేయడం మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. విచారణలో సైంటిఫిక్ ఎవిడెన్స్‌ను ఉపయోగించడం, ముద్దాయిలకు సమన్లను ఎలక్ట్రానిక్ పద్ధతిద్వారా అందజే యడం, సాంకేతికంగా వచ్చిన అభివృద్ధిని విచారణలో వాడుకునే వెసులుబాటు కల్పించడం వంటివి కొత్త చట్టాల్లో కొన్ని సానుకూలమైన అంశాలు. ఇవి తప్ప ఇందులో ప్రజలకు కొత్తగా ఒనగూడే మంచి అంశాలేవీ కనిపించడం లేదు. కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించడానికి కావాల్సిన ప్రక్రియలు వేటినీ ఇందులో ప్రవేశపెట్టలేదు సరికదా కొత్తగా చేర్చిన అనాలోచితమైన కొన్ని విధానాల వల్ల ప్రజలకు న్యాయం మరింత ఆలస్యం అయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

ఈ కొత్త క్రిమినల్ చట్టాలను ప్రభుత్వం తీసుకు వచ్చిన తీరు కూడా అభ్యంతర కరంగా ఉంది. దేశమంతా తీవ్రమైనయ కరోనా సంక్షోభంలో ఉన్న సమయంలో మోడీ ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలకు సంబంధించిన ముసాయిదా రూపొందించి పౌరులను ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ఢిల్లీ న్యాయ విశ్వ విద్యాలయానికి చెందిన ముగ్గురు ఆచార్యులు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఒకరు, ఒక రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తితో ప్రభుత్వం నియమించిన కమిటీ ముసాయిదా రూపకల్పన చేసినట్లు చెప్పారు. అఖిల భారత లాయర్స్ యూనియన్ (అయిలు) దీనిపై వెంటనే స్పందిస్తూ, కరోనాతో ప్రజలు విపత్కర పరిస్థితుల్లో ఉన్న సమయంలో వారి నుండి అభిప్రాయాలు కోరడం తగదనీ, దీన్ని వాయిదా వేసి న్యాయ నిపుణులతో చర్చించిన తదుపరి మాత్రమే ప్రక్రియను ప్రారంభించాలనీ, ప్రభుత్వ పరమైన ప్రతిపాదనలతో అప్పుడు మాత్రమే ముందుకు రావాలని విజ్ఞప్తి చేసింది. కానీ ప్రభుత్వం ఈ విజ్ఞప్తిని పెడచెవిని పెట్టి కేవలం అయిదురుగురు సభ్యలతో వేసిన కమిటీ చేసిన సూచనల ఆధారంగా నూతన చట్టాలను రూపొందించింది.

లా కమిషన్ ఆఫ్ ఇండియా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, వివిధ రాష్ట్రాల బార్ కౌన్సిల్స్, న్యాయ నిపుణులు, న్యాయవాదులు, ఇంకా పౌర సమాజంలోని ఎవరితోనూ కేంద్ర సర్కారు సరైన సంప్రదింపులు జరపకుండా, వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా, పార్లమెంటులో కనీస స్థాయిలోనైనా చర్చ జరపకుండా, మోడీ ప్రభుత్వం అతి నిరంకుశంగా ఈ కొత్త క్రిమినల్ చట్టాలను తెచ్చింది. ఈ సందర్భంగా పార్లమెంటులో చర్చకు పట్టుబట్టిన 140 మంది ఎంపీలను సస్పెండ్ చేసి ఈ చట్టాలకు ఆమోద ముద్ర వేసుకున్నారు.

ఈ చట్టాలకు భారతీయ న్యాయ సంహిత, భారతీయ న్యాయ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే పేర్లు పెట్టే విషయంలో కూడా ప్రభుత్వం రాజ్యాంగంలోని 348వ అధికరణాన్ని అతిక్రమించింది, గతంలోని నేర విచారణ చట్టం (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, భారత శిక్షా స్మృతి చట్టాలకు కొద్దిగా మార్పులు చేస్తే సరిపోయేది కానీ, అలా చేయకుండా గత చట్టాలలోని చాప్టర్లు, సెక్షన్ల నెంబర్‌లను మార్చి వేయడం ద్వారా మరింత ఎక్కువ గందరగోళాన్ని సృష్టించారు.

భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) చట్టంలో సెక్షన్ 111, 112, 113, 152లను కొత్తగా తీసుకొచ్చింది. గతంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ప్రత్యేకమైన నేరస్తులను విచారించి శిక్షించటానికి కొన్ని ప్రత్యేక చట్టాలను చేశారు.

> **❝ ఉపా చట్టంలో గల సెక్షన్‌లను బిఎన్‌ఎస్ చట్టం సెక్షన్ 113లో పొందుపరిచారు. ఇది కూడా మరింత అప్రజాస్వామిక మైనది. ఉపా చట్టంలోనూ, వ్యవస్థీకృత నేర చట్టాలలోనూ నేరాలను నమోదు చేయటానికీ, విచారించటానికీ సాధారణ పోలీస్‌లకు ప్రత్యక్ష అవకాశం లేదు. కానీ వీటిని బిఎన్‌ఎన్ చట్టంలో పొందుపరచటం ద్వారా ఆ అధికారాలను సాధారణ పోలీస్‌లకు అప్పగించారు. ఇది ఈ సెక్షన్లు మరింతగా దుర్వినియోగం కావటానికి, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించటానికి దారి తీస్తుంది. ❞**

వాటిలో వ్యవస్థీకృత నేరాలు, తీవ్రవాద చర్యలు, దేశ వ్యతిరేక చర్యలకు సంబంధించి ఉన్నాయి. కానీ వాటిని ఇప్పుడు సాధారణ చట్టాలుగా తీసుకు వచ్చారు. దీని వలన ఈ నేరాలను సాధారన పోలీస్‌లు విచారించ డానికి అవకాశం కల్పిస్తుంది. వీటికి శిక్షలు కూడా తీవ్రంగా ఉన్నాయి. వ్యవస్థీకృత నేరాలకు సంధించి చట్టంలో పేర్కొన్న నిర్వచనం చాలా ప్రమాదకరంగా ఉంది. ఈ నిర్వచనం ప్రకారం ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతులకలను అణచివేసేందుకుగాను ప్రజల పక్షాన పోరాడే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులపై కేసును బనాయించే అధికారం పోలీసులకు కట్టబడుతుంది. అంతే కాక ఆ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను వ్యవస్థీకృత నేర సిండికేట్ లాగా ప్రకటించే అవకాశం ఉన్నది. తర్వారా వ్యక్తి స్వేచ్ఛకు ప్రమాదం ఏర్పడుతుంది. నిరంకుశత్వం ప్రభులుతుంది.

ఉపా చట్టంలో గల సెక్షన్‌లను బిఎన్‌ఎస్ చట్టం సెక్షన్ 113లో పొందుపరిచారు. ఇది కూడా మరింత అప్రజాస్వామికమైనది. ఉపా చట్టంలోనూ, వ్యవస్థీకృత నేర చట్టాలలోనూ నేరాలను నమోదు చేయుటానికీ, విచారించటానికీ సాధారణ పోలీస్‌లకు ప్రత్యక్ష అవకాశం లేదు. కానీ వీటిని బిఎన్‌ఎన్ చట్టంలో పొందుపరచటం ద్వారా ఆ అధికారాలను సాధారణ పోలీస్‌లకు అప్పగించారు. ఇది ఈ సెక్షన్లు మరింతగా దుర్వినియోగం కావటానికి, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించటానికి తద్వారా నియంతృత్వ పోకడలు ప్రభలటానికి దారి తీస్తుంది.

గతంలో రాజద్రోహమనే నేరాన్ని ఐపిసి సెక్షన్ 124ఏ లో ప్రస్తావించారు. దాని సెడిటేషన్‌గా పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో రాజద్రోహం వంటి నేరం చట్టాలలో ఉండకూడదనీ, అది భారత రాజ్యాంగానికి వ్యతిరేకమనీ, వ్యక్తి స్వేచ్ఛకు, వాక్ స్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టు అనీ, దానిని రద్దు చేస్తామని 2022 సంవత్సరంలో సుప్రీమ్ కోర్టు వ్యాఖ్యానించింది. దానికి కేంద్ర ప్రభుత్వం మేమే ఆ ఆలోచన చేస్తున్నామని, తగిన చర్యలు తీసుకుంటామని సుప్రీం కోర్టు ధర్మాసనానికి హామీ ఇచ్చింది. కానీ ఆచరణలో ఐపిసి 124ఏ సెక్షన్‌ను తొలగించి, దానికి మించిన దుర్మార్గ పూరితమైన, భయంకరమైన సెక్షన్ 152 ను బిఎన్‌ఎస్‌లో తీసుకు వచ్చారు. దీనికి ఇచ్చిన నిర్వచనం కూడా అధికార పార్టీలకు వ్యతిరేకంగా పనిచేసే వారిపైనా, తమకు పడని వారిపైనా ఈ కేసులను తేలికగా బనాయించే అవకాశం ఉన్నది. అంతేకాక పోలీస్ అధికారులకు విపరీతమైన అధికారాలు కట్టబెట్టడం ద్వారా వారి ఆదేశాలను ధిక్కరించరనో, అవిధేయులై ఉన్నారనో, ప్రతిఘటించరనో నెపంతో నిరాహార దీక్షలు, సమ్మెలు, ధర్నాలు చేసే వారిని నిర్భంధించే అధికారం కల్పించారు. ప్రజాస్వామ్యం కోసం జరిగిన మన స్వతంత్రోద్యమం గుర్తించిన ఈ హక్కులను కొత్త చట్టం కాలరాస్తోంది. బిఎన్‌ఎస్ చట్టం సెక్షన్ 172 (2) ప్రకారం పోలీస్ అధికారారులు ఏ వ్యక్తినైనా 24 గంటల పాటు తమ అదుపులో ఉంచుకోవచ్చు. పోలీసులకు ఈ అధికారాన్ని కట్టబెట్టడం రాజ్యాంగం నిర్దేశించిన వ్యక్తి స్వేచ్ఛను హరించడమే.

వ్యక్తులను అరెస్టు చేసే సందర్భంలోనూ, న్యాయస్థానం ముందు ప్రవేశ పెట్టే సందర్భంలోనూ బేడీలు వేయరాదని 1978 మరియు 1980 సంవత్సరాలలో సుప్రీం కోర్టు తన తీర్పు ద్వారా ప్రకటించింది. ఆ తీర్పులలో వ్యక్తులకు ఇనుప సంకెళ్ళు వేయడం, తాళ్లతో బంధించటం అనాగరికమనీ, ఏ ఆధునిక సమాజం వాటిని అంగీకరించదనీ చెప్పింది. సంకెళ్లు లేకుండా హాజరు పరచడం రాజ్యాంగం గుర్తించిన హక్కు అని పేర్కొంది. ఈ తీర్పులనే ఇప్పటికి న్యాయస్థానాలు అమలు చేస్తున్నాయి. ఈ మధ్య కాలంలో కూడా ఈ తీర్పులను ఉల్లంఘించి ప్రవర్తించిన పోలీస్ అధికారులకు శిక్షలు వేయడం కూడా జరిగింది. కానీ బిఎన్‌ఎస్‌ఎస్‌లో నూతనంగా చేర్చిన సెక్షన్ 43 (3) ప్రకారం పోలీస్ అధికారులు అరెస్టు చేసే వ్యక్తి ప్రవర్తన బట్టి గాక అతనిపైనున్న నేరారోపణ ప్రకారం అతనికి సంకెళ్లు వేసే అధికారం పోలీసు అధికారులకు కల్పిస్తుంది. ఈ సెక్షన్ రాజ్యాంగ వ్యతిరేకం, సుప్రీం కోర్టు చెప్పిన తీర్పులకు వ్యతిరేకం. ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత భద్రాచలంలో పోలీస్‌లు ఒక న్యాయవాదిని అరెస్టు చేసి సంకెళ్లు వేసి న్యాయస్థానానికి తీసుకువచ్చిన విషయం మన చూశాం. భవిష్యత్‌లో సామాజిక సేవకుల పైనా, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడే వారిపైనా, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపైనా ఈ రకమైన దుచర్యలు విరివిగా జరిగే అవకాశం ఉంది. గతంలో ఏ ముద్దాయికైనా సంకెళ్లు వేయాలంటే ఆయా తీవ్రమైన ప్రత్యేక పరిస్థితులను న్యాయాధికారికి వివరించి, న్యాయాధికారి అనుమతితోనే చేయవలసిన వచ్చేది, కానీ కొత్త చట్టం ప్రకారం పోలీస్ అధికారులే వారి ఇష్ట రాజ్యంగా దీనిని అమలు చేయవచ్చు. దీనికి ఇచ్చిన నిర్వచనం కూడా దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తోంది.

పాత చట్టంలో గల మెట్రోపాలిటన్ ఏరియా, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు, చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులను తొలగించటం పట్టణ ప్రాంతాలలో క్రిమినల్ కేసుల విచారణపై ప్రభావం చూపుతుంది. అంతేకాక అసిస్టెంట్ సెషన్స్ జడ్జి న్యాయస్థానాలను రద్దు చేయటం ద్వారా జిల్లా న్యాయస్థానాలపై మరింత పని భారం పెరగుతుంది. వీటన్నిటినీ రద్దు చేయడం ఒక అనాచలోచిత చర్య తప్ప వాటి వల్ల ఎటువంటి ప్రయోజనమూ సిద్ధించదు. దీని వలన సత్వర న్యాయం జరగకపోగా మరింత ఆలస్యం జరిగే అవకాశం వుంది.

బిఎన్‌ఎస్‌ఎస్ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌గా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌లను నియమించడం ద్వారా పోలీస్ అధికారులు జ్యుడిషియల్ కార్యకలాపాలలో చొరబడటానికి అవకాశం కల్పించారు. ఇది చాలా నష్టదాయకమైన చర్య. న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ మధ్యగల అధికారాలు వాటికి గల పరిమితులు, హక్కుల

గురించి అనేక చర్చలు జరుగుతున్నాయి. పోలీస్ అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్స్‌గా నియమించరాదని ఒక ప్రజాస్వామికసూత్రం. అనేక హైకోర్టులు పోలీస్ అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్స్‌గా ఏ విధంగా నిమిస్తారని ప్రశ్నించిన సందర్భాలు ఉన్నాయి. దీనికి భిన్నంగా ఈ నూతన చట్టాన్ని తీసుకు వచ్చారు.

బిఎన్ఎస్ఎస్ లోని సెక్షన్ 18 ప్రకారం దేశ రాజధాని ఢిల్లీ రాష్ట్రంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించే అధికారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర ప్రభుత్వమే ఆ రాష్ట్రంలో ప్రాసిక్యూటర్‌లను నియమించే అధికారం కలిగి ఉందని నిర్దేశించారు. దీని ద్వారా రాష్ట్రాల హక్కులను కేంద్ర హరిస్తోంది. ఫెడరల్ స్ఫూర్తికి ఇది పూర్తి విరుద్ధం. భారతదేశంలో గల ఇతర రాష్ట్రాలు వారి ప్రాసిక్యూటర్‌లను వారే నియమించుకోవచ్చు. కానీ ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ హక్కు లేకుండా చేశారు.

గత చట్టాల ప్రకారం ఒక పోలీస్ అధికారి పట్టుకోదగిన నేరంలో ఒక రిపోర్టు వస్తే దానిని ఒక కేసుగా రిజిస్టర్ చేసి విచారణ చేయవలసి ఉండేది. పట్టుకోదగిన కేసును రిజిస్టర్ చేయడమా, లేదా అనేది పోలీస్ అధికారుల విచక్షణ పరిధిలో ఉండేది కాదు. కానీ నూతన బిఎన్ఎస్ఎస్ చట్టం సెక్షన్ 173 (3) ప్రకారం పోలీస్ అధికారికి 3 సంవత్సరాల నుండి 7 సంవత్సరాల వరకు శిక్ష పడే పట్టుకోదగిన నేరాలలో కూడా కేసు రిజిస్టర్ చేయడానికి అధికారం లేదు. ఆ పోలీస్ అధికారులు ఆ కేసును రిజిస్టర్ చేయాలంటే అనేకమైన నిబంధనలు పెట్టారు. మొదటిగా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయికి తగ్గిన అధికారి నుండి అనుమతి తీసుకోవాలి. తరువాత 14 రోజులపాటు ప్రాథమిక విచారణ చేసి కేసు ఉన్నదని పోలీస్ అధికారి భావించిన మీదట మాత్రమే కేసు రిజిస్టర్ చేయాలి. ఇది మరింత కాలయాపనకూ, బాధితులను పోలీస్ అధికారుల చుట్టూ తిప్పే పరిస్థితికీ దారి తీస్తుంది. కేసు రిజిస్టర్ కాక మునుపే ఆ అధికారులు పోలీస్ స్టేషన్‌లో పంచాయితీలు చేయడానికీ, రిపోర్ట్ ఇచ్చిన వారిని బెదిరించి రిపోర్ట్‌ను ఉపసంహరించుకునే పరిస్థితులను సృష్టించడానికీ దారి తీస్తుంది. దీనివల్ల సమాజంలో అట్టడుగున ఉండే వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. సుప్రీం కోర్టు వారు లలిత్ కుమారి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తర ప్రదేశ్

**❝ పాత చట్టం ప్రకారం ఎవరైనా వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో తను చేసిన ఫిర్యాదుపై పోలీస్ వారు తగిన చర్యలు తీసుకోక పోయినా, కేసుగా నమోదు చేయకపోయినా, లేక ఫిర్యాదునే తీసుకోక పోయినా, లేక ఆ కేసును మూసివేసినా...ఆ వ్యక్తికి అటువంటి అభియోగాలతో న్యాయస్థానం ముందు ప్రైవేట్ కేసు దాఖలు చేసే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుత చట్టం ప్రకారం కోర్టులో ప్రభుత్వ అధికారులు, పోలీస్ అధికారుల మీద ప్రైవేట్ కేసు దాఖలు చేసి న్యాయం పొందే అవకాశాలను దాదాపుగా రద్దు చేశారు. ❞**

కేసులో ఇచ్చిన తీర్పుకు ఇది విరుద్ధం.

పాత చట్టం ప్రకారం ఎవరైనా వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో తను చేసిన ఫిర్యాదుపై పోలీస్ వారు తగిన చర్యలు తీసుకోకపోయినా, ఆ ఫిర్యాదును కేసుగా నమోదు చేయకపోయినా, లేక ఫిర్యాదునే తీసుకోకపోయినా, లేక ఆ కేసును ఏ కారణం చేతనైనా మూసివేసినా...ఆ వ్యక్తికి అటువంటి అభియోగాలతో న్యాయస్థానం ముందు ప్రైవేట్ కేసు దాఖలు చేసే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం సెక్షన్ 175 బిఎన్ఎస్ ప్రకారం కోర్టులో ప్రభుత్వ అధికారుల మీద లేక పోలీస్ అధికారుల మీద ప్రైవేట్ కేసు దాఖలు చేసి న్యాయం పొందాలనుకునే అవకాశాలను దాదాపుగా రద్దు చేశారు. ప్రైవేట్ కేసును న్యాయస్థానం అంగీకరించడానికి అనేక ప్రతిబంధకాలు నిర్దేశించారు. ప్రభుత్వ అధికారులు, పోలీస్ అధికారులపై వేసే ప్రైవేట్ కేసులలో న్యాయస్థానం మొదటిగా పోలీస్ స్టేషన్ వారి అభిప్రాయాన్ని, ఆరోపణ ఎదుర్కొనే అధికారి యొక్క పైఅధికారి అభిప్రాయాన్ని అంతేకాక ఆరోపణ ఎదుర్కొనే అధికారి అభిప్రాయాన్ని తెలుసుకొని ఆ కేసును తీసుకోవాలా లేదా అని నిర్ణయం చేయవలసిన ఉంటుంది. ఇది సాధారణ వ్యక్తులపై వేసే ప్రైవేట్ కేసులలో కూడా ఆ వ్యక్తికి ఆ నోటీసు ఇచ్చి అప్పుడు మాత్రమే ఆ కేసును తీసుకోవాలా లేదా నిర్ణయించవలసి ఉంటుంది. గత చట్టాలలో ప్రైవేట్ కేసులలో నేర ఆరోపణకు గురి అయిన వ్యక్తులకు.. న్యాయస్థానం వారికి సమన్లు ఇచ్చేంతవరకు వారి వాదనను వినిపించే హక్కులేదు. కానీ ఈ మార్పు వలన సత్వర న్యాయం జరగకపోగా మరింత కాలయాపన జరగటం, బాధితులకు న్యాయం జరగని పరిస్థితి ఏర్పడుతుంది. పోలీస్ అధికారులు, ప్రభుత్వ అధికారులు యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడటానికి ఇది అవకాశం కల్పిస్తోంది. మనదేశంలో ఇప్పటికే లాకప్ మరణాలు, హింసలు పెరిగిపోతున్నాయి. అనేక సందర్భాలలో సాధారణ ప్రజలపై ప్రభుత్వ అధికారుల, పోలీస్‌ల జులం హెచ్చిరిల్లి పోతోంది. వాటిని కట్టడి చేయడానికిగాను నేరానికి పాల్పడే పోలీస్ అధికారులు, ప్రభుత్వ అధికారులపై ప్రత్యేక చర్యలు నిర్దేశించిక పోగా వారిని శిక్షించడానికి బాధితులకు కనీసం ఉన్న హక్కులను భక్షించటానికి ఇది ఉపయోగపడుతుంది. దీని ద్వారా వలస పాలకులు కూడా ఇవ్వలేని వరాన్ని పోలీస్ అధికారులకు, ప్రభుత్వ అధికారులకు ఈ ప్రభుత్వం ఇచ్చినట్లయింది. ప్రైవేట కేసులను దాఖలు చేసే క్రమంలో న్యాయస్థానాల అధికారాలను కుదించి పోలీస్ అధికారాలను పెంచటం ప్రమాదకర పరిణామం.

నేర ఒప్పుదల స్టేట్‌మెంట్‌ను, సాక్షుల స్టేట్‌మెంట్‌ను (164 సిఆర్‌పిసి) పాత చట్టం ప్రకారం న్యాయమూర్తులు అనేక నిబంధనలు పాటించి నమోదు చేసేవారు. కానీ సెక్షన్ 183 బిఎన్ఎస్ఎస్ ప్రకారం నేర ఒప్పుదల స్టేట్‌మెంట్‌ను, సాక్షుల స్టేట్‌మెంట్‌ను (164 సిఆర్‌పిసి) రికార్డు చేసే అధికారం గతంలో వలే కేవలం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌కు కాకుండా ఎవరైనా మేజిస్ట్రేట్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్‌లకు దాఖలు పరచటం జరిగింది. దీనివలన రెవెన్యూ అధికారులే ఈ స్టేట్‌మెంట్స్‌ను నమోదు చేసే యెడల ఇది నేరారోపణకు గురి అవుతున్న వారికి న్యాయమైన విచారణ మృగ్యం అవుతుంది. దీనివల్ల ఇప్పటి వరకు గల ఫెయిర్ ట్రయల్ పద్ధతికి విఘాతం కలుగుతుంది.

పాత చట్టం ప్రకారం ఎవరినైనా పోలీస్ వారు అరెస్ట్ చేసినప్పుడు ఆ కేసుపై 24 గంటలలో విచారణ పూర్తి కాని యెడల ఆ వ్యక్తిని దగ్గరలోగల జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, వారిని రిమాండ్ విధించవలసినదిగా కోరవలసి ఉండేది. కాని నూతన చట్టం బిఎన్ఎస్ఎస్ ప్రకారం ఎవైనా

**"న్యాయస్థానంలో జరిగే విచారణలు మొదలైనవి అన్నీ ఎలక్ట్రానిక్స్ పద్ధతిలోనే జరగాలని సెక్షన్ 530 నిర్దేశిస్తోంది. కానీ దానికి తగిన వ్యవస్థాగత సదుపాయాలు మటుకు కానరావు. ఇప్పటికే అనేక న్యాయస్థానాలు కనీస సదుపాయాలు లేక ప్రైవేట్ భవనాల్లో, ఇరుకు గదుల్లో పని చేస్తున్నాయి. చట్టంలో మార్పు చేయటంతోనే పూర్తి కాదు. దానికి సంబంధించి కావల్సిన సంస్థా గత సదుపాయాలను కల్పించటం, న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, సిబ్బందికి అవసరమైన తర్ఫీదు ఇవ్వవలసిన అవసరం ఉన్నది."**

"జ్యుడిషియల్" అనే పదాన్ని తొలగించటం జరిగింది. సెక్షన్ 187 (3) బిఎన్ఎస్ ప్రకారం పోలీస్ అధికారులు ముద్దాయిని వారి కస్టడీకి విచారణ నిమిత్తం ఇవ్వమని కోరే అవకాశం గతంలో ముద్దాయిని రిమాండ్ విధించిన మొదటి 15 రోజులకే పరిమితం కాగ నూతన చట్టం ప్రకారం ఆ పరిధిని 40 నుండి 60 రోజులకు విస్తృతపరుస్తూ ఆ సమయంలో పలు దఫాలుగా కస్టడీ ని కోరే అధికారాన్ని పోలీస్‌లకు కట్టబెట్టడం న్యాయసూత్రాలకు వ్యతిరేకం, ముద్దాయిల హక్కులకు భంగకరం, ముద్దాయిలను ఉద్దేశపూర్వకంగా ఎక్కువ రోజులు జైలులో మగ్గే విధంగా చేయడానికి అవకాశం కల్పించడం మాత్రమే. మన దేశంలో బెయిల్‌కు సంబంధించి సమగ్రమైన చట్టం లేదని రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ఆ విధమైన చట్టాన్ని చేయాలని సుప్రీం కోర్టు 'సతెంద్ర కుమార్ అంటిల్' కేసులో కేంద్ర ప్రభుత్వానికి సూచించటం జరిగినది. ఆ కేసులో భారతదేశంలో నేరస్తులుగా నిర్ధారణ కాకుండానే జైళ్లలో మగ్గే విచారణ ఖైదీల గురించి ప్రస్తావించడం, ఆ విధానం సరియైనది కాదని కూడా పేర్కొనడం జరిగింది. కానీ కేంద్ర ప్రభుత్వం బెయిల్‌కు సమగ్రమైన చట్టాన్ని తీసుకురాకుండా మరింత జఠిలంగాను, బెయిల్‌లు మరింత ఆలస్యమయ్యే విధంగాను తయారుచేసింది. ఈ మార్పులు అనేకమైన సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధం.

సెక్షన్ 196 బిఎన్ఎస్ ప్రకారం పోలీస్ కస్టడీలో ఉన్న మహిళాపై అత్యాచారం జరిగినా లేదా వ్యక్తి మరణించినా గతంలో మెట్రోపాటిటన్ మేజిస్ట్రేట్ లేదా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ మాత్రమే విచారణ జరిపే అధికారం ఉన్నది. కానీ నూతన చట్టాల ప్రకారం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అనే పదం నుండి "జ్యుడిషియల్" అనే పదాన్ని తొలగించారు. ఇది మరిన్ని వాదోప వాదాలకు, కాలయాపనకు బాధితులకు ఉన్న హక్కుపై అనేక అనుమానాలకు తావిచ్చే విధంగా ఉన్నది. కమ్యూనిటీ సర్వీసు అనే కొత్త శిక్షా విధానాన్ని ఈ చట్టాలలో ప్రవేశ పెట్టినప్పటికీ సరియైన నిర్వచనం ప్రతిపాదించకపోవడం అక్షేపణీయం, అనేక సందేహాలకు తావిస్తున్నది.

న్యాయస్థానంలో జరిగే విచారణలు మొదలైనవి అన్నీ ఎలక్ట్రానిక్స్ పద్ధతిలోనే జరగాలని సెక్షన్ 530 నిర్దేశిస్తోంది. కానీ దానికి తగిన వ్యవస్థాగత సదుపాయాలు మటుకు కానరావు. ఇప్పటికే అనేక న్యాయస్థానాలు కనీస సదుపాయాలు లేక అనేక ప్రైవేట్ భవంతులలో, ఇరుకు గదులలో తమ పనిని కొనసాగిస్తున్నాయి. ఇది చట్టంలో మార్పు చేయటంతోనే పూర్తి కాదు. దానికి సంబంధించి కావల్సిన సంస్థాగత సదుపాయాలను కల్పించటం, న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయస్థానాల సిబ్బందికి అవసరమైన తర్ఫీదు ఇవ్వవలసిన అవసరం ఉన్నది. అంతే కాక ఈ విధానం సైబర్ క్రైమ్ జరిపే అవకాశాలు లేకుండా కట్టుబదిట్టాలు చేయవలసిన అవసరం ఉన్నది. మన దేశంలో రాను రాను సైబర్ క్రైమ్ తీవ్రం అవుతున్నది. బాధితులు అనేక వేల కోట్ల రూపాయలు కోల్పోతున్నారు. ఆ చాయాలు ఈ వ్యవస్థపై పడకుండా అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యమైన సాక్షులను కోర్ట్‌లో ఉండే సాక్షుల బోనులో ఉంచి విచారణ జరిపితే న్యాయవాది రాబట్టే సమాధానికి, ఆన్‌లైన్‌లో సాక్షి చెప్పే సమాధానానికి తేడా ఉంది. సాక్షులు అవకతవకలకు పాల్పలడడానికి ఆస్కారం ఉన్నది. ప్రభుత్వం సరియైన కంప్యూటర్, వైఫై సదుపాయాలను కోర్టులకు కల్పించకుండా ఈ రకమైన మార్పులను తీసుకురావడం ఆచరణలో అనేక ఇబ్బందులను కలిగించుచున్నది. విచారణలో ఫోరెన్సిక్ సైన్స్ నిష్ణాతులను ఉపయోగించవలసినదిగా ఈ చట్టాలు నిర్దేశిస్తున్నాయి. కానీ అవసరమైన ఎఫ్ఎస్ఎల్ నిపుణులను లేబొరేటరీలను ఏర్పాటు చేయడానికి ఎటువంటి ప్రయత్నాలు ప్రభుత్వం చేయడం లేదు. సాక్షుల సంరక్షణకు ఈ చట్టాలలో ఎటువంటి ప్రాధాన్యత లేకపోవడం విచారకరం. సాక్షుల సంరక్షణకు, గోప్యతకు కొన్ని సవరణలు చేయవలసిన అవసరం ఉన్నది.

30 జూన్ 2024 వరకు జరిగిన నేరాలన్నింటికి పాత చట్టం ప్రకారం తరువాత జరిగే నేరాలన్నింటికి నూతన చట్టాల ప్రకారం విచారణ జరగవలసి ఉన్నందున పాత, కొత్త చట్టాలను అమలు చేయడంలో మరిన్ని కొత్త సమస్యలు ఉత్పన్నం అవ్వటం, కొత్త చట్టాలపై సాధికారిత సాధించటానికి మరింత సమయం పట్టడం వెరసి అన్నీకలిసి న్యాయ వ్యవస్థ మీదా, న్యాయ వాదులు, ఇతర సిబ్బంది మీదా విపరీతమైన వత్తిడి పెరగటం, తద్వారా తీర్పులు వెలువడటం ఆలస్యం అయ్యే ప్రమాదం ఉంది.

న్యాయవాదులను సోషల్ ఇంజనీర్స్‌గా సమాజం భావిస్తుంది. అందువలన నూతన చట్టాల వలన సమాజంపై పడే ప్రభావాన్ని విశ్లేషించి తగు చర్యలకు పునుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉన్నది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన భారతదేశం వెలుగొందుతూ, స్వతంత్ర న్యాయ వ్యవస్థను కలిగి ఉండి రాజ్యాంగం గుర్తించిన హక్కులను ప్రజలు అనుభవించుతూ, స్వేచ్ఛగా జీవించాలని అభిలషిస్తున్నారు. కాని నూతన చట్టాల పేరుతో బ్రిటిష్ పాలకులు విధించిన నిబంధనలు కంటే మరింత జఠిలమైన, నిరంకుశమైన నిబంధనలను తీసుకువచ్చిన ఒక నియంతృత్వపాలనను ప్రజలపై రుద్ది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని మంటగలిపే విధంగా ఉన్న ఈ చట్టాలను రద్దు చేయవలసిందిగా పోరాడవలసిన బాధ్యత న్యాయవాదులపైన, ప్రజాతంత్ర వాదులపైన ఉన్నది. అనేక మంది న్యాయ నిపుణులు, న్యాయవాదులు, మేధావులు, రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని ఈ చట్టాలను రద్దు చేయమని డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో ఈ చట్టాలను అమలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని విడనాడి ఈ నూతన చట్టాల అమలును నిలిపి వేయాలి.

**భారతీయ న్యాయసంహిత సవరణలు**

ప్రభుత్వ అధికారులపై ప్రైవేటు కంప్లైంట్

**(మిగతా 34వ పేజీలో)**

ప్రభుత్వ వైఫల్యం

# జమ్మూ-కాశ్మీర్‌లో పెరిగిన తీవ్రవాద కార్యకలాపాలు



అశుతోష్ శర్మ

పాకిస్తాన్‌తో ఉన్న లైన్ ఆఫ్ కంట్రోల్ -ఎల్ఒసి-సమీప జిల్లాలైన జమ్మూలోని పూంచ్, రాజౌరిలలో గత ఏడాది ఆరంభంలో వరుసగా ఉగ్రవాద దాడులు జరిగాయి. ఆ తర్వాత 2023, జనవరి 13వ తేదీన ఉగ్రవాదంపై పోరాడటం కోసం మూడు మాసాల వ్యూహాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. భద్రతా సంస్థలన్నింటినీ అప్రమత్తం చేసి, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జమ్మూ నగరంలో మీడియాతో మాట్లాడిన తర్వాత, రాజ్‌భవన్‌లో సమీక్షా సమావేశం జరిపారు. ఆ సమావేశంలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, హోం శాఖ కార్యదర్శి ఎ కె భల్లా, నార్తరన్ కమాండ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), బోర్డర్ సెక్యూరిటి ఫోర్స్ (బిఎస్ఎఫ్), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సి, ఇంటెలిజెన్స్ బ్యూరో, రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ (ఆర్ఎడబ్ల్యు), జమ్మూ కాశ్మీర్ సివిల్, పోలీసు ఉన్నతాధికారులు సమావేశానికి హాజరైనారు.

ఇది జరిగిన ఒకటిన్నర సంవత్సరాల తర్వాత కూడా మిలిటెంట్ల కార్యకలాపాలు ఏ మాత్రం తగ్గలేదు. నరేంద్రమోడి జూన్ 9వ తేదీన మూడవ సారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రోజే జమ్మూలోని రేసి జిల్లాలో ఒక బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో తొమ్మిది మంది యాత్రికులు మరణించారు. ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఉగ్రవాద కార్యకలాపాలు, ఉద్యమం బాగా పెరిగాయి. జులై నెలలోనే మిలిటెంట్ల దాడులలో 12 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. జమ్మూలోని అన్ని కేంద్రీయ విద్యాలయాలు, పాఠశాలలతో పాటు జమ్మూ-పఠాన్‌కోట్ జతీయ రహదారిని కూడా భద్రతాపరమైన కారణాల వలన నాలుగు రోజుల పాటు మూసివేస్తున్నట్లు జులై 25వ తేదీన అధికారులు ప్రకటించారు. 2021, అక్టోబర్‌లో పూంచ్, ఛామ్‌రర్, భట్టా దురియన్ అడవులలో జరిగిన ఎదురు కాల్పుల తర్వాత, జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాదులు చేసిన దాడులలో పౌరులు కాక, దాదాపు 50 మంది భద్రతాదళాలకు చెందిన వారు మరణించారు. వీరిలో ఎక్కువ మంది సైనికులు ఉన్నారు.

భారత దేశంలోకి చొరబడటానికి టెర్రరిస్టులు నిరంతరం ప్రయత్నాలు చేస్తుండటం వలన అంతర్జాతీయ సరిహద్దు, ఎల్ఒసిల వద్ద శాంతిని కాపాడాలని చేసుకున్న ఒప్పందం నిరంతరం ఉల్లంఘించబడుతున్నది. పాకిస్థాన్ సరిహద్దు నుండి చొరబాడుతున్న వారిని నిరోధించటం కోసం మూడు దశల రక్షణ వ్యవస్థ (ఎఐఎస్)ను ఏర్పాటు చేయటంతో పాటు, సరిహద్దు పొడవునా మైన్స్‌ను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ భౌగోళిక, వాతావరణపరమైన సమస్యల వలన రక్షణ వ్యవస్థ ఇప్పటికీ బలహీనంగానే ఉన్నది. గతంలో మిలిటెంట్లు టన్నెల్స్ ద్వారా సరిహద్దును దాటేవారు. ఫెన్సింగ్‌ను కట్ చేయటానికి కట్టర్‌లను ఉపయోగించే వారు. ఈ మధ్య మిలిటెంట్ల దాడులు పెరిగిన తర్వాత స్మార్ట్ ఫెన్సింగ్ ఏర్పాటు కోసం డిమాండ్ పెరిగింది.

2019లో జమ్మూ కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేకహోదాను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన తర్వాత జమ్మూలో రహస్య కార్యకలాపాల నిర్వహణలో పాకిస్తాన్‌కు చైనా సహకరిస్తున్నదని రక్షణరంగ వ్యూహకర్తలు మేజర్ జనరల్ (రిటైర్డ్) బక్షి, జమ్మూ కాశ్మీర్ పోలీస్ మాజి డిజిపి ఎస్ పి వైద్య నమ్ముతున్నారు. ఈ ప్రాంతంలో దశాబ్దానికి పైగా సాపేక్షంగా శాంతియుత వాతావరణం ఉంది. కానీ 2020లో గాల్వన్ లోయలోని వాస్తవాధీన రేఖ(ఎల్ఎసి) వద్ద చైనాతో తీవ్రమైన ఘర్షణలు జరిగాయి. ఆ తర్వాత ఇక్కడి సైన్యాన్ని లడక్‌కు తరలించటంతో టెర్రరిస్టు వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే యంత్రాంగం బలహీనపడింది.

ఈ మధ్యకాలంలో పెరిగిన టెర్రరిస్టు కార్యకలాపాలను "యుద్ధాన్ని పోలిన చర్య" అని వైద్య చెప్పాడు. స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జి) కమాండోలు 600 మందిని టెర్రరిస్టు కార్యకలాపాల కోసం పాకిస్తాన్ కేటాయించిందని ఆయన చెప్పాడు. టెర్రరిస్టు దాడులు జరపటం కోసం వారిలో కొందరు ఇప్పటికే జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేశించారు. "అంత్యంత కచ్చితంగా లక్ష్యాలపై జరుగుతున్న దాడులు ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించటం లేదు" అని ఆయన చెప్పాడు. కార్గిల్‌లో జరిగిన సాయుధ ఘర్షణ లాంటి వాతావరణాన్ని జమ్మూలో కూడా సృష్టించటానికి పాకిస్తాన్ ప్రయత్నం చేస్తున్నదని ఆయన వివరించాడు.

కాశ్మీర్‌లో తగిలిన ఎదురు దెబ్బలను మరిచిపోవటానికి పాకిస్తాన్ తెగించి చేస్తున్న కార్యకలాపాలే జమ్మూలో అశాంతి పెరగటానికి కారణమని ఆయన ఫ్రంట్‌లైన్‌తో మాట్లాడుతూ చెప్పాడు. "గత 10-15 సంవత్సరాల నుండి జమ్మూ శాంతియుతంగా ఉన్నది. అక్కడ నియమించిన సైనికులను తగ్గించారు. మొత్తంగానే ఉదాశీన వాతావరణం ఉంది. అందు వలన కాశ్మీర్, లడక్‌లలోని భారత-చైనా సరిహద్దులోని తమ రక్షణ కేంద్రాలపై వత్తిడి తగ్గటం కోసం పాకిస్తాన్ జమ్మూను లక్ష్యంగా చేసుకున్నది. కాశ్మీర్

> **"జమ్మూలోని అటవీప్రాంతంలో తీవ్రవాదులు పొంచి ఉండి సైనికులపై దాడులు జరిపినపుడు అదనపు బలగాలు రావటంలో తరచుగా ఆలస్యం జరుగుతున్నదని కొన్ని నివేదికలు తెలుపుతున్నాయి. వ్యూహాత్మకమైన లోపాలు, దాడులు జరపటంలో అసమర్ధంగా వ్యవహరించటం, తగినన్ని ఆయుధాలు, అవసరమైన ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవటం ఆందోళన కలిగిస్తున్నది."**

వలె కాకుండా జమ్మూలో భూమి సమస్యాత్మాకంగా ఉన్న రీత్యా ఎక్కువ సైన్యం అవసరం అవుతుంది. అదే పాకిస్తాన్‌కు సానుకూలమైన అంశంగా ఉన్నది.

"గతంలో కాశ్మీర్‌లో సైనికులను చంపి, నిరపాయకరంగా తప్పించుకుపోతున్నప్పుడు కూడా ఇక్కడ చేస్తున్న విధంగా పొంచి ఉండి, హఠాత్తుగా దాడి చేయటాన్ని మనం చూడలేదు. వారు బాగా శిక్షణ పొందినవారు. ఉక్కు పూతతో ఉన్న చైనా తయారి బుల్లెట్లను వాడుతున్నారు. సమాచారం కోసం చైనా యాప్‌లను వినియోగిస్తున్నారు. కొద్ది సంవత్సరాల క్రితం రాజౌరి, పూంచ్ జిల్లాలలో పొంచి ఉండి దాడులు చేసిన పద్ధతులను ఇపుడు రేసి, కథువా, ఉధంపూర్, దోడా జిల్లాకు కూడా విస్తరింపజేశారు" అని ఆయన చెప్పాడు.

"సమర్ధత తక్కువగా ఉన్నప్పటికీ" జమ్మూ కాశ్మీర్‌లోకి మనుషులు, నిధులను పంపటాన్ని పాకిస్థాన్ కొనసాగిస్తున్నదని" జమ్మూ కాశ్మీర్ ఇన్‌ఛార్జి డిజిపి రష్మి రంజన్ స్వైన్ ఈ సంవత్సరం జూన్‌లో చెప్పాడు. చురుకుగా ఉన్న టెర్రరిస్టులు 60–70 మంది ఎల్‌ఒసి వద్ద ఉన్న స్థావరాల నుండి జమ్మూలో చొరబడటం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఫిర్ పంజాల్ అడవిలోని లోతట్టు ప్రాంతాలలో టెర్రరిస్టులు ఇప్పటికే స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఉంటారని రక్షణరంగ నిపుణులు భావిస్తున్నారు. టెర్రరిస్టు కేంద్రాల నిర్మూలన కార్యక్రమాలకు ఆపరేషన్ సార్ప్ వినాశ్ 2.0 అని పేరు పెట్టారు.

గ్రామ రక్షణ దళాలను బలపరచటంతో పాటు మిలిటెంట్లతో సమస్యలను ఎదుర్కొంటున్న గ్రామాల నుండి స్పెషల్ పోలీస్ ఆఫీసర్ల (ఎస్‌పిఒ)ను రిక్రూట్ చేసుకోవాలని గతంలో జమ్మూ కాశ్మీర్ పోలీసులు నిర్ణయించారు. మిలిటెంట్ల సమాచారం చెప్పిన వారికి నగదు బహుమతులు ఇస్తామని కూడా ప్రకటించారు.

ఈ సమయంలోనే మిలిటెంట్లకు మద్దతిచ్చే వారిపై 2005, ఎనిమి ఏజంట్స్ ఆర్డినెన్స్ కింద కేసులు నమోదు చేసి, విచారణ జరిపి శిక్షలు విధించాలని స్వైన్ ప్రతిపాదించాడు. చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) వలె కాకుండా ఈ ఆర్డినెన్స్ కింద జరిపిన విచారణలో నేరం రుజువైతే మరణశిక్ష లేక యావజ్జీవ శిక్ష విధించవచ్చు. ఈ ఆర్డినెన్స్‌లోని నిబంధనల ప్రకారం కోర్టు అంగీకరించకపోతే ముద్దాయి న్యాయవాదిని కూడా నియమించుకోలేడు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా అప్పీలు చేసుకోవటం కూడా సాధ్యం కాదు.

మిలిటెంట్ల ప్రచార పోస్ట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేసేవారు ఉపా చట్టంలోని సెక్షన్ 13 (చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసే విధంగా రెచ్చగొట్టటం, ప్రోత్సహించటం), సెక్షన్ 18 (టెర్రరిస్టు చర్యలకు పాల్పడే విధంగా ప్రోత్సహించటం లేక రెచ్చగొట్టటం) ప్రకారం శిక్షింపబడతారని పోలీసులు హెచ్చరికను జారి చేశారు.

మరోవైపున టెర్రరిస్టు కార్యకలాపాలలో పాల్గొనటం కోసం కిస్త్వర్, దోడా, రాంబన్ జిల్లాల నుండి సరిహద్దు దాటి వెళ్ళిన వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని లెఫ్టినెంట్ గవర్నర్ నేతృత్వంలోని ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించింది. స్థానిక యువతను మిలిటెంట్ కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించటం కోసం వస్తున్న ఫోన్‌కాల్స్‌ను అడ్డుకుంటున్నామని రక్షణ కార్యకలాపాలలో పాల్గొంటున్న సంస్థలు చెబుతున్నాయి.

పరిస్థితులు సాధారణంగానే ఉన్నాయని ప్రభుత్వం చేస్తున్న వాదనలను ఇప్పుడు జరుగుతున్న టెర్రరిస్టు దాడులు సవాలు చేస్తున్నాయి. పాకిస్తాన్‌లో కల్లోలంగా ఉన్న ఖైబర్, పఖ్తూన్‌ఖ్వా, బలూచిస్తాన్‌లలో దాడులు జరుగుతున్న సమయంలోనే ఇక్కడ కూడా దాడులు జరుగుతున్నాయి. న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తమ భూభాగంలో భారతదేశం తీవ్రమైన దాడులు జరుపుతున్నదని పాకిస్తాన్ ఆరోపిస్తున్నది. పాకిస్తాన్ మాజీ సైనిక బ్రిగేడియర్, ఇంటర్ సర్వీస్ ఇంటలిజెన్స్ –ఐఎస్ఐ– బాధ్యతల్లో పనిచేసిన అమీర్ హంజాను పంజాబ్‌లోని జీలం జిల్లాలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. 2018లో జమ్మూలోని సజువాన్ సైనిక క్యాంపుపై జరిగిన ఆత్మాహుతి దాడిలో ఆయన ప్రధాన అనుమానితునిగా ఉన్నాడు. మరొక ఘటనలో సంజువాన్ దాడిలో మరో ప్రధాన అనుమానితుడైన లష్కర్–ఇ–తైబా కమాండర్ ఖ్వాజా షహీద్– ఆయనను మియా ముజాహిద్ అని కూడా పిలుస్తారు–ను పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఎల్‌ఒసి సమీపంలో తల నరికి చంపారు. సరిహద్దుల వద్ద జరిగిన రెండు డజన్లకు పైగా టెర్రరిస్టు దాడులలో వారు భాగస్వాములైనట్లు నమోదై ఉన్నది. సరిహద్దులకు రెండు వైపులా తుపాకులతో సంచరిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు వారిని చంపారు.

### దాడులు అడ్డుకోవడంలో అసమర్ధత

జమ్మూలోని అటవీప్రాంతంలో తీవ్రవాదులు పొంచి ఉండి సైనికులపై దాడులు జరిపినపుడు అదనపు బలగాలు రావటంలో తరచుగా ఆలస్యం జరుగుతున్నదని కొన్ని నివేదికలు తెలుపుతున్నాయి. వ్యూహాత్మకమైన లోపాలు, దాడులు జరపటంలో అసమర్ధంగా వ్యవహరించటం, తగినన్ని ఆయుధాలు, అవసరమైన ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవటం ఆందోళన కలిగిస్తున్నది. రక్షణ విభాగంలో పనిచేస్తున్న వివిధ సంస్థలు, ఇంటెలిజెన్స్ ఏజన్సిలను సమన్వయం చేయటం కోసం ఐక్య కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఉన్న వనరులను గరిష్టంగా వినియోగించుకోవాలని, వీటన్నింటి కన్నా నిర్దిష్టంగా జవాబుదారీ తనాన్ని నిర్దేశించాలని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్, నార్తరన్ కమాండ్‌లో మాజి జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా, యురి సర్జికల్ స్ట్రైక్‌కు ప్లాన్, అమలు చేయుటంలో ఇన్‌ఛార్జిగా పనిచేసిన డి ఎస్ హుడా ఫ్రంట్‌లైన్ పత్రిక ప్రతినిధితో మాట్లాడతూ చెప్పారు.

స్థానికుల ద్వారా టెర్రరిస్టుల సమాచారం తెలుసుకోవటం కోసం దాడి చేసిన ప్రతిసారీ ప్రజలను భద్రతాదళాలు చుట్టుముడుతు

న్నాయి. కొన్ని సందర్భాలలో పాకిస్తాన్ స్థావరంగా పనిచేస్తున్న టెర్రరిస్టు గ్రూపు జైషే-ఇ-మహమ్మద్ వర్కర్లను కొందరిని అరెస్ట్ చేశామని ప్రకటిస్తున్నారు. కానీ ముఖ్యమైన సమాచారం ఏదీ లభ్యం కాలేదు. ఈ ప్రాంతాన్ని తిరిగి సైనికీకరించటానికి, వైమానిక దళంతో గూడచార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించిన తర్వాత టెర్రరిస్టుల సమాచారం తెలుసుకోవటం కోసం సున్నితతమైన ప్రాంతాలకు పారా మిలిటరి కమాండోలను పంపారు. అయినప్పటికీ ప్రధానమైన సవాళ్ళు మిగిలే ఉన్నాయి.

**❝ రక్షణదళాలు, స్థానిక ప్రజల మధ్య సమాచార సంబంధాలు దెబ్బతిన్న పరిస్థితుల లో ఈ మధ్య కొన్ని ఘటనలలో సామాన్య ప్రజలను చంపారు. వీటిని మిలిటెంట్లే చేశారా లేక వారి మద్దతుదారులు చేశారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. పౌర అధికారులు తక్కువగా ఉండి, సైన్యం, బిఎస్‌ఎఫ్‌పై ఎక్కువగా ఆధారపడే సరిహద్దు ప్రాంతాలలో అపరిష్కృతమైన సమస్యలు అనేకం ఉన్నాయి. ❞**

రక్షణదళాలు, స్థానిక ప్రజల మధ్య సమాచార సంబంధాలు దెబ్బతిన్న పరిస్థితుల లో ఈ మధ్య కొన్ని ఘటనలలో సామాన్య ప్రజలను చంపారు. వీటిని మిలిటెంట్లే చేశారా లేక వారి మద్దతుదారులు చేశారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. పౌర అధికారులు తక్కువగా ఉండి, సైన్యం, బిఎస్‌ఎఫ్‌పై ఎక్కువగా ఆధారపడే సరిహద్దు ప్రాంతాలలో అపరిష్కృతమైన సమస్యలు అనేకం ఉన్నాయి. సైన్యం-పౌరుల మధ్య సమావేశాలు జరిపే సాంప్రదాయాన్ని కొన్ని ప్రాంతాలలో తిరిగి పునరుద్ధరించారు.

సమాచార సేకరణలో విఫలం కావటం రక్షణదళాల కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నదని ఇంటెలిజెన్స్, ఇతరంగా అందుతున్న నివేదికలు తెలుపుతున్నాయి. "టెర్రరిస్టుల సమాచారాన్ని సేకరించటంలో టెర్రరిస్టు వ్యతిరేక ఇంటెలిజెన్స్ నిర్మాణం కీలకమైనది. ఒకసారి ఈ నిర్మాణాన్ని రద్దు చేసిన తర్వాత సమాచారం ఎలా లభ్యం అవుతుంది? స్థానిక పోలీసులకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఐఎస్ఐ ఈ లోపాలను గుర్తించి, వాటిని వినియోగించుకొంటున్నది" అని జనరల్ బక్షి చెప్పాడు.

"మిలిటెంట్లు పెద్ద గ్రూపులుగా పనిచేస్తూ, బ్రిగేడ్ హెడ్ క్వార్టర్లపై ఆత్మాహుతి దాడులు చేస్తున్న రాజౌరి, పూంచ్‌లలో పరిస్థితి మరీ భయానకంగా ఉంది. ఇక్కడి అడవులు, కొండలతో ఉన్న భూభాగం వారికి అనువుగా ఉన్నది. అయినప్పటికీ వారి వెన్నెముకను విరగగొట్టాం" అని కూడా ఆయన చెప్పాడు.

స్థానికంగా ఉన్న వనరుల ద్వారా లభిస్తున్న సమాచారం అంతగా ఉపయోగపడటం లేదని ఎల్ఒసి దగ్గర పనిచేస్తున్న రక్షణదళాల అధికారులు అనేకమంది చెప్పారు. ఈ పరిస్థితికి రక్షణదళాల గత వైఫల్యాలలే కారణమని స్థానిక పరిశీలకులు చెబుతున్నారు. తమ జీవితాలను ప్రమాదంలో పెట్టుకొని సమాచారం సేకరించి, రక్షణదళాలకు అందించిన అనేకమందికి తగిన పరిహారం అందించలేదని వారు చెప్పారు.

ఎల్ఒసి పక్కన నివసిస్తున్న స్థానికులు మాదకద్రవ్యాలను సంపాదించటానికి టెర్రరిస్టు కార్యకలాపాలను వినియోగించుకొంటున్నారని కూడా వార్తలు వస్తున్నాయి. సరిహద్దు అవతలి వారితో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని కీమి గ్రామానికి చెందిన నిజాం డిన్‌ను 2022లో అరెస్ట్ చేశారు. పూంచ్ జిల్లాలో అత్యధికంగా రక్షణ దళాలతో ఉన్న గ్రామం అది. పాకిస్తాన్ సరిహద్దులలో ఫెన్స్ వేసిన ప్రాంతానికి, జీరోలైన్‌కు అనేక కిలోమీటర్ల దూరంలో ఆ గ్రామం ఉంది. నిజాం డిన్ ఆపరేషన్ సద్భావన కింద జరుగుతున్న పౌర-సైనిక కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్నాడని చెబుతూ అతని కుటుంబం ఈ ఆరోపణలను తిరస్కరించింది. డిన్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ, ఉద్యోగాన్ని పర్మినెంటు చేస్తారని ఎదురు చూస్తున్నాడు. అతనిని అరెస్ట్ చేసిన తర్వాత భారీస్థాయిలో మాదక ద్రవ్యాలను, శక్తివంతమైన పేలుడు పదార్థాలను సరఫరా చేసే ముఠాను పట్టుకున్నామని పోలీసులు ప్రకటించారు. సమీపంలోని కాస్బా గ్రామం నుండి జైతూనా అక్తర్ అనే యువతితో పాటు ఐదుగురు టెర్రరిస్టు మద్దతుదారులను అరెస్టు చేయటానికి ఈ కార్యక్రమం దారితీసింది.

మిలిటెన్సి కార్యక్రమాలు వెనుకపట్టు పట్టిన తర్వాత ఇంటెలిజెన్స్, రక్షణ సంస్థలతో కలిసి పనిచేసిన స్థానికులను నిర్లక్ష్యం చేశారని సరిహద్దులకు సమీపంలో నివసిస్తున్న వారు కొన్ని సంవత్సరాల క్రితం ఈ రచయితకు చెప్పారు. అటువంటి వారిలో ఒకడైన ఘులాం హుస్సేన్ అలియాస్ టిట్రు ఒక ఆసక్తికరమైన కథ చెప్పాడు. అతను ఇంటెలిజెన్స్ సంస్థలతో కలిసి పనిచేస్తూ వారి ప్రశంసలు, సర్టిఫికెట్లు పొందాడు. కాని తన కుటుంబాన్ని పోషించుకోవటానికి అత్యల్పంగానే లభించేది. తమ సమాచారం సైనికులకు అందిస్తున్నందుకు ప్రతీకారంగా గుంట్రియన్ గ్రామంలోని అతని ఇంటిని మిలిటెంట్లు పేల్చివేసిన తర్వాత అతను తప్పనిసరై రహస్యంగా ఉండాల్సి వస్తున్నది.

గ్రామ రక్షణ కమిటీలు ఇపుడు తమను అవసరం లేని వారిగా చూస్తున్నారని ఎస్‌పిఒలు, గతంలో విలేజ్ డిఫెన్స్ గ్రూపు (విడిజి) లలో ఉన్నవారు, ఆయా గ్రామాల ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాకిస్తాన్‌లో రహస్యంగా పనిచేయటం కోసం గుఢచారులుగా చేర్చుకొన్నవారు అన్నింటికీ తెగించి పని చేస్తుంటే, వారు పట్టుబడిన తర్వాత పట్టించుకోకుండా వదిలి వేసిన కథలు అనేకం ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో 4,153 విడిసిలు, 32,355 మంది ఎన్‌పిఒలు ఉన్నట్లు 2022-23 వార్షిక నివేదికలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. జిల్లా పోలీసు అధికారుల ఆధ్వర్యంలో 1995లో విడిసిలను ఏర్పాటు చేశారు. అదే సంవత్సరం టెర్రరిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో సహకరించటం కోసం ఎన్‌పిఒలను తీసుకోవటం ప్రారంభించారు. సరిహద్దులకు రెండువైపులా ఉన్న టెర్రరిస్టులతో అవి సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

ఎస్‌పిఒలను క్యాజువల్ కార్మికులుగా పరిగణిస్తున్నారని, తక్కువ వేతనాలు ఇస్తుండటంతో వారు అసంతృప్తితో ఉన్నారని గూఢచార సంస్థలలోని వారు చెబుతున్నారు. అనుభవం ఆధారంగా వారు నెలకు 6,000 నుండి 18,000 రూపాయల వరకు పొందుతున్నారు. 15 సంవత్సరాలకు పైగా పనిచేస్తూ, డజను మందికి పైగా టెర్రరిస్టులను చంపటానికి కారణమైన ఎస్‌పిఒలు కూడా

> **❝ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం చెబుతున్న మాటలు తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయి. గత 10 సంవత్స రాల నుండి స్థానికంగా నిర్వాసితులైన వారు పిర్ పంజాల్‌లోని కొండ ప్రాంతంలోని తమ నివాసాలకు తిరిగి వెళ్ళటం లేదు. "మా ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పించి, ఇల్లు కట్టుకోవటానికి, నా వ్యవసాయం చేసుకోటానికి ప్రభుత్వం సాయం చేస్తే నా స్వగ్రామానికి తిరిగి వెళతాను" అని తల్‌వారా శరణార్థుల శిరంలో ఉంటున్న జగ్‌దేవ్ సింగ్ చెప్పాడు. ❞**

తమను శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటారని ఎదురు చూస్తున్నారు.

లొంగిపోయిన ఇద్దరు మిలిటెంట్లు ఎస్‌పిఒలుగా చేరి, ఒక ఐఎన్‌ఎస్‌ఎఎస్, ఒక ఎకె 47 రైఫిల్‌తో 2015లో దోడా పోలీస్ స్టేషన్ నుండి పారిపోయారు. మరొక ఉ దంతంలో 2018లో ఒక ఎస్‌పిఒ కాశ్మీర్‌లోని హిజబుల్ ముజాహిద్దీన్ టెర్రరిస్టు గ్రూపులో చేరటం కోసం ఏడు ఎకె 47 రైఫిళ్ళు, ఒక ఐఎన్‌ఎస్‌ఎఎస్ తీసుకొని పారిపోయాడు.

అంకితభావంతో పనిచేస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా తీసుకొంటామని ఈ సంవత్సరం జనవరిలో స్వైన్ ప్రకటించాడు. హిరానగర్ సెక్టార్‌లో ఈ మధ్యకాలంలో జరిగిన ఎదురు కాల్పులలో ఇద్దరు టెర్రరిస్టులు చనిపోయారు. ఆ తర్వాత స్వైన్ తొమ్మిదిమంది ఎస్‌పిఒలకు కానిస్టేబుళ్ళుగా ప్రమోషన్ ఇచ్చాడు. విడిజిలను కూడా బలపరుస్తామని కథువాలో విలేకరులతో చెప్పాడు.

పాకిస్తాన్, చైనాతో ఉన్న పర్వతమయమైన సరిహద్దుల వలన అక్కడ సైనికదళాలను బలపరచాలని జనరల్ బక్షి చెప్పారు. "సమతల ప్రాంతాలలో 1:3 ఆధిక్యత సరిపోతుంది. కాని కొండప్రాంతాలలో 1:10 ఆధిక్యత కావాల్సి ఉంటుంది. టెర్రరిజం పునరుత్తేజం పొందిన రూపంలో మనం ఇప్పటికే మూల్యం చెల్లించామని" ఆయన చెప్పాడు.

సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం చెబుతున్న మాటలు తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయి. గత 10 సంవత్సరాల నుండి స్థానికంగా నిర్వాసితులైన వారు పిర్ పంజాల్‌లోని కొండ ప్రాంతంలోని తమ నివాసాలకు తిరిగి వెళ్ళటం లేదు. "మా ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పించి, ఇల్లు కట్టుకోవటానికి, నా వ్యవసాయాన్ని తిరిగి ప్రారంభించటానికి ప్రభుత్వం కొంత ఆర్థిక సహకారాన్ని అందిస్తే నా స్వగ్రామం నార్‌కోటెకు తిరిగి వెళ్ళేవారిలో నేను మొదటి వాడిగా ఉంటాను'' అని రేసి జిల్లాలోని తల్‌వారా శరణార్థుల శిరంలో ఉంటున్న జగ్‌దేవ్ సింగ్ చెప్పాడు. " అదే సమయంలో ప్రభుత్వం విడిజిలకు ఇస్తున్న తుప్పు పట్టిన 303 రైఫిల్స్ కాకుండా ఆధునికమైన ఆయుధం నాకు ఇవ్వాలని కూడా కోరుతున్నాను" అని కూడా అతను చెప్పాడు. ఈ సంవత్సరం జూన్ నెలలో జిల్లా పోలీసులు తుపాకి కాల్చటం నేర్పుతున్నపుడు నర్‌కోటే గ్రామ వాస్తవ్యులు బల్‌దేవ్ సింగ్, తారామణి తమ తుపాకులు పేలిపోయి చనిపోయిన ఉదంతాన్ని అతను ప్రస్తావించాడు.

బెదిరింపులు, కొత్త సవాళ్ళు ఎదురౌతున్నప్పటికీ ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో గత 35 సంవత్సరాల కన్నా అత్యధికంగా ఓటర్లు ఎన్నికలలో పాల్గొన్నారు. ఐదు లోక్‌సభ స్థానాలలో సగటున 58.4 శాతం మంది ఓట్లు వేశారు. " భారతదేశ ఎన్నికల విధానంలో ఇదొక పెద్ద ముందడుగు" అని ఎన్నికల కమిషన్ పేర్కొంది.

ఈ సంవత్సరం సెప్టెంబరుకు ముందే శాసనసభ ఎన్నికలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కాని ఈ మధ్య కాలంలో దాడులు పెరిగిన తర్వాత రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హుస్సేన్, సైనిక దళాల మాజి ప్రధానాధికారి జనరల్ విపి మాలిక్‌లు ఇది నష్టం కలిగిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాని ఎన్నికైన ప్రభుత్వం లేకపోతే ప్రజలు దూరమౌతారని, ఈ పరిస్థితులు మిలిటెంట్లకు ఉపయోగపడతాయని వివిధ రాజకీయ పార్టీల నాయకులు భావిస్తున్నారు.

ఈ మధ్యకాలంలో టెర్రరిస్టు దాడుల తర్వాత డిజిపి స్వైన్‌ను తొలగించాలని మాజి ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి డిమాండ్ చేశారు. మరోవైపున ప్రాంతీయ పార్టీలు మిలిటెంట్ల పట్ల సానుభూతితో వ్యవహరిస్తున్నాయని స్వైన్ ఆరోపించాడు. "మిలిటెంట్ల పట్ల సానుభూతితో ఉంటూ, రక్షణ దళాలు మరింత గట్టిగా వ్యవహరించాలని డిమాండ్ చేసే ద్వంద్వ వాదనలు చేయటంలో చాలా మంది రాజకీయ నాయకులు నైపుణ్యం సంపాదించారనటానికి చాలా సాక్ష్యాలు ఉన్నాయి. దీనితో సాధారణ ప్రజలు గందరగోళంలో పడుతున్నారు" అని ఆయన చెప్పారు.

మెహబూబా ముఫ్తికి ముందు ముఖ్యమంత్రిగా ఉన్న ఒమర్ అబ్దుల్లా దీనికి బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వం పైనే పెట్టాడు''. పరిస్థితులు 1996 కన్నా దిగజారాయనుకుంటే, రక్షణ బలగాలపై మిలిటెంట్ల ఆధిపత్యాన్ని నెలకొల్పాలని మీరు భావిస్తున్నట్లైతే ఎన్నికలు జరపవద్దు" అని శ్రీనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పాడు. ''పోలీసులు, సైనికులు మీ ఆధీనంలో ఉన్నట్లు భావిస్తుంటే, అధికారులకు తగినంత ధైర్యం ఉంటే సకాలంలో ఎన్నికలు జరపండి" అని ఆయన డిమాండ్ చేశాడు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# అభ్యుదయ సాంస్కృతికోద్యమ చరిత్ర ఒక పరిశీలన

**సాంస్కృతిక రంగంలో పార్టీ అవగాహన కోసం ఇటీవల విజయవాడలో జరిగిన సదస్సులో సమర్పించబడిన పత్రాల్లో కొన్నిటిని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం**

**1. ప్రాధాన్యత :**

కమ్యూనిస్టులు మన దేశ అభ్యుదయ సాంస్కృతికోద్యమంలో భాగస్వాములుగా ఉన్నారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ, సాంస్కృతిక రంగంలో ముఖ్య భూమికను పోషించవలసిన కర్తవ్యం కమ్యూనిస్టులకు ఉంది. అందుచేత గత సాంస్కృతిక చరిత్రను అధ్యయనం చేయడం అవసరం.

**2. సంస్కరణోద్యమాల ప్రభావం :**

19వ శతాబ్దంలో మన దేశంలో తలెత్తిన సాంఘిక సంస్కరణోద్యమాలు కులాధిపత్యానికి వ్యతిరేకంగా, మహిళలపై అణచివేతకు వ్యతిరేకంగా, విద్యా హక్కు కోసం హక్కుల ఉద్యమాలుగా కొనసాగాయి. అప్పటి ఆధిపత్య సంస్కృతిని విమర్శనాత్మకంగా పరిశీలించడం, ప్రతిఘటించడం ఆ ఉద్యమాల ప్రధాన లక్షణం. సాంప్రదాయాలను సవాలు చేయడం, నిరసన వ్యక్తం చేయడం ద్వారా ఆధిపత్య సంస్కృతిపై ధ్వజమెత్తడం మన దేశంలో ప్రాచీన కాలం నుండే ఉంది. ఐతే, మనదేశం మీద వలస పాలకుల ఆధిపత్యం కొనసాగడం, ఉన్నత తరగతుల ప్రజల్లో కొందరు పశ్చిమ దేశాలలో విద్యనభ్యసించి అక్కడి ఆధునిక భావాలతో ప్రభావితులు కావడంతో వారిలో ఒక జాతీయ అస్తిత్వం కోసం తపన, అన్వేషణ మొదలైంది. ఆ ప్రభావం 19వ శతాబ్దపు సాంస్కృతిక ఉద్యమాలమీద ప్రభావం చూపింది. దేశంలో వివిధ ప్రాంతాలలో తలెత్తిన సాంఘిక సంస్కరణోద్యమాలు, ఆధునిక విద్య, వలసదోపిడీకి వ్యతిరేకంగా తలెత్తుతున్న నిరసనలు సాంస్కృతిక రంగంలో వ్యక్తం అవుతూ వచ్చాయి.

**3. జాతీయోద్యమ ప్రభావం :**

1930, 1940 దశకాల్లోని సాంస్కృతికోద్యమం జాతీయోద్యమంతో చారిత్రికంగా చాలా సన్నిహితంగా పెనవేసుకుపోయింది. 1920 దశకం నుండే జాతీయోద్యమం ఒక ప్రజా ఉద్యమంగా పెంపొందింది. విస్తరిస్తున్న కార్మిక, కర్షక పోరాటాలతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం కొత్త లక్షణాలను సంతరించుకుంది. దానికి తోడు రష్యన్ విప్లవం ప్రభావం కూడా ఉంది. యూరప్‌లో తలెత్తిన ఫాసిజం, రెండు ప్రపంచ యుద్ధాలు కూడా ప్రభావితం చేశాయి. ఈ నేపధ్యంలో జరిగిన సామాజిక మథనంలో నుంచి సమాన హక్కులు, సామాజిక న్యాయం సమకూరే విధంగా ఉండే స్వతంత్ర గణతంత్ర రాజ్యంగా మన దేశం ఉండాలనే ఒక భావన ప్రజాబాహుళ్యంలో బలంగా వేళ్ళూనుకుంది. ఈ భావన కేవలం ఒక సైద్ధాంతిక భావనగానే కాక, సాంఘిక ఉద్యమాలలో, సృజనాత్మక, విమర్శనాత్మక సాహిత్యంలో పత్రికా రంగంలో, నాటక ప్రదర్శనలలో, పాటలలో, ఇతర కళారూపాలలో వ్యక్తం అయింది. అనతికాలం లోనే అది చలనచిత్ర రంగంలోనూ ముందుకొచ్చింది. అదే సమయంలో వర్గ, కుల, మతతత్వ ప్రాతిపదికలతో జాతీయోద్యమంలో చీలికలు తలెత్తాయి. సామాజికంగా తిరోగమన దృక్పథంతో వ్యవహరించే శక్తులు ప్రజల స్వాతంత్ర్య వాంఛను రక్తపుటేరుల్లో ముంచెత్తడానికి ప్రయత్నించారు. జాతీయోద్యమంలోని ఈ పరస్పర విరుద్ధ ధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తూ ఇటు కమ్యూనిస్టు పార్టీ, అటు ఆరెస్సెస్ ఆవిర్భవించింది ఈ కాలంలోనే. ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న సైద్ధాంతిక పోరాటంతో అభ్యుదయ సంస్కృతిని పెంపొందించడం ముడిపడి వున్నట్టు కమ్యూనిస్టులు పరిగణించారు. కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన కాలంలో కూడా కమ్యూనిస్టు మేథావులు ఒక సాంస్కృతిక ఐక్య సంఘటనను నిర్మించడంలో ఉత్ప్రేరకంగా పని చేశారు. మితవాద వర్గాల ఆధిపత్యాన్ని విమర్శనాత్మకంగా ఎదిరించడానికి, పోరాడుతున్న సామాన్య ప్రజల నిజ జీవితాలకు, వారి ఆకాంక్షలకు సన్నిహితంగా సంస్కృతిని తీసుకురావడానికి ఆ వేదికను ఉపయోగించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఒక ప్రజా ఉద్యమంగా పెంపొందడం వలన ఈ ప్రజాభ్యుదయ భావాలను బలంగా వ్యాప్తి చేయడం సుసాధ్యమైంది.

**4. 'హిందూత్వ' ప్రభావం :**

మరోవైపున ఆరెస్సెస్ బ్రిటిష్ పాలకులు ముందుకు తెచ్చిన ద్విజాతి సిద్ధాంతాన్ని తన సిద్ధాంతంగా స్వీకరించింది. దాని ప్రాతిపదికన చీలికలను సృష్టించే, ప్రజావ్యతిరేక స్వభావం కల "హిందూ రాష్ట్రం" అనే భావనను ఎగదోసింది. అది ఇటలీలో ముస్సోలినీ రూపొందించిన ఫాసిస్టు భావజాలం మీద ఆధారపడినట్టిది. జాతీయోద్యమంలో వాళ్ళు ఏ మాత్రమూ పాలు పంచుకోలేదు సరి కదా మొదటినుండీ మన దేశంలో ఫాసిజానికి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. దేశంలోని ఆధిపత్య వర్గాలలో అత్యంత తిరోగామి ధోరణులకు, హింసాత్మక స్వభావానికి వాళ్ళు ప్రతినిధులు. కొన్ని చారిత్రక సంఘటనల సందర్భంగా వారు ఎక్కువ ప్రభావాన్ని కలిగించగలిగింది ఈ కారణంగానే.

**5. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం :**

1936 ఏప్రిల్ లో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. యుద్ధ కాలంలో దీనిని ఫాసిస్టు వ్యతిరేక రచయితల, కళాకారుల సంఘం అని పిలిచేవారు. ఇది ఏర్పడడానికి ఒక అంతర్జాతీయ నేపథ్యం ఉంది. ఫాసిజాన్ని ఎదుర్కోడానికి, ఆ ఆటవిక శక్తుల దాడులకింద నలిగిపోకుండా సాంస్కృతిక రంగాన్ని కాపాడుకోడానికి యూరప్ లో అంతర్జాతీయ రచయితల సంఘం ఏర్పడింది. రొమానియన్ రోలండ్, హెన్రీ బార్బూసా తదితరులు దీనికి సారథులు. జాతీయోద్యమ నాయకులలో జవహర్‌లాల్

> "1948లో పార్టీపై నిషేధం విధించడం వలన బహిరంగంగా సాంస్కృతిక కార్యకలాపాలను కొనసాగించడం సమస్యాత్మకంగా మారింది. కార్యకర్తలు బెదిరిపోయారు. చాలామంది పోలీసు నిఘాలో ఉన్నారు. ఇంకా అనేకులు జైళ్ళపాలయ్యారు. కొంతమంది అతివాద రాజకీయ విధానం కారణంగా వెనక్కు తగ్గారు."

నెహ్రూ వంటి కొందరు ఈ ఫాసిస్టు-వ్యతిరేక రచయితల సంస్థలతో, మేధావులతో సంబంధాలు పెంచుకున్నారు. దానితోబాటు సోవియట్ యూనియన్ లో జరుగుతున్న సోషలిస్టు ప్రయోగాలు వారిని ప్రభావితం చేశాయి. అభ్యుదయ రచయితల సంఘం పుట్టినప్పటినుంచీ భారతీయ మేధావులలో పేరెన్నిక గలవారందరినెందరినో ఆకర్షించగలిగింది. ఆ విధంగా ఆకర్షించబడ్డ మేధావులు కూడా జాతీయోద్యమానికి అంతర్గతంగా (ఆరెస్సెస్ వంటి తిరోగామి సంస్థలనుండి) పొంచివున్న ముప్పు పట్ల అవగాహన ఉన్నవారేనని దీనిని బట్టి స్పష్టం అవుతోంది.

ఫాసిస్టులు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి రాజకీయంగా తోడ్పడగలుగుతారని, కళారంగంలో వాస్తవికతను వారు కూడా ప్రోత్సహిస్తారని - ఇలా భ్రమించిన కొందరు మేధావులకు ఫాసిజం పట్ల ఉన్న ఆకర్షణను పటావంచలు చేయడంలో అ.ర.సం. చాలా గట్టి కృషి చేసింది. దానితోబాటు 'సౌందర్యాభిరుచితో సంబంధం ఉన్న ఏ సంస్థకైనా, ఏ కళకైనా 'అభ్యుదయం' అనే ముద్ర ను తగిలించడం అవసరమా?' 'సంస్థాగత క్రమశిక్షణ కళకు శత్రువా ?' 'రూపం - సారం మధ్య సంబంధం ఎటువంటిది?' వంటి అంశాలను చర్చనీయాంశాలుగా ముందుకు తెచ్చింది. వాటితోబాటు 'ప్రజా యుద్ధానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి మధ్య వైరుధ్యం' గురించి కూడా చర్చించింది. ఈ చర్చలలో కమ్యూనిస్టులు చాలా సానుకూలమైన పాత్ర పోషించారు. తద్వారా సాంస్కృతిక ప్రత్యాధిపత్యం (కౌంటర్ హెజిమోనీ) దిశగా ఆ చర్చలు పెంపొందాయి.

**6. ఇప్టా ఆవిర్భావం :**

కమ్యూనిస్టు పార్టీ మీద ఉన్న నిషేధాన్ని ఎత్తివేశాక, ముంబైలో పార్టీ మహాసభ జరిగింది. ఆ మరుసటి ఏడాదే, మే 1943 లో ఇప్టా (ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఆర్ట్స్) ఏర్పడింది. (1941లోనే ఇప్టా బెంగుళూరు శాఖ ఏర్పడింది) దాని ప్రణాళికలో పేర్కొన్నట్టుగానే ఇప్టా ఒక పార్టీ సంస్థ ఎంతమాత్రమూ కాదు. దాని వెనుక లోతుగా రూపొందించిన పథకమూ ఏదీ లేదు. ఐతే, చరిత్రలో ఒక కీలక ఘట్టంలో అప్పటి కళాకారులందరినీ నూతన అభ్యుదయ భావాల ప్రాతిపదికన ఒకే వేదికపైకి సమీకరించే కర్తవ్యాన్ని పార్టీ స్వీకరించింది. దానితోపాటు కార్యకర్తల అంకిత భావం, కృషి ఆ సంస్థ పటిష్టంగా రూపొందడానికి దోహదం చేశాయి. దేశమంతటా పెల్లుబుకుతున్న సృజనాత్మకత, సామ్రాజ్యవాద పాలన కింద ఉన్న కళాకారుల తీవ్ర అసంతృప్తి, ఒక తరం మొత్తంమీద వివిధ రంగాలలో ఉన్న నైపుణ్యం కల కళాకారులందరూ ఒక వేదికపైకి వచ్చి సంఘటితం కావడానికి దోహదం చేశాయి. ఆనాటికి దేశంలో పేరుపొందిన కళాకారులలో అత్యధికులు ఈ వేదికకు చాలా సన్నిహితులయ్యారు. ఈ వేదికద్వారా ముందుకొచ్చిన ఎందరో యువ కళాకారులు ఆ తర్వాత కాలంలో సాంస్కృతిక రంగంలో లబ్ధప్రతిష్టులుగా వెలిగారు.

**7. విశాల ప్రాతిపదిక :**

బెంగాల్ కరువు, యుద్ధం సాగిన కాలంలో ఆహార ధాన్యాల కొరత, ధనిక-పేద తారతమ్యాలు పెరిగిపోయిన కారణంగా పతనమైన నైతిక విలువలు, భీతి గొలిపే స్థాయిలో వ్యాపించిన మతవిద్వేషం ప్రజానీకం నడుమ సాగించే సాంస్కృతిక కృషివేగాన్ని, విస్తృతిని పెంచవలసిన ఆవశ్యకతను ముందుకు తెచ్చాయి. ఈ విషయంలో ప్రజల నడుమ కళా ప్రదర్శనలిచ్చే ఇప్టా అ.ర.సం. కన్నా ఎక్కువ విస్తారంగా ప్రజలలోకి చొచ్చుకుపోయింది. సాహితీ సంస్కృతి పరిధులను దాటి సామాన్య ప్రజానీకంలో, ముఖ్యంగా అట్టడుగు తరగతుల ప్రజల్లో ఉన్న సాంస్కృతిక సృజనాత్మకతను ఇప్టా స్పృశించగలిగింది. ముఖ్యంగా గ్రామీణ పాటక జనం తమవైన స్వంత సాంస్కృతిక వనరులను పుష్కలంగా కలిగివున్నారని, వాటి ద్వారా తమ జీవిత వాస్తవికతలకు వారు రూపం కల్పించగలుగుతున్నారని తెలుసుకోవడం ఒక కొత్త విషయమే అయింది. దానితో ఆ శ్రామిక ప్రజానీకానికి, విద్యావంతులైన వారి సంస్కృతికి నడుమ ఒక వారధిని నిర్మించడం సాధ్యపడింది. రైతాంగ, కార్మిక పోరాటాలనుండి నైపుణ్యం కలిగిన కళాకారులు ఒక స్వేచ్ఛాయుత, సమైక్య భారతదేశ భావనను విస్తృతంగా ప్రజలలోకి తీసుకుపోగలిగారు. ఇప్టా నిర్మాణసామర్థ్య పరిమితులను దాటిపోయిప్రజా కళా ఉద్యమం విస్తరించింది. మధ్య తరగతి మేధావులను, నిజమైన ప్రజా కళాకారులను ఒకదగ్గరకు చేర్చింది.

**8. స్వాతంత్ర్యానంతర మార్పులు :**

ఈ కాలంలో ఇప్టా సాధించిన ఉన్నత స్థాయిని, నిర్మాణ పటిమను అదే స్థాయిలో స్వాతంత్ర్యానంతర కాలంలో సుదీర్ఘ కాలంపాటు కొనసాగించడం సాధ్యపడని విషయమే అయింది. ఇప్టా నిర్వహించిన సాంస్కృతిక ప్రత్యాధిపత్య పాత్ర ను సవాలు చేసే విధంగా అనేక అంశాలు స్వాతంత్ర్యానంతరం ముందుకొచ్చాయి.

1948లో పార్టీపై నిషేధం విధించడం వలన బహిరంగంగా సాంస్కృతిక కార్యకలాపాలను కొనసాగించడం సమస్యా త్మకంగా మారింది. కార్యకర్తలు బెదిరిపో యారు. చాలామంది పోలీసు నిఘాలో ఉన్నారు. ఇంకా అనేకులు జైళ్ళపాలయ్యారు. కొంతమంది అతివాద రాజకీయ విధానం కారణంగా వెనక్కు తగ్గారు.

జాతీయోద్యమం భిన్నవర్గాల, భిన్న దృక్పథాల ఉద్యమాలను, వ్యక్తులను ఒక ప్రధాన స్రవంతిగా తనలో కలుపుకుని సాగింది. స్వాతంత్ర్య సాధన తర్వాత ఈ విశాల ఐక్యత అదే మాదిరిగా కొనసాగే ప్రాతిపదిక లేకుండా పోయింది. అధికారం చేపట్టిన వర్గాల స్వభావం పట్ల భిన్నమైన అంచనాలు ఉండడంతో సాంస్కృతికోద్యమంలో అంతవరకూ ఉన్న విశాల ఐక్యత చెదిరిపోయింది. దీనికి తోడు సాంస్కృతిక రాజకీయాల ప్రాధాన్యతను పార్టీ నాయకత్వం కొంతవరకూ తక్కువ అంచనా వేయడం, ఆ రంగానికి ఎదురైన సమస్యలను తేలికగా తీసుకోవడం జరిగింది. సాంస్కృతిక రంగం

యెడల నాయకత్వంలో ఈ ధోరణి 1951లో పార్టీ విధానాన్ని సరిదిద్దుకున్న తర్వాత కూడా కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం సాంస్కృతిక రంగంలో చోటు చేసుకుంటున్న కొత్త మార్పులు ఆ సాంస్కృతిక కార్యకర్తలనే కొంత గందరగోళంలో పడవేశాయి. దీని కారణంగా ఒక్కోసారి దిశారహితంగా ఉదారవాద ధోరణిని ప్రదర్శించడం, మరికొన్ని సందర్భాలలో చురుకుగా ఉండే సాంస్కృతిక కార్యకర్తల యెడల యాంత్రికంగా, నిర్మాణ సూత్రాల పేరుతో సంకుచితంగా వ్యవహరించడం జరిగింది. మరోపక్క నెహ్రూ ప్రభుత్వం చేపట్టిన సాంస్కృతిక విధానం, ఏర్పాటు చేసిన వివిధ అకాడెమీల వ్యవస్థలు మన దిశా రాహిత్యానికి తోడై ఉద్యమం బలహీనపడడానికి దారి తీసింది. సాంస్కృతిక ఉద్యమం తన మనుగడ కొనసాగడానికి రాజ్యం మీద ఆధారపడడం పెరిగింది. యుద్ధానంతర సంవత్సరాల్లో శాంతి సాంస్కృతిక ఉద్యమాన్ని విశాల ప్రాతిపదికన మేధావులందరితోనూ నిర్వహించగలిగినా, 1956 తర్వాత ఇప్టా ఒక అఖిల భారత సంస్థగా కొనసాగలేకపోయింది.

“ ఇప్టా, అరసం అఖిలభారత సంస్థల కేంద్రాల డాక్యుమెంట్లు మనకు లభ్యమౌతున్న వాటిని బట్టి 1950 దశకం వరకూ అభ్యుదయ సాంస్కృతికోద్యమ చరిత్రను గుర్తించ గలుగుతున్నాం. ఆ తర్వాత కాలంలో కూడా చాలా రాష్ట్రాలలో సాంస్కృతికోద్యమాల కార్యకలా పాలు కొనసాగాయి. కాని వాటి అనుభ వాలను చెదురుమదురుగానే ఉదహరించగలం. ఆ అనుభవాలను ఒకదగ్గర పోగు చేసే ప్రయత్నంలో వెనుక బడడమే దీనికి కారణం. ”

**9. ప్రతిపక్ష పాత్ర :**

ఐనప్పటికీ, 1950 దశకంలో సాహిత్యంలో, నాటకరంగంలో, సినిమా రంగంలో సైతం ఒక విమర్శనాత్మక, వాస్తవిక ధోరణిని ఎంతో సుసంపన్నమైన స్థాయిలో ప్రవేశపెట్టడంలో ఇప్టా నిర్వహించిన పాత్రను విస్మరించలేం. అదే సమయంలో తెలంగాణా, తెభాగా, కయ్యూర్ రైతాంగ పోరాటాల సందర్భాలలో పుట్టుకొచ్చిన, విశేష ప్రజాదరణ పొందిన పాటలను, నాటకాలను, ఇతర కళారూపాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ఆ పోరాటాలతో ఇప్టా మమేకమై పని చేసినందున ఆ ముద్ర ఆ కళా రూపాలమీద స్పష్టంగా కనిపిస్తుంది.

ఇప్టా, అరసం అఖిలభారత సంస్థల కేంద్రాల డాక్యుమెంట్లు మనకు లభ్యమౌతున్న వాటిని బట్టి 1950 దశకం వరకూ అభ్యుదయ సాంస్కృతికోద్యమ చరిత్రను గుర్తించగలుగుతున్నాం. ఆ తర్వాత కాలంలో కూడా చాలా రాష్ట్రాలలో సాంస్కృతికోద్యమాల కార్యకలాపాలు కొనసాగాయి. కాని వాటి అనుభవాలను చెదురుమదురుగానే ఉదహరించగలం. ఆ అనుభవాలను ఒకదగ్గర పోగు చేసే ప్రయత్నంలో వెనుకబడడమే దీనికి కారణం. 1960 దశకంలో కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక, 1970 దశకంలో నక్సల్ చీలిక విశాల సాంస్కృతిక వేదిక అనే భావన మీద తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. అభ్యుదయ సంస్కృతి నుండి జనతా ప్రజాతంత్ర సంస్కృతి దిశగా సాగవలసిన క్లిష్టమైన ప్రయాణం ఈ మారిన పరిస్థితులలో మరింత ఆలస్యం అయింది.

అయినప్పటికీ, అభ్యుదయ సాంస్కృతికోద్యమం సాంస్కృతిక రంగంలో ఒక బలమైన ప్రతిపక్ష శక్తిగా కొనసాగిందనే చెప్పాలి. ఐతే రాజకీయ బలాబలాలను అది తల్లక్రిందులు చేయలేకపోయివుండొచ్చు. అందుకు సంబంధించిన కొన్ని ఉదంతాలను మాత్రమే ఇవ్వగలుగుతాం. అవి చాలా కొద్దిగా మాత్రమే ప్రస్తావించగలుగుతున్నాం. వాస్తవానికి ఇంకా చాలా ఎక్కువ ఉన్నాయి. ముఖ్యంగా ఎమర్జెన్సీ కాలంలో సాంస్కృతిక కార్యకలాపాలను సెన్సారు చేయడం, ఆ వెంటనే ఏర్పడిన రాజకీయ కల్లోల పరిస్థితులు అభ్యుదయ సాంస్కృతికోద్యమానికి ఒక కొత్త ఊపునిచ్చాయి. కొన్ని రాష్ట్రాలలో వ్యాపార పరిధులను అధిగమించి అప్పటికే అభ్యుదయ నాటకోద్యమం నడుస్తోంది. ప్రత్యామ్నాయ నాటక రంగానికి సంబంధించి ఒక తరానికి ఉత్పల్ దత్–బాదల్ సర్కార్– హబీబ్ తన్వీర్ ప్రతినిధులైతే, కర్నాటకలోని సాముదాయ గ్రూపు, ఢిల్లీలో సఫ్దర్ హష్మీ, సహమత్ తర్వాత తరంగా ఆ పోరాటానికి ప్రతినిధులు. కేరళలో శాస్త్ర సాహిత్య పరిషత్ ప్రచురణలు, పశ్చిమ బెంగాల్ లో చిన్నచిన్న పత్రికలు ఒక ప్రతిపక్ష సంస్కృతికి డిమాండ్ ను సృష్టించగలిగాయి. జర్నల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఐడియాస్ అనే పత్రిక 1980 దశకంలో వచ్చింది. రాష్ట్రాలలో సృజనాత్మకంగా సాగే సాంస్కృతిక కార్యకలాపాల వీక్షణం లక్ష్యంగా అది ప్రారంభమైంది. సాంప్రదాయంగా సినిమాల్లో , డాక్యుమెంటరీలలో చూపేదానికి భిన్నంగా కొత్తగా చూపడానికి, కొత్త తరాల అభిరుచులను పెంపొందించడానికి ఫిలిం సొసైటీలు 1950 దశకంలో ఏర్పడ్డాయి. సత్యజిత్ రే–రిత్విక్–మృణాల్ త్రయం తర్వాత శ్యాం బెనెగల్, అదూర్ గోపాలకృష్ణన్, గిరీష్ కాసరవల్లి. సయ్యిద్ మీర్జా, తదితర యువ దర్శకుల తరం దూసుకొచ్చింది. చిత్ర లేఖనంలో పాతతరం గురువులు చిత్తప్రసాద్, సోమనాథ్ హెూరే, ఎం.ఎఫ్. హుస్సేన్ వంటివారి స్థానాల్లో గులాంషేక్, వివన్ సుందరం వంటి కొత్త తరం వచ్చింది.

వీరంతా ఒక అఖిల భారత సంస్థ ఆధ్వర్యంలో తమ సృజనను నిర్వహించక పోవచ్చు. వామపక్ష ఉద్యమాలలో తాము అంతర్భాగం అని వీరిలో చాలా మంది ప్రకటించివుండకపోవచ్చు. కాని వారి సాంస్కృతిక కృషి ప్రజాభిప్రాయాన్ని తమ సాంస్కృతిక నిరసన దిశగా ప్రభావితం చేసింది. ఐతే వారిలో అత్యధికుల కృషి విద్యావంతుల సమాజ పరిధిని దాటి ముందుకు పోలేదు. ఐనా, వారు బలంగా ముందుకు తెచ్చిన విలువలు ఆధిపత్య వర్గాల సంస్కృతిని సైతం కొంతవరకూ ప్రభావితం చేయగలిగాయి. ఆధిపత్య సంస్కృతి పరిధిలో సైతం సమాన హక్కుల గురించి, వర్గ, కుల, లైంగిక న్యాయం గురించి, లౌకిక తత్వం గురించి చర్చ జరిగింది. సాంస్కృతిక ప్రమాణాలను పాటించాలా లేక కేవలం వ్యాపార దృక్పథమే సరిపోతుందా అనే చర్చ కూడా జరిగింది. ప్రభుత్వం విద్య, సంస్కృతికి సంబంధించి విధానాలను రూపొందించే సందర్భాలలో, సాహిత్య, పాత్రికేయ, దృశ్య కళా, నాటక, సినిమా రంగాలలో ఈ చర్చ జరిగింది.

**10. ప్రపంచీకరణ – హిందూత్వ దాడి :**

1980 దశకం తర్వాత అభ్యుదయ సాంస్కృతికోద్యమం యొక్క ప్రత్యాధిపత్య పాత్ర బలహీనపడింది. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత ఈ పతనం మరింత వేగంగా సాగింది, 1990 దశకంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శకంలో సాంస్కృతిక సామ్రాజ్యవాదం కూడా

❝ అంతవరకూ ఉన్నత వర్గాలకు, పండితు లకు మాత్రమే పరిమితం అయిన సాహిత్యం, కళల స్వభావాన్ని మార్చి వాటిని సామాన్య ప్రజల స్థాయికి తీసుకువచ్చింది ప్రజాసాంస్కృతి కోద్యమం. భారీ సెట్టింగులు, హంగులతో ఉండిన నాటక శాలల స్వరూపాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్చి, ప్రజల మధ్యకు నాటకరంగాన్ని తీసుకువచ్చింది. రచ్చబండ, లేదా ఎడ్లబండి ఇప్పుడు స్టేజిలయ్యాయి. కనీసపు ఆహార్యంతోనే నాటక ప్రదర్శనలు ఇచ్చి రక్తి కట్టించగలిగారు. ❞

విస్తరించింది. కార్పొరేట్ మీడియాకు ఉన్న విశ్వవ్యాప్త ఆధిపత్యం ద్వారా ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాదం రుద్దబడుతోంది. సాంస్కృతిక సరుకుల ఉత్పత్తిలో, మార్కెటింగ్ లో ప్రపంచ మార్కెట్ మూల మూలా శాసిస్తోంది. విద్యావంతులలో, విద్యా రహితులలో సైతం దానిదే ఆధిపత్యం. దానికి తోడు మన దేశంలో కార్పొరేట్- హిందుత్వ శక్తుల కూటమి ఏర్పడడం తో అన్ని రకాల నిరసన సంస్కృతికీ అది ప్రాణాంతకంగా మారింది. ఈ పరిస్థితుల్లో భావజాల రంగంలో ఆధిపత్యం నెరపుతున్న ఆరెస్సెస్‌కు, కమ్యూనిస్టులకు మధ్య ఉన్న శత్రుత్వం మరింత వెలుగులోకి వచ్చింది. మారిన ఈ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చడం ఇప్పుడు అవసరం. ఐతే మన లక్ష్యం విషయంలో తేడా ఎంతమాత్రమూ లేదు. అందుచేత మన గత వారసత్వం నుండి నేర్చుకుని యుద్ధ వ్యూహాలను కొత్తగా రచించాలి.

**11. ఆంధ్రప్రదేశ్‌లో వామపక్ష సాంస్కృతిక ఉద్యమం (1930-1950)**

1. ఆంధ్రప్రదేశ్ లో 1930-1950 మధ్య కాలంలో జరిగిన వామపక్ష సాంస్కృతికోద్యమంలో రెండు ప్రధాన స్రవంతులున్నాయి. ఒకటి: బహుళ ప్రాచుర్యం పొందిన సాహిత్యం, రెండు: ప్రజాకళలు. తెలుగు సాహిత్యం లోని అభ్యుదయ భావాలకు మొదటిది ప్రతినిధిగా ఉంటే, రెండవది నాటక రంగంలోని అభ్యుదయ ధోరణులకు ప్రతినిధిగా ఉండేది. ఈ రెండూ ప్రజా కళలలో అంతర్భాగం.

1940, 1950 దశకాలలోని అఖిల భారత రాజకీయ-సాంస్కృతిక ఉద్యమాలలో ఈ రెండూ అంతర్భాగంగా ఉండేవి. విస్తరిస్తున్న సోషలిస్టు భావాలు, అంతర్జాతీయ మహా సంక్షోభం, ఫాసిజం విజృంభణ, ఆ నాటి నేపథ్యం. కమ్యూనిస్టులు పలు రైతు, కార్మిక, యువజన, విద్యార్థి ఉద్యమాలను నిర్వహించారు. ఆ ఉద్యమాలకు ప్రజాకళలు ప్రేరణగా ఉంటే, ప్రజాసాంస్కృతికోద్యమానికి ఆ ప్రజా పోరాటాలు ప్రేరణగా పని చేశాయి. ఆ విధంగా పరస్పరం ప్రభావితం చేస్తూ ముందుకు సాగాయి.

అంతవరకూ ఉన్నత వర్గాలకు, పండితు లకు మాత్రమే పరిమితం అయిన సాహిత్యం, కళల స్వభావాన్ని మార్చి వాటిని సామాన్య ప్రజల స్థాయికి తీసుకువచ్చింది ప్రజాసాంస్కృతి కోద్యమం. భారీ సెట్టింగులు, హంగులతో ఉండిన నాటక శాలల స్వరూపాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్చి, ప్రజల మధ్యకు నాటకరంగాన్ని తీసుకువచ్చింది. రచ్చబండ, లేదా ఎడ్లబండి ఇప్పుడు స్టేజిలయ్యాయి. కనీసపు ఆహార్యంతోనే నాటక ప్రదర్శనలు ఇచ్చి రక్తి కట్టించగలిగారు. ఆ ప్రదర్శనలు సామాన్య జీవితాలను ప్రతిబింబిస్తూ రానున్న నూతన సమాజపు సందేశాన్ని ఇచ్చేవి. ఆ కారణం చేత ప్రజలు వాటి సరళమైన రూపాలను నిరభ్యంతరంగా ఆహ్వానించారు. ఎక్కువమంది ప్రజలకు ఎక్కువ ప్రదేశాల్లో ప్రదర్శనలు ఇవ్వవలసిన అవసరం ఉండడమే కాక, ప్రజలలో ఆవిధమైన ప్రతిస్పందన కూడా ఉండేది గనుక వాటి రూపాలను సరళతరం చేయవలసి వచ్చింది. వివిధ సామాజిక నేపథ్యాలనుండి కొత్త తరం రచయితలు, రచయిత్రులు ముందుకొచ్చారు. పేద, మధ్యతరగతులలోని విద్యావంతులనుండి వీరు వచ్చారు. ఇక నటులైతే నిరక్షరాస్యులనుండి, అణగారిన వర్గాలనుండి, వెనుకబడ్డ తరగతులనుండి సైతం వచ్చారు. కొత్త గొంతులతో కొత్త చేవకలిగిన సారంతో నూతన కళారూపాలు ఉండడానికి కారణం ఇదే. గ్రామీణ, జానపద కళారూపాలను స్వీకరించి, శాస్త్రీయ సాంప్రదాయాలకు భిన్నంగా వాటిని ఆధునీకరించి ప్రదర్శించేవారు.

19వ శతాబ్దంలో, ముఖ్యంగా 1850 దశకం అనంతరం, వీరేశలింగం, గురజాడ, గిడుగు త్రయం తెలుగు సాహిత్యాన్ని వాడుకభాష రూపంలో మార్చి ఆధునిక భావాలను సామాన్యులకు అందజేయగల ఒక సాధనంగా మెరుగుపరిచారు. వారిని ఆధునిక సామాజిక సంస్కరణలకు వైతాళికులుగా పరిగణిస్తారు. వారి కృషి ఆధునిక కవిత్వానికి బాటలు వేసింది. అంతవరకూ నిర్లక్ష్యానికి గురైన తరగతుల ప్రజలను విశాల సాంస్కృతి కోద్యమ పరిధిలోకి తీసుకురావడానికి దోహదం చేసింది. ముఖ్యంగా ఆ సాహిత్యం మధ్యయుగాల భక్తి ఉద్యమపు కవిత్వ ధోరణులను ఒడిసిపట్టింది. మధ్యయుగాల కట్టుబాట్ల, భావాల బంధనాలనుండి తెలుగు భాషను, సాహిత్యాన్ని విముక్తి చేయడం ఆ తర్వాత తెలుగు రచయితలలో రాజకీయ చైతన్యం పెరగడానికి దోహదం చేసింది.

జాతీయ స్థాయిలో స్వదేశీ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం ఊపందు కునేనాటికి తెలుగు రచయితలు జాతీయ భావాలతో నిండిన సాహిత్యాన్ని సృష్టించడం జరుగుతోంది. 1921-22 నాటికి సామాజిక సంస్కరణలతోబాటు రాజకీయ ఉద్యమాలను కూడా తెలుగు సాహిత్యం ప్రతిబింబించింది. ఇది తెలుగు సాహిత్యంలో ఒక మూల మలుపు.

బోల్షివిక్ విప్లవం విజయవంతం కావడం, రష్యాలో సోషలిస్టు వ్యవస్థ ఏర్పడడం నేపథ్యంలో అనేకమంది రచయితలు తమ రచనలను, వ్యాసాలను పత్రికలలో, సాహితీ సంచికలలో ప్రచురించడం ప్రారంభించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ రచన మాలపల్లి సోషలిస్టు సిద్ధాంతాన్ని స్పష్టంగా వివరించిన తొలి తెలుగు నవల. ఐతే, ఉన్నవ గాంధేయవాది. అందుచేత గాంధీవాదం చూపిన దారిలోనే వర్గ ఘర్షణలకు పరిష్కారం లభిస్తుందని ముగింపు ఇచ్చాడు.

1920 దశకంలో కమ్యూనిస్టు ఉద్యమం ఆవిర్భావం అనంతరం, మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలు రహస్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చేరాయి. వాటిని తెలుగులోకి అనువదించారు. కాంగ్రెస్ మీద అసంతృప్తితో చాలామంది యువకులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1935లో ఆంధ్రప్రాంతంలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడింది. అనేకమంది యువత సోవియట్ ప్రేరణ తో సోషలిస్టు భావాలవైపు ఆకర్షితు లయ్యారు,

యూజినీ పాటియర్ రచించిన

**❝ అరసం 1936లో మొదలైనా, అది ముందుకు తెచ్చిన భావజాలం విస్తృతంగా సామాన్య ప్రజానీకంలోకి పోవాలంటే రంగస్థలం అవశ్యంగా తోడు ఉండాలి. 1943లో ఇప్టా ఏర్పాటు తో ఈ లోటు భర్తీ అయింది. రంగస్థలాన్ని, సాంప్రదాయ కళలను నూతన శక్తితో మెరుగు పెట్టడానికి, స్వేచ్ఛ, సాంస్కృతిక అభ్యుదయం, ఆర్థిక న్యాయం వంటి లక్ష్యాలను ప్రచారం చేయడానికి, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడడానికి ఏర్పడినట్టు ఇప్టా ప్రకటించింది. ❞**

అంతర్జాతీయ గీతాన్ని తెలుగులో అనువదించారు. శ్రామికవర్గపు సమిష్టి శక్తిని ప్రబోధిస్తూ పెండ్యాల లోకనాథం రాసిన గీతం, తుమ్మల వెంకట్రామయ్య ఎర్రజెండా మీద రాసిన గీతం తెలుగునాట ఇంటింటా ప్రాచుర్యం పొందాయి. 1934లో గోర్కీ నవల అమ్మ తెలుగులోకి అనువదించబడింది. ఆ పుస్తకం ప్రతీ ఇంటా కనిపించేది. పలుమార్లు అది పునర్ముద్రణ పొందింది. రైతు ఉద్యమనాయకుడు ఎన్‌జి రంగా రైతుభజనావళి ని ప్రచురించారు. అందులోని పలు గీతాలను రైతు ఉద్యమకారులే రచించడం విశేషం. ఆ తర్వాత వారిలో చాలామంది అ.ర.సం. లో సభ్యులుగా చేరారు. మాకొద్దీ తెల్లదొరతనమూ గీతాన్ని రాసిన గరిమెళ్ళ సోషలిస్టు భావాలతొ గీతాలను రచించారు.

ఆ గీతాల్లో భాష సరళంగా, తెలుగు నుడికారంతో ఉండి ప్రజలకు సూటిగా భావాన్ని అందించగలిగేది. వాళ్ళు ఆ పాటను తేలికగా పాడుకునేవారు. 1930 దశకంలో వాహిని, ప్రభ, జ్వాల, నవశక్తి వంటి పత్రికలు, అభ్యుదయ, విశ్వసాహిత్య మాల వంటి ప్రచురణ సంస్థలు బయలుదేరడంతో అభ్యుదయ సాహిత్యం విరివిగా ప్రచారంలోకి వచ్చింది. దీనికి తోడు దేశంలోని ఇతర భాషల సాహిత్యం కూడా తెలుగులో అనువదించబడేది. ప్రేమ్‌చంద్, మథోల్కర్ (మహారాష్ట్ర కవి), బెంగాలీ సాహిత్యం అందుబాటులోకి వచ్చాయి.

అభ్యుదయ సాంస్కృతికోద్యమానికి మూడు నేపథ్యాలు ప్రధానంగా ఊపునిచ్చాయి. అవి (అ) బోల్షివిక్ విప్లవం, (ఆ) సంక్షోభ కాలపు దుర్భర పరిస్థితులు, (ఇ) ఫాసిస్టు-వ్యతిరేక, సామ్రాజ్యవాద-వ్యతిరేక సిద్ధాంతాలు.

1936లో జరిగిన అభ్యుదయ రచయితల సంఘం జాతీయ సమావేశాలకు తెలుగునాటనుండి అబ్బూరు రామకృష్ణారావు ఒక్కరే ప్రతినిధిగా హాజరయ్యారు. జాతీయ స్థాయి సంఘానికి, ఆంధ్ర ప్రాంతానికి లింకుగా ఆయన వ్యవహరించారు. 1943లో తెనాలిలో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం తొలి సమావేశం జరిగింది. అంతకు మునుపటి నుంచే, శ్రీశ్రీ లండన్ మానిఫెస్టో నుండి ప్రేరణ పొంది తెలుగులో అభ్యుదయ కవిత్వాన్ని రచించడం జరుగుతోంది. అతడి కవిత్వం సాంప్రదాయ తెలుగు కవిత్వ నిబంధనలను బద్దలుగొట్టుకుని నూతన పుంతలు తొక్కింది. మయకోవ్‌స్కీ, నజ్రుల్ ఇస్లాం, హరీంద్రనాథ చట్టోపాధ్యాయ వంటి కవులనుండి ప్రేరణ పొందారు శ్రీశ్రీ. ఆ వెంట ఆరుద్ర, అనిసెట్టి, సోమసుందర్, రెంటాల, కెవిఆర్, కొడవటిగంటి, తుమ్మల, చంద్రం వంటి ప్రముఖులు ముందుకొచ్చారు. అరసం అధికార పత్రిక అభ్యుదయ, తెలుగుతల్లి, కళాకేళి వంటి సాహిత్య పత్రికలు నడిచేవి. ఈ రచయితలలో చాలామంది మార్క్సిస్టు సిద్ధాంతం మీద పట్టు ఉన్నవారేమీ కాదు. కొందరికి సాంప్రదాయ భావాలు ఉండేవి కూడా. కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు కొందరే. మరికొందరు సానుభూతి పరులు. మరికొందరు అది కూడా కాదు. కాని అరసం వేదిక ద్వారా వారందరికీ మార్క్సిజం మూలసారం వొంటబట్టింది. దాంతో సోషలిస్టు భావాల వ్యాప్తికి తోడ్పడ్డారు. కమ్యూనిస్టుపార్టీ అరసంతో లోపాయికారీగా సంబంధాలు నెరపుతూవుండేది. అందుచేత అరసం సామాన్య ప్రజానీకానికి దగ్గరవడానికి వీలుపడింది. అరసం సాధించిన ముఖ్యమైన విజయాల్లో ఒకటి: కళలకు, సాహిత్యానికి ఒక సామాజిక ప్రయోజనం ఉండాలి అన్న అవగాహనను రచయితలకు కలిగించడం. అరసం నిర్వహించిన అనేక సాహిత్య పాఠశాలలో ప్రాచీన సాహిత్యం-విమర్శనాత్మక అధ్యయనం, చారిత్రిక భౌతికవాదం తదితర సామాజిక శాస్త్రాల విజ్ఞానం, పాఠ్యాంశాలుగా ఉండేవి.

**12. ఆంధ్ర ప్రాంతంలో ఇప్టా కృషి**

19వ శతాబ్దపు చివరి భాగం నాటికి తెలుగునాట పౌరాణిక నాటకాల ప్రదర్శనే ప్రధానంగా ఉండేది. సామాజిక సంస్కరణల నేపథ్యంలో వాటిలో కొంతమేరకు ఆ సంస్కరణల ఆవశ్యకతను వివరించడం చోటు చేసుకుంది. జాతీయోద్యమం ప్రభావంతో చంద్రగుప్తమౌర్య, శివాజీ, ఝాన్సీ రాణి, తిలక్, పంజాబ్ దురంతాలు వంటి అంశాలమీద నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. 1930 దశకం తర్వాత మరొక స్రవంతి కూడా మొదలైంది. ఇబ్సెన్, చెకోవ్, ఫ్రాయిడ్, బెర్నార్డ్ షా వంటి అంతర్జాతీయ రచయితల ప్రభావంతో మహిళా హక్కుల పై, ప్రజాతంత్ర భావాలతో నాటకాలు రావడం మొదలైంది.

అరసం 1936లో మొదలైనా, అది ముందుకు తెచ్చిన భావజాలం విస్తృతంగా సామాన్య ప్రజానీకంలోకి పోవాలంటే రంగస్థలం అవశ్యంగా తోడు ఉండాలి. అందుచేత కొంతకాలం అరసం ప్రభావం మధ్యతరగతి మేధావులకే పరిమితమై ఉండేది. 1943లో ఇప్టా ఏర్పాటుతో ఈ లోటు భర్తీ అయింది. రంగస్థలాన్ని, సాంప్రదాయ కళలను నూతన శక్తితో మెరుగుపెట్టడానికి, స్వేచ్ఛ, సాంస్కృతిక అభ్యుదయం, ఆర్థిక న్యాయం వంటి లక్ష్యాలను ప్రచారం చేయడానికి, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడడానికి ఏర్పడినట్టు ఇప్టా ప్రకటించింది. బొంబాయిలో జరిగిన వ్యవస్థాపక మహాసభకు తెలుగునాటనుండి హాజరైన ఒకే ఒక ప్రతినిధి గరికపాటి రాజారావు. ఆ తర్వాత ఇక్కడ ప్రాంతీయ కమిటీ ఏర్పడింది. అందులో రాజారావుతోబాటు కృష్ణమూర్తి, చదలవాడ పిచ్చయ్య ఉండేవారు. ఈ ప్రాంతీయ కమిటీ ప్రజానాట్యమండలిగా పని చేసేది. పాత జానపద గీతాలను ఇది పునరుద్ధరించింది. కళాకారులలో గ్రామీణ ప్రాంతాలనుండి, శ్రామిక వర్గం నుండి వచ్చినవారు ఎక్కువమంది. వారే పాటలు రాయడం, వరసలు కట్టడం, నాటికలు రాయడం వంటివి చేసేవారు. అనతికాలంలోనే ప్రజానాట్య మండలి సాంస్కృతిక రంగంలో కీలకమైన మార్పులు తీసుకురాగలిగింది. కమ్యూనిస్టు భావజాలాన్ని కార్మికులలో, రైతులలో, కూలీలలో, మహిళలలో, యువజనులలో పెద్దఎత్తున ప్రచారం చేయగలిగింది. సాంప్రదాయ కళారూపాలను తనదైన నూతన శైలిలో ఉపయోగించడం, కళాకారుల వర్గ పొందిక ఈ రెండూ ప్రజానాట్యమండలి విజయానికి కీలకంగా పని చేశాయి. సుంకర

> **❝ 1946-51 మధ్య జరిగిన తెలంగాణా సాయుధ పోరాట కాలంలో ప్రజానాట్య మండలి కార్యకలాపాలు ఉచ్ఛస్థితికి చేరాయి. సుంకర, వాసిరెడ్డి రచించిన మాభూమి నాటిక అటు గ్రామీణులను, ఇటు పట్టణవాసులను ఉర్రూతలూపింది. కాంగ్రెస్ నాయకులు సైతం మొదట్లో ఆ నాటికను ప్రశంసించారు. ఐతే తర్వాత కాలంలో వారే ఆ నాటికను నిషేధించారు. ఒక్క 1947 సంవత్సరంలోనే మాభూమి నాటిక 125 దళాలతో 1000 సార్లు ప్రదర్శించ బడింది. 20 లక్షలమంది దానిని తిలకించారు.❞**

సత్యనారాయణ కష్టజీవి, అల్లూరి సీతారామ రాజు, వీరేశలింగం, బెంగాల్ కరువు వంటి బుర్రకథలను చెప్పారు. బుర్రకథకులలో అత్యంత ప్రశస్తి పొందినవారు షేక్ నాజర్, ఇతనిని బుర్రకథపితామహ అని పిలుస్తారు. సుమారు అరడజను బుర్రకథ బృందాలు ఉండేవి. వాటిలో ఒకటి మహిళా కథకుల బృందం. కోసూరి పున్నయ్య హరికథ రూపాన్ని ఉపయోగించేవారు. కోగంటి గోపాలకృష్ణయ్య పిట్టలదొర, కోయదొర వంటి ఏకపాత్ర కల ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇవన్నీ అత్యంత ప్రజాదరణ పొందాయి. 1939లో కమ్యూనిస్టుపార్టీ నిషేధింపబడింది. 1942లో దానిని ఎత్తివేసినా, తెలంగాణా ప్రాంతంలో నైజాము పాలన కొనసాగుతున్నకారణంగా అక్కడ నిషేధం కొనసాగింది. ఈ పరిస్థితుల్లో ప్రజలలోకి పోవడానికి తెలంగాణా ప్రాంతానికి ప్రత్యేకంగా తెలంగాణా ప్రజానాట్య మండలి ఏర్పడింది. తెలంగాణా ప్రాంతానికి ప్రత్యేకమైన సాంప్రదాయ కళారూపాలను వారు ఉపయోగించారు. బైరాగులు, పల్లెసుద్దులు, పిట్టలదొర, ఫకీర్, కోయ, చెంచు, జంతరపెట్టి, సోది వంటివి ప్రదర్శించేవారు. బుర్రకథ కూడా ప్రదర్శించేవారు. వీటిలో స్థానికాంశాలు ఇతివృత్తంగా ఉండేవి. సాయుధపోరాటం మొదలయ్యాక, గెరిల్లా దళాల రక్షణ లో కళా ప్రదర్శనలు సాగేవి. ఈ కృషికి ఆంధ్ర ప్రాంతపు ప్రజానాట్యమండలి అండగా నిలిచింది. ఆంధ్రప్రాంతపు కళాకారులతో ప్రదర్శించబడిన మాభూమి నాటకం తెలంగాణాలో విస్తృతంగా ప్రదర్శించబడింది. దానితోబాటు సుద్దాల హనుమంతు, తిరునగరి రామాంజనేయులు, రాజారావ్ వంటి తెలంగాణా ప్రాంత రచయితలు విశేష కృషి చేశారు. నాటికలు రాయడం, ప్రదర్శించడమే గాక గెరిల్లా దళ సభ్యులుగా కూడా ఉండేవారు. ప్రజల్లో విశేష ఆదరణ పొందిన యాదగిరి వంటి ప్రజాకళాకారులెందరో తెలంగాణా పోరాట కాలంలో ఆవిర్భవించారు.

1946-51 మధ్య జరిగిన తెలంగాణా సాయుధ పోరాట కాలంలో ప్రజానాట్య మండలి కార్యకలాపాలు ఉచ్ఛస్థితికి చేరాయి. సుంకర, వాసిరెడ్డి రచించిన మాభూమి నాటిక అటు గ్రామీణులను, ఇటు పట్టణవాసులను ఉర్రూతలూపింది. కాంగ్రెస్ నాయకులు సైతం మొదట్లో ఆ నాటికను ప్రశంసించారు. ఐతే తర్వాత కాలంలో వారే ఆ నాటికను నిషేధించారు. ఒక్క 1947 సంవత్సరంలోనే మాభూమి నాటిక 125 దళాలతో 1000 సార్లు ప్రదర్శించబడింది. 20 లక్షలమంది దానిని తిలకించారు. ఇదొక ప్రపంచ రికార్డు అని కె.ఎ. అబ్బాస్ అన్నారు.

ప్రజానాట్యమండలి పటిష్ట నిర్మాణంతో నడిచింది. గ్రామస్థాయి శాఖలు 200 కు పైగా ఉండేవి. జిల్లాకొక సమన్వయ కమిటీ ఉండేది. రాష్ట్రస్థాయి కమిటీ పర్యవేక్షించేది. జిల్లా స్థాయిలో శిక్షణాశిబిరాలు నిర్వహించేవారు. రిహార్సల్స్, గ్రూపు చర్చలు చాలా గట్టిగా జరిగేవి. చిన్న చిన్న వివరాలలోకి సైతం పోయి చర్చించి ప్రదర్శనలకు మెరుగులు దిద్దుకునేవారు. క్రమశిక్షణ, పరస్పర గౌరవం, కమ్యూనిస్టు సౌహార్దత (కామ్రేడరీ) -వీటికి ప్రజానాట్యమండలి దళాలు పెట్టింది పేరుగా ఉండేవి. ఉమ్మడి భోజనశాలలు నిర్వహించేవారు కూడా.

ఉద్యమం ఊపు అందుకుంటున్నకొద్దీ సాంస్కృతిక రంగంలో మహిళలపాత్ర ప్రాధాన్యత పెరుగుతూవచ్చింది. మహిళలు సాంస్కృతిక కార్యకలాపాలలో పాల్గొనాలా వద్దా అన్నదానిపై కమ్యూనిస్టు పార్టీలో రెండు భిన్న వాదనలు ఉండేవి. పార్టీ ఆధ్వర్యంలో మహిళా మండళ్ళు నడిచేవి. వాటిద్వారా చాలామంది మహిళలు ప్రజాజీవితంలోకి వచ్చారు. ఉపన్యసించడం, ఊరేగింపులలో పాల్గొనడం వంటివి చేసేవారు. వారిలో ఎక్కువమంది పార్టీ నాయకుల కుటుంబ సభ్యులు. క్రమంగా ఇతర కుటుంబాల మహిళలు కూడా పెరిగారు. మహిళలలో పలువురు సంగీతం, నృత్యం వంటి రంగాలలో నైపుణ్యం ఉన్నవారే. మొత్తానికి మహిళలు పాల్గొనాల్సిందేనన్న వాదన నెగ్గడంతో వారంతా సాంస్కృతిక రంగంలో చురుకుగా పాల్గొనడం మొదలైంది. మాభూమి, పరివర్తన, అపనింద, వంటి నాటికలలో పాల్గొన్నారు. అచ్చంగా మహిళలతోనే బుర్రకథ బృందం ఏర్పడి ప్రదర్శనలిచ్చింది.

1948లో కమ్యూనిస్టుపార్టీతోబాటు ప్రజానాట్యమండలి కూడా నిషేధానికి గురైంది. తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంది. కొందరు కళాకారులను చంపివేశారు. ఆఫీసులను తగులబెట్టారు, ఎందరినో అరెస్టు చేశారు. ప్రింటింగ్ ప్రెస్‌లు, గ్రంధాలయాలు నాశనమయ్యాయి. దాంతో ఉద్యమం స్తంభించిపోయింది. ఈ క్రమంలో కొందరు కళాకారులు వేరువేరు వ్యాపకాలవైపు జీవనోపాధి నిమిత్తం తరలిపోయారు. నైపుణ్యం ఉన్న కళాకారులు మద్రాసు సినిమా రంగంలో ప్రవేశించారు.

వామపక్ష సాంస్కృతికోద్యమం ప్రభావంతో దేశంలో సాంస్కృతికరంగం ప్రజాతంత్ర స్వభావాన్ని సంతరించుకుంది. పాలకవర్గాలు సైతం జమీందారీ విధానం రద్దు, సామాజిక న్యాయం, అందరికీ విద్య, వంటి ఎజండాలపై స్పందించవలసివచ్చింది. కళారూపాల్లో వాస్తవికత బలంగా ముందుకొచ్చింది. వాడుకభాష అన్నింటా ఉపయోగించడం మొదలైంది. ప్రజాకళలు మళ్ళీ ఊపందుకున్నాయి.

వామపక్ష ఉద్యమం బలంగా ఉన్న గ్రామాల్లో ప్రతీ గ్రామంలోనూ ఒక చిన్న లైబ్రరీ, ఒక రాత్రి బడి, ఒక యువజన సంఘం, ఒక ఆఫీసుగది, అందులో హార్మోనియం, తబలా, డోలక్ వగైరా వాయిద్యాలు ఉండేవి. అక్కడ రిహార్సల్స్ జరిగేవి. పునాది వర్గాలనుండి వేల సంఖ్యలో కళాకారుల ఉద్భవించారు. అది ఒక ఘనమైన చరిత్ర.

గ్రంధాలయోద్యమం కూడా వామపక్ష ప్రభావంతో ముందడుగు వేసింది. శాస్త్రవిజ్ఞానం, తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, సాహిత్యం తక్కువ రేట్లకే ముద్రించి అందించేవారు. మార్క్సిస్టు సిద్ధాంత గ్రంధాలు తెలుగులో అందుబాటులో ఉండేవి. పుస్తక ప్రదర్శనలు నిర్వహించి అమ్మకాలు విరివిగా

చేపట్టేవారు. సమాజంలో సైద్ధాంతిక విప్లవం సాధించే లక్ష్యంతో ఆ కృషి జరిగింది.

కమ్యూనిస్టు ఉద్యమం, దాని ఆధ్వర్యంలో నడిచిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు సాంస్కృతికోద్యమానికి బలం చేకూర్చినట్టే, ప్రజాసాంస్కృతికోద్యమం కమ్యూనిస్టు ఉద్యమం వైపుగా వేలాదిమంది ని ప్రభావితం చేసి ఉద్యమబలోపేతానికి తోడ్పడింది.

భావజాల రంగంలో ప్రజానాట్యమండలి కృషి ఉచ్ఛ దశలో ఉన్న కాలంలోనే సాహిత్య రంగంలో అభ్యుదయ రచయితల సంఘం బలమైన శక్తిగా పనిచేసింది. నాటికి పాలకవర్గ కాంగ్రెస్ భావజాలంతో ఉన్న ప్రతికాధిపతులు, ఆ భావజాలానికి తాబేదార్లుగా ఉన్న కొద్ది మంది రచయితలు తప్ప మెజారిటీ రచయితలు అరసం వేదికగా పనిచేశారు. ఈ రచయితలలో ఎక్కువమందికి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం గానీ, ప్రత్యక్ష సంబంధంగానీ లేదు. కానీ వీరంతా సమసమాజ భావనలకు బలమైన మద్దతుదారులుగా నిలిచారు. అరసం అనాడు రచయితల విశాల వేదికగా పనిచేసింది. ఆనాటికి సాహిత్యం ఛందో వ్యాకరణ సంకెళ్ళలో పండితులకే పరిమితమై ఉండింది. గిడుగు రామ్మూర్తి పంతులు నడిపిన వ్యవహారిక భాషోద్యమం సనాతనవాదుల అధిపత్యాన్ని సవాలు చేసింది. ఎక్కువమంది రచయితలు వ్యవహారిక భాషోద్యమాన్ని తమ స్వంతం చేసుకున్నారు. తద్వారా సాహిత్యరంగాన్ని సనాతన పండితశక్తుల ప్రాబల్యం నుండి తప్పించగలిగారు.

**13. పాలక సంస్కృతి దాడి :**

సాహిత్య, కళారంగాలలో అభ్యుదయ శక్తులది పై చేయిగా ఉండడంతో పాలకశక్తులు ఈ రెండు రంగాల మీదా ప్రకటిత, అప్రకటిత నిర్బంధాలు, నిషేధాలకు తెగబడ్డాయి. అలాగే కమ్యూనిస్టు ఉద్యమానికి పునాది శక్తులుగా ఉన్న దళిత, బడుగు, బలహీనవర్గాలలో భ్రమలు పెంచడానికి పాలకశక్తులు ఇరవై సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి చర్యలు చేపట్టాయి. ఇందిరమ్మ సోషలిజం అన్న ప్రచారాన్ని తలకెత్తుకున్నాయి.

పాలకవర్గ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టవలసిన సమయంలో పలు అంతర్జాతీయ, జాతీయ, స్థానిక కారణాల రీత్యా కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, సాంస్కృతికోద్యమంలోనూ చీలికలు వచ్చాయి.

ఐతే వివిధ వేదికలుగా చీలినప్పటికీ ప్రత్యామ్నాయ సాంస్కృతిక భావజాల వ్యాప్తికి ఆయా సాహిత్య, సాంస్కృతిక వేదికల నుండి కృషి కొనసాగింది. వీధినాటిక రూపం 1990 నాటికి విశేష ప్రజాదరణ పొందింది.

> **❝ సారా వ్యతిరేక ఉద్యమం, అసంఘటిత కార్మికుల కోసం సమగ్రమైన బిల్లు, చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ బ్యాంక్ సంస్కరణల ప్రయోగశాలగా మార్చేసిన నేపథ్యం లో జరిగిన ఉద్యమాలు విద్యుత్ ఉద్యమాల నేపథ్యంలో వీధి నాటిక ద్వారా ప్రజానాట్యమండలి ప్రజలకు చేరువ అయ్యింది. ఉద్యమ సందేశాల్ని ప్రజలకు అందించ గలిగింది. అలాగే అక్షర కళాయాత్ర, సైన్సు యాత్ర, పొదుపు ఉద్యమం, పరిసరాలు - పరిశుభ్రత వంటి అంశాలమీద కూడా ప్రజానాట్యమండలి విశేష కృషి చేసింది.❞**

**14. ప్రజా ఉద్యమాలకు తోడుగా :**

సారా వ్యతిరేక ఉద్యమం, అసంఘటిత రంగ కార్మికులకోసం సమగ్రమైన బిల్లు, చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ బ్యాంక్ సంస్కరణల ప్రయోగశాలగా మార్చేసిన నేపథ్యంలో జరిగిన ఉద్యమాలు విద్యుత్ ఉద్యమాల నేపథ్యంలో వీధి నాటిక ద్వారా ప్రజానాట్యమండలి ప్రజలకు చేరువ అయ్యింది. ఉద్యమ సందేశాల్ని ప్రజలకు అందించగలిగింది. అలాగే అక్షర కళాయాత్ర, సైన్సు యాత్ర, పొదుపు ఉద్యమం, పరిసరాలు – పరిశుభ్రత వంటి అంశాలమీద కూడా ప్రజానాట్యమండలి విశేష కృషి చేసింది.

**15. సినిమా రంగం :**

కృష్ణా బ్యారేజి, ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణాలతో సాగునీరు అందుబాటులోకి రావడంతో డెల్టా జిల్లాల్లో వ్యవసాయ రంగంలో మిగులు ఆదాయాలు పోగుపడ నారంభించాయి. ఈ నిధులను భూస్వాములు రవాణా, ఆటో మొబైల్ రంగంలోనూ సినిమా రంగంలోనూ పెట్టుబడులుగా పెట్టారు. సినిమా రంగంలో తొలుతగా పౌరాణిక, భక్తిరసాత్మక చిత్రాల నిర్మాణం కొనసాగింది. ఇప్టా ప్రభావంతో హిందీ సినిమా రంగంలో సామాజిక అంశాలమీద చిత్ర నిర్మాణాలు ఊపందుకోవడంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమ కూడా దాన్ని అందిపుచ్చుకుంది. అయితే ఎక్కువలో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలలోని ఆప్యాయతలు, అనురాగాలు, అపార్థాల చుట్టూ తిరిగేవి.

1952 ఎన్నికలలో ఆంధ్ర రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వస్తుంది అన్నంత ఊపుకలిగినా అంతిమంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సాంస్కృతిక రంగంలో పనిచేస్తున్న కళాకారులకు పార్టీ ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో వారిలో పెక్కుమంది మద్రాసులోని చలనచిత్ర పరిశ్రమకు తరలిపోయారు. కమ్యూనిస్టు భావజాల ప్రభావంతో నాటి దర్శక, నిర్మాతలు, రచయితలు అనేక ప్రయోజనాత్మక సినిమాలు తీశారు. శ్రీశ్రీ, ఆరుద్ర, సినారె, కొసరాజు వంటి రచయితలు సినిమా పాటల ద్వారా శ్రమను గౌరవించే రీతిలో సమసమాజ ఆకాంక్షలను ప్రతిఫలించేలా అభ్యుదయ గీతాలు రచించారు.

ఇందిరాగాంధీ హత్యానంతరం కేంద్రంలో అధికారం చేపట్టిన రాజీవ్‌గాంధీ హయాం లోనే మన ఆర్థిక వ్యవస్థలో స్వీయ రక్షణాత్మక విధానాల సడలింపు మొదలయ్యింది. టెలికామ్, మీడియా రంగంలో పెనుమార్పులు రావడం ద్వారా పశ్చిమ దేశాల వినియోగదారీ సంస్కృతి తోపాటు సామాజిక, సాంస్కృతిక, వినోద రంగాలన్నింటా పశ్చిమ దేశాల సంస్కృతి ప్రభావం పెద్ద ఊపున వచ్చింది. వినోదం తోపాటు సామాజిక ప్రయోజనంకూడా ఉండాలన్న లక్ష్యంతో పనిచేసిన సినిమా రంగం కూడా భారీ కుదుపుకు లోనయ్యింది. సినిమా రంగం పెట్టుబడి పోషకంగా, లాభాలు అర్జించే పరిశ్రమగా మారిపోయింది. అప్పటి నుండి సినిమా రంగం క్షీణ విలువల ప్రచార సాధనంగా మారిపోయింది. స్త్రీని శృంగారవస్తువుగా చూడడం, హింస, రక్తపాతం, సినిమా ట్రేడ్ మార్క్‌గా మారిపోయింది. ఒక దశలో వామపక్ష భావజాలంతో ప్రయోజనాత్మక, ప్రయోగాత్మక సినిమాలు వచ్చినా అవి మూసపద్ధతిలో ఉండడంతో ఒకపొంగులావచ్చి చల్లారిపోయాయి. ఈ మధ్యకాలంలో ఇప్పటి వరకూ విస్మరించబడిన దళిత జీవితాలు తెరమీదకు ఎక్కుతున్నాయి. బయట సమాజంలో చెలరేగిన సామాజిక అలజడులు, ఆందోళన ప్రభావాలతో అప్పుడప్పుడూ సినిమాలు తీసినా ప్రధానంగా సినిమా రంగం ఇప్పుడు వ్యాపార విలువలతో నడుస్తుంది.

(మిగతా 36పేజీలో)

చరిత్ర

# ఉత్తర భారత రాజ్యాధిపత్య పోరులో 3 సామ్రాజ్యాలు

## (క్రీ.శ.8 వ శతాబ్దం నుండి 10వ శతాబ్దం వరకు)


రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

**ఎంవిఎస్ శర్మ**

క్రీ.శ.750 నుండి 1000 మధ్య కాలంలో ఉత్తర భారతదేశంలోనూ, దక్కను ప్రాంతంలోనూ పలు రాజ్యాలు ఏర్పడ్డాయి. వీటిలో పాల, ప్రతీహార, రాష్ట్రకూట సామ్రాజ్యాలు చాలా శక్తివంతమైనవి. క్రీ.శ.850 వరకూ పాల సామ్రాజ్యం తూర్పు భారతదేశాన్ని తన అధీనంలో ఉంచుకుంది. క్రీ.శ.950 వరకూ ప్రతీహార సామ్రాజ్యం పశ్చిమ భారతాన్ని తన ప్రభావం కింద ఉంచుకోగలిగింది. ఇక రాష్ట్రకూట సామ్రాజ్యం దక్కను ప్రాంతంతో బాటు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలను తన ఆధిపత్యంకింద ఉంచుకోగలిగింది. దీర్ఘకాలంపాటు ఈ మూడు సామ్రాజ్యాలూ కొనసాగడం ద్వారా తమ ఏలుబడికింద ఉండే ప్రాంతాలలో సుస్థిర పరిస్థితులను నెలకొల్పడంతోబాటు, కళలను, సాహిత్యాన్ని పెంచి పోషించడం కూడా సాధ్యపడింది. రాష్ట్రకూటుల సామ్రాజ్యం ఉత్తర, దక్షిణ భారత దేశాల నడుమ ఆర్థిక, సాంస్కృతిక వారధిగా వ్యవహరించింది.

**కనోజ్ మీద ఆధిపత్యం కోసం పోరు**

హర్షుడి కాలం నుంచీ ఉత్తర భారత దేశం మీద ఆధిపత్యం సాధించడానికి ప్రతీకగా కనోజ్ పరిగణింపబడేది. ఆ తర్వాత ఆ స్థానం ఢిల్లీకి మారింది. కనోజ్ లేదా కన్యాకుబ్జం మీద ఆధిపత్యం కలిగినవారు గంగానదీ లోయ ఎగువ భాగంమీద, అక్కడ లభించే విలువైన వనరులమీద, వాణిజ్యం మీద పట్టు సాధించ గలిగేవారు. ఆ ప్రాంతంతో బాటు, వారణాసి నుండి దక్షిణ బీహార్ వరకు ఉన్న ప్రాంతం కూడా కీలకంగానే ఉండేది. అక్కడ వనరులు, అభివృద్ధి చెందిన నాగరికత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అందుచేత ఈ ప్రాంతం మీద ఆధిపత్యం కోసం పాల, ప్రతీహార, రాష్ట్రకూట ప్రభువులు పరస్పరం ఘర్షణలకు దిగుతూ వుండేవారు.

గోపాలుడు అనే రాజును పాల సామ్రాజ్యాన్ని నడిపించడానికి అక్కడ ఉండే ప్రభువర్గీయులు ఎన్నుకున్నారు. ఇది సుమారు క్రీ.శ 750 కాలంలో జరిగింది. అప్పటికి అక్కడ కొంతకాలంగా నెలకొన్న అరాచక పరిస్థితులను చక్కదిద్దడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. అతడి అనంతరం క్రీ.శ.770లో ధర్మపాలుడు రాజయ్యాడు. రాష్ట్రకూట ప్రభువుగా ఉన్న ధృవుడు ధర్మపాలుడిని ఓడించాడు. ఈ ధృవుడు ప్రతీహార ప్రభువుల్ని కూడా ఓడించాడు. ఐతే ఆ విజయాల అనంతరం, ధృవుడు తిరిగి దక్కను ప్రాంతానికి తరలిపోయాడు. దాంతో ధర్మపాలుడికి ఉత్తరాన ఎదురు లేకుండా పోయింది. అతడు కనోజ్‌ను ఆక్రమించుకున్నాడు. అతడి దర్బారుకు తూర్పు రాజస్థాన్, పంజాబ్ ప్రాంతాలనుండి సామంతులు హాజరయ్యేవారు. ఐతే ధర్మపాలుడు ఎక్కువకాలం తన ఆధిపత్యాన్ని కనోజ్ మీద నెరపలేకపోయాడు. ప్రతీహారుల ప్రాభవాన్ని తిరిగి వెలుగులోకి తెచ్చిన నాగభట్టు అనే రాజు ధర్మపాలుడిని ఓడించాడు. అప్పటినుంచీ బీహారు, తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రాంతాల మీద ఆధిపత్య వివాదం కొంతకాలం పాటు రగులుతూనేవుండేది. బీహారు, బెంగాలు ప్రాంతాలు మాత్రం పాల రాజుల అధికారం కిందే కొనసాగాయి.

ఉత్తరాన తమకు ఎదురైన ప్రతికూలతను దృష్టిలో ఉంచుకుని పాల రాజులు తూర్పు, ఈశాన్య ప్రాంతాల వైపు తమ దృష్టిని పెట్టారు. 810లో ధర్మపాలుడి స్థానంలో అధికారం స్వీకరించిన అతడి కుమారుడు దేవపాలుడు 40 సంవత్సరాలపాటు పాలించాడు. ప్రాగ్జ్యోతిషపురం అతడి అధీనంలోకి తెచ్చుకున్నాడు. ఇది ప్రస్తుత అస్సాం ప్రాంతం. దానితోబాటు ఒరిస్సా ప్రాంతం కూడా పాల సామ్రాజ్యంలో భాగమైంది. నేపాల్‌లో కూడా కొంత భాగం ఈ సామ్రాజ్యం కిందకు వచ్చింది. ఆ విధంగా క్రీ.శ.750 నుండి 850 వరకు పాల సామ్రాజ్యం తూర్పు భారతదేశం మీద తన ఆధిపత్యాన్ని నెరపగలిగింది.

ఆ కాలంలో భారతదేశంలో పర్యటించిన సులేమాన్ అనే అరబ్బు యాత్రికుడు, వ్యాపారి, తన రచనలలో అప్పటి పరిస్థితులను వివరంగా ప్రస్తావించాడు. ఉత్తర భారతంలో నిరంతరం మూడు సామ్రాజ్యాల మధ్య ఆధిపత్య పోరు జరుగుతూవుండేదని, అందరికన్నా పాల రాజులవద్ద ఎక్కువ సైన్యం ఉండేదని, ఆ సైన్యంలో 50 వేల గజబలం ఉండేదనీ, 10 నుండి 15 వేల మంది కేవలం ఆ సైన్యం ఉపయోగించే దుస్తులను, వస్తువులను శుభ్రం చేయడానికే నియోగించబడ్డారని సులేమాన్ పేర్కొన్నాడు. దానిని బట్టి పాల రాజుల సైన్యం ఎంత ఉండేదో ఊహించవచ్చు.

టిబెట్ యాత్రికులు కూడా పాల సామ్రాజ్యం గురించి తమ రచనలలో పేర్కొన్నారు. పాల ప్రభువులు బౌద్ధాన్ని బాగా ఆదరించారని, ధర్మపాలుడి కాలంలో నలంద విశ్వవిద్యాలయం మళ్ళీ వైభవాన్ని సంతరించుకున్నదని, ఆ సంస్థను నిర్వహించడానికి 200 గ్రామాల మీద వచ్చే శిస్తును కేటాయించారని ఆ రచనలు తెలియజేస్తున్నాయి. నలందతోబాటు దానికి దీటుగా విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని కూడా ధర్మపాలుడు నెలకొల్పాడని అది గంగానదీ తీరాన, మగధ సమీపంలో ఉండేదని తెలుస్తోంది. బౌద్ధ శ్రమణకులు నివసించడానికి అనేక విహారాలను కూడా నిర్మించారని తెలుస్తోంది.

పాల ప్రభువులు టిబెట్‌తో సన్నిహిత సంబంధాలను నెలకొల్పారు. శాంతరక్షిత, దీపాంకర అనే ప్రముఖ బౌద్ధపండితులు టిబెట్ పర్యటించి అక్కడ ఒక కొత్త తరహా బౌద్ధాన్ని ప్రబోధించారు. అది బాగా ప్రాచుర్యం పొందడంతో, టిబెట్ నుంచి పెద్ద సంఖ్యలో బౌద్ధ భిక్షువులు నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలకు వచ్చి ఇక్కడ నేర్చుకునేవారు.

పాల ప్రభువులు ఆగ్నేయ ఆసియా ప్రాంతపు దేశాలతో సన్నిహితంగా వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పారు. ఆ ప్రాంతంతో జరిపిన వాణిజ్యం పాల సామ్రాజ్యం సంపద్వంతం కావడానికి దోహదం చేసింది. మలయా, జావా. సుమత్రా తదితర దీవులను పాలించిన శైలేంద్ర వంశపు రాజులు పాల ప్రభువులతో సన్నిహితంగా సంబంధాలను కొనసాగించారు.

### ప్రతీహార సామ్రాజ్యం

ప్రతీహారులను గుర్జర-ప్రతీహారులు అని కూడా అంటారు. వీరు నైరుతి రాజస్థాన్ ప్రాంతం నుండి వచ్చినవారు. ఆ ప్రాంతాన్ని గుర్జరాత్ర అని కూడా అంటారు. మొదట్లో స్థానిక పాలనాధికారులుగా ఉన్న ఈ ప్రతీహారులు అరబ్బులనుండి ఎదురయ్యే చొరబాట్లను ప్రతిఘటించే క్రమంలో బలపడ్డారు. క్రీ.శ.738లో అరబ్బులను చాళుక్య రాజులు గుజరాత్‌లో నిర్ణయాత్మకంగా ఓడించారు. దాంతో ప్రతీహారులకు అరబ్బుల బెడద లేకుండా పోయింది. ఆ తర్వాత ప్రతీహారులు తమ ప్రభావాన్ని మాళ్వ, తూర్పు రాజస్థాన్ ప్రాంతాలకు విస్తరించారు. ఎగువ గంగాలోయ ప్రాంతం మీద, మాళ్వ ప్రాంతం మీద పట్టు కోసం ప్రతీహారులు చేసిన ప్రయత్నాలను రాష్ట్రకూట పాలకుడు ధృవుడు, ఆ తర్వాత 3వ గోపాలుడు తిప్పికొట్టారు. ఐతే క్రీ.శ.806 లో రాష్ట్రకూటులు ప్రతీహారులను ఓడించిన తర్వాత తిరిగి దక్కను ప్రాంతానికి మరలిపోయారు. దాంతో పాల రాజులకు ఈ ప్రాంతం మీద ఆధిపత్యం దక్కింది.

ప్రతీహారులలో అత్యంత ప్రసిద్ధుడు భోజుడు. ప్రతీహార రాజ్య బలగాలను కూడగట్టి క్రీ.శ.836 నాటికి కనోజ్ మీద ఆధిపత్యం సాధించాడు. అక్కడినుండి తూర్పు దిశగా విస్తరించడానికి చేసిన ప్రయత్నాలను పాలరాజు దేవపాలుడు తిప్పికొట్టాడు. ఆ తర్వాత భోజుడు దక్కను, గుజరాత్ ప్రాంతాలవైపు చూపు మళ్ళించాడు. నర్మద నదీ తీరం వద్ద రాష్ట్రకూటులతో పెద్ద యుద్ధం జరిగింది. మాళ్వ ప్రాంతం మీద, గుజరాత్‌లో కొంత ప్రాంతం మీద భోజుడు తన ఆధిపత్యం నిలుపుకోగలిగాడు కాని అంతకు మించి దక్కను ప్రాంతంలోకి విస్తరించడం సాధ్యపడలేదు. ఆ తర్వాత ఉత్తరదిశగా విస్తరణకు పూనుకున్నాడు. సట్లెజ్ నదీ తీరం దాకా ఆ విస్తరణ కొనసాగింది. దేవపాలుడి మరణంతో పాల సామ్రాజ్యం బలహీనపడింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని భోజుడు తన సామ్రాజ్యాన్ని తూర్పు దిశగా కూడా విస్తరించాడు.

**“ ప్రతీహారులలో అత్యంత ప్రసిద్ధుడు భోజుడు. ప్రతీహార రాజ్య బలగాలను కూడగట్టి క్రీ.శ.836 నాటికి కనోజ్ మీద ఆధిపత్యం సాధించాడు. అక్కడినుండి తూర్పు దిశగా విస్తరించడానికి చేసిన ప్రయత్నాలను పాలరాజు దేవపాలుడు తిప్పికొట్టాడు. ఆ తర్వాత భోజుడు దక్కను, గుజరాత్ ప్రాంతాలవైపు చూపు మళ్ళించాడు. నర్మద నదీ తీరం వద్ద రాష్ట్రకూటులతో పెద్ద యుద్ధం జరిగింది. ”**

భోజుడి సైన్యంలో అశ్విక దళం ప్రసిద్ధికెక్కింది. మధ్య ఆసియా, అరేబియా ప్రాంతాలనుండి గుర్రాలను దిగుమతి చేసుకోవడం ఆనాటి వ్యాపారంలో ఒక ప్రధాన భాగంగా ఉండేది.

అనేక గాథలలో భోజుడి పేరు కనిపిస్తుంది. కోల్పోయిన పూర్వ వైభవాన్ని తిరిగి సాధించే ప్రయత్నాలలో భోజుడు కృతకృత్యుడు కావడం, కనోజ్‌ను గెలుచుకోవడం వలన అతడికి ఈ కీర్తి దక్కివుండాలి. భోజుడు విష్ణు భక్తుడు. 'ఆది వరాహ' అనే బిరుదు తగిలించుకున్నాడు. ఆ తర్వాత కొంత కాలానికి ఉజ్జయినిని పాలించిన భోజుడు మరొక రాజు ఉన్నాడు. అందుచేత చరిత్రకారులు ఇద్దరికీ తేడా చూపడానికి ఈ భోజుడిని మిహిరభోజుడు అని అంటారు.

భోజుడు క్రీ.శ.885లో మరణించాడు. అనంతరం అతడి కుమారుడు మహేంద్ర పాలుడు-1 అధికారం చేపట్టాడు. క్రీ.శ. 908-9 వరకూ పాలించాడు. అతడి పాలనలో భోజుడు సాధించిన సామ్రాజ్యాన్ని నిలబెట్టుకోవడమే గాక, మగధ, ఉత్తర బెంగాల్ ప్రాంతాలకు కూడా విస్తరింపజేశాడు. కథియవార్, తూర్పు పంజాబ్, అవధ్ ప్రాంతాలలో కూడా అతడి శాసనాలు లభిస్తాయి. కాశ్మీర్ రాజుతో చేసిన యుద్ధంలో మహేంద్రపాలుడు ఓడిపోయాడు. అందువలన పంజాబ్‌లో కొంత ప్రాంతం మీద ఆధిపత్యాన్ని వదులుకోవలసివచ్చింది.

క్రీ.శ.850 నుండి క్రీ.శ.950 వరకు దాదాపు వంద సంవత్సరాలపాటు ప్రతీహారులు ఉత్తర భారతదేశం మీద తమ ఆధిపత్యాన్ని చెలాయించగలిగారు. క్రీ.శ.915లో గుజరాత్‌లో పర్యటించిన ఆల్-మసుది అనే బాగ్దాదు వర్తకుడు ప్రతీహారుల సామ్రాజ్యం గురించి రాతపూర్వకంగా నమోదు చేసిన వివరాలు ఆ సామ్రాజ్యపు విశిష్టతను తెలియజేస్తున్నాయి. ప్రతీహార సామ్రాజ్యంలో 18 లక్షల గ్రామాలు ఉండేవని, ఆ రాజ్యం రెండువేల కి.మీ. పొడవు, రెండువేల కి.మీ. వెడల్పు ఉన్న భూభాగం మీద ఉండేదని, రాజు సైన్యంలో 4 విభాగాలు ఉండేవని, ఒక్కో విభాగంలో 7 నుండి 9 లక్షల వరకు సైన్యం ఉండేదని అతడు రాశాడు. గజబలం 2000 మాత్రమే ఉన్నప్పటికీ, అశ్విక దళం చాలా బలంగా ఉండేదని పేర్కొన్నాడు.

ప్రతీహారులు సాహిత్యాన్ని, కళలను ప్రోత్సహించారు. భోజుడి మనుమడు మహీపాలుడి ఆస్థానంలో ప్రముఖ కవి, నాటకకర్త అయిన రాజశేఖరుడు ఉండేవాడు. కనోజ్‌లో అనేక భవనాలను, దేవాలయాలను ప్రతీహారులు నిర్మించారు. ఈ కాలంలో భారత ఉపఖండం నుంచి పలువురు భారతీయ పండితులు బాగ్దాదును పాలించిన ఖలీఫా ఆస్థానానికి వెళ్ళారు. గణితం, ఆల్జీబ్రా, ఆయుర్వేదం వంటి భారతీయ విజ్ఞాన శాస్త్రాలను అరబ్బులకు పరిచయం చేశారు. సింధు ప్రాంతంలోని అరబ్బు పాలకులతో ప్రతీహారులకు ఎడతెగని వైరం కొనసాగుతున్నా, తక్కిన పశ్చిమ ఆసియా ప్రాంతంతో వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను బలంగా నెలకొల్పగలిగారు.

క్రీ.శ.915-918 మధ్య రాష్ట్రకూటులు కనోజ్ మీద దాడులు చేసి ఆ నగరాన్ని ధ్వంసం చేశారు. దాంతో ప్రతీహారుల ఆధిపత్యం సన్నగిల్లింది. రాష్ట్రకూటుల ఆధీనంలోకి గుజరాత్ ప్రాంతం పోవడంతో ప్రతీహారులకు సముద్రమార్గంతో సంబంధాలు తెగిపోయాయి. దాంతో ప్రతీహారులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. క్రీ.శ.963లో రాష్ట్రకూట ప్రభువు 3వ కృష్ణుడు ప్రతీహారులను పూర్తిగా ఓడించాడు. దాంతో ప్రతీహార సామ్రాజ్యం వేగంగా విచ్ఛిన్నం అయింది.

### రాష్ట్రకూటులు

షోలాపూర్ సమీపంలో ఉన్న మల్ఖేడ్ అనే ప్రదేశంలో రాష్ట్రకూట సామ్రాజ్యాన్ని తొలుతగా దంతిదుర్గుడు స్థాపించాడు. రాష్ట్రకూట వంశంలో శక్తివంతులైన యోధులు, సమర్థవంతులైన పాలకులు ఉండేవారు. ఉత్తర మహారాష్ట్ర


> **68 సంవత్సరాలు పాలించిన అమోఘ వర్షుడు తండ్రికి భిన్నంగా యుద్ధానికి బదులు మత చింతనకు. సాహిత్యానికి అధిక ప్రాధా న్యతనిచ్చాడు. అమోఘ వర్షుడు స్వయంగా కవి. కన్నడంలో కవిత్వ మీద ఒక గ్రంథాన్ని రచించాడు. మాన్యఖేత్ అనే పట్టణాన్ని ఇంద్ర సభను తలదన్నేలా నిర్మించాడు.**

ప్రాంతం మీద ఆధిపత్యాన్ని సాధించారు. ఆ తర్వా ప్రతీహారులతో మాల్వ, గుజరాత్ ప్రాంతాలమీద ఆధిపత్యం కోసం తలపడ్డారు. గంగా తీరం వరకూ వారి దండయాత్రలు కొనసాగినా, అక్కడి భూభాగం మీద వారికి ఆధిపత్యం చిక్కలేదు. ఐతే ఆ దండయాత్రలలో కొల్లగొట్టిన సంపదతో రాష్ట్రకూటులు బల పడ్డారు. తూర్పున వేంగి ప్రాంతంలో పాలి స్తున్న (కృష్ణాగోదావరి డెల్టా ప్రాంతం) చాళు క్య రాజులతో, దక్షిణాదిన పల్లవులతోను, పాండ్యులతోను తరచూ తలపడుతూండేవారు. క్రీ.శ.793–814 మధ్య కాలంలో పాలించిన 3వ గోవిందుడు, 814 నుండి పాలించిన అమోఘవర్షుడు రాష్ట్రకూటరాజులలో ప్రము ఖులు. 3వ గోవిందుడి విజయాలగురించి వివరించే శాసనాలు పరిశీలిస్తే కనోజ్ పాలకు డు నాగభట్టును ఓడించి, మాళ్వ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత దక్షిణ దిశగా మళ్ళీ, కేరళ, పాండ్య, చోళ , పల్లవ రాజ్యాలను గడగడలాడించాడు. తన దుర్మార్గాలను తీవ్రం గా వ్యతిరేకించిన గాంగులను పూర్తిగా నాశనం చేశాడు. లంక రాజును పట్టి బంధించి తన రాజ్యానికి తీసుకువచ్చాడు.

68 సంవత్సరాలు పాలించిన అమోఘ వర్షుడు తండ్రికి భిన్నంగా యుద్ధానికి బదులు మత చింతనకు. సాహిత్యానికి అధిక ప్రాధా న్యతనిచ్చాడు. అమోఘవర్షుడు స్వయంగా కవి. కన్నడంలో కవిత్వ మీద ఒక గ్రంథాన్ని రచించాడు. మాన్యఖేత్ అనే పట్టణాన్ని ఇంద్ర సభను తలదన్నేలా నిర్మించాడు.

అమోఘవర్షుడి కాలంలో రాష్ట్రకూట సామ్రాజ్యం పొలిమేరల్లో అనేక తిరుగుబాట్లు తలెత్తాయి. అతడి మరణం తర్వాత అధికారం చేపట్టిన మనుమడు 3వ ఇంద్రుడు (915–927) ఆ తిరుగుబాట్లను అణచివేసి అధికారా న్ని సుస్థిరం చేశాడు. కనోజ్ ను పాలించిన మహీపాలుడిని 915లో ఓడించిన తర్వాత 3వ ఇంద్రుడు ఆ కాలపు తిరుగులేని శక్తివంతుడైన ప్రభువుగా నిలబడ్డాడు. అతడి అనంతరం వచ్చిన వల్లభరాజు ఆనాటి అత్యంత శక్తివంతుడైన రాజుగా పరిగణింప బడేవాడని ఆల్ మసుది తన రాతల్లో పేర్కొన్నాడు. 934 నుంచి 963 వరకు పాలిం చిన 3వ కృష్ణుడు సమర్ధవంతులైన రాష్ట్రకూట రాజుల్లో చివరివాడు. మాళ్వ ప్రాంతాన్ని పాలించిన పరమారులతో, వేంగిని పాలించిన తూర్పు చాళుక్యులతో, తంజావూరు పాలకులైన చోళులతో, కంచిని పాలించిన పల్లవులతో తలపడ్డాడు. చోళ సామ్రాజ్యపు ఉత్తర భాగాన్ని ఆక్రమించాడు. ఆ తర్వాత రామేశ్వరం వరకూ జైత్రయాత్ర కొనసాగించి అక్కడ తన విజయ స్తంభాన్ని స్థాపించాడు. అతడి మరణం తర్వాత ప్రత్యర్థులందరూ ఏకమై 972లో రాష్ట్రకూటుల రాజధానిని నేలమట్టం చేశారు.

దక్కను ప్రాంతం రాష్ట్రకూటుల ఏలుబడిలో దాదాపు 200 సంవత్సరాలపాటు కొనసాగింది. రాష్ట్రకూట రాజులు శైవ, వైష్ణవ, జైన మతాలను సమంగా ఆదరించారు. ఎల్లోరా వద్ద రాతితో చెక్కిన ప్రసిద్ధ శైవ దేవాలయాన్ని 9వ శతాబ్దంలో 1వ కృష్ణుడు నిర్మింపజేశాడు. అతడి అనంతరం పాలించిన అమోఘవర్షుడు స్వయంగా జైనమతాన్ని పాటించినా, అన్ని మతాలనూ ఆదరించాడు.



(పటం: క్రీ.శ.700–1030 మధ్య కాలంలో భారత ఉపఖండం)

రాష్ట్రకూటులు ముస్లింలను తమ రాజ్యంలో స్థిరపడడానికి అనుమతించడమే గాక, ఇస్లాం మత ప్రచారానికి కూడా అనుమతించారు. ఈ విధానం వలన రాష్ట్రకూటుల విదేశీ వ్యాపారం బాగా వృద్ధి చెందింది.

రాష్ట్రకూటుల ఆస్థానంలో ప్రముఖ సంస్కృత పండితులు, కవులు ఉండేవారు. సంస్కృతంతోబాటు ప్రాకృతాన్నీ, అపభ్రంశ భాషను కూడా ప్రోత్సహించారు. ఈ ప్రాకృతం నుండి అపభ్రంశ భాషనుండి పలు ఆధునిక భారతీయ భాషలు పుట్టుకొచ్చాయి. ప్రముఖ అపభ్రంశ కవి స్వయంభువు, అతడి కుమారుడు రాష్ట్రకూటుల ఆస్థానంలో ఉండేవారు. ※

కేంద్ర రాష్ట్ర సంబంధాలు

# ఆదాయం కేంద్రానికి ఖర్చులు రాష్ట్రాలకి

**ఎం సురేష్ బాబు**



**రచయిత ఐఐటి మద్రాసుకు చెందిన డెవలప్‌మెంట్ ఎకనామిస్ట్. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ (మిడ్స్) డైరెక్టర్‌గా నియమించబడ్డారు.**

ఈ మధ్యకాలంలో రాష్ట్రాలకు కేంద్రానికి మధ్య వనరుల పంపిణీలో వివాదాలు మరింత పెరుగుతున్నాయి. సమాఖ్య వ్యవస్థలో నిరంతరంగా ఘర్షణలు ఏర్పడుతున్నాయి. చాలా రాష్ట్రాలలో ఈ విభేదాలు తాత్కాలిక సంక్షోభానికి కారణం అయ్యాయి. ప్రధానంగా ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలలో ఈ సమస్య ఎదురవుతోంది. ఇప్పుడు రాష్ట్ర ,కేంద్రాల మధ్య ఉన్న సంబంధాలు 1980–1990ల నాటి కంటే ఏంతో భిన్నమైనవి. 1991లలో ఆర్థిక సంస్కరణలు మొదలైన తరువాత పెట్టుబడుల నియంత్రణలో కొన్ని మార్పులు వచ్చినప్పటికీ, రాష్ట్రాలకు ద్రవ్య విధానాలలో కొంత వెసులుబాట్లు కల్పించబడ్డాయి. రాష్ట్రాలకు వనరుల సమీకరణకు గానీ, ఖర్చులు పెట్టుకోదానికి, ప్రణాళికలు రూపొందించుకోడానికి గానీ పూర్తి స్వేచ్ఛ లేదు. ఇది సమాఖ్య వ్యవస్థలలో అసమానతలకు దారితీస్తున్నది. రాష్ట్రాలు కేంద్రం పైనే తమ ఆదాయం కోసం, గ్రాంట్ల కోసం ఆధారపడవలసి వస్తున్నది. 1990ల నుండి ఏర్పడిన కాస్తంత వెసులుబాటు కూడా జిఎస్‌టి అమలుతో దెబ్బతినింది. జిఎస్‌టి రాష్ట్రాలకి అందుబాటులో ఉండవలసిన వనరులను కుంచింపచేసింది. అవి కేంద్రంపై మరింతగా ఆధారపడేటట్టు చేసింది.

ఈ కేంద్రీకరణ ధోరణితో కేంద్ర విధానాలపై రాష్ట్రాలు ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య 'ఇచ్చిపుచ్చుకునే' సంబంధం క్రమంగా చెడి రెండువైపులా దృఢమైన వైఖరులు తీసుకునే స్థితి ఏర్పడింది. దీర్ఘకాలంలో ఇటువంటి ధోరణి వలన కేంద్ర రాష్ట్ర సంబంధాలు మరింత దెబ్బతినే అవకాశం ఉంది. ఇది సహకార పద్ధతిలో సాగవలసిన సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది. అంతేకాదు, సమాఖ్య వ్యవస్థకే ప్రధానమైన సవాలుగా నిలుస్తుంది.

కేంద్రం, రాష్ట్రాలు కూడా వేరు వేరు పద్ధతులలో వనరులు సమీకరించుకోడానికి రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది. రాజ్యాంగంలోని ఏడవ అధికరణం మూడు జాబితాల ద్వారా ఖర్చులు చేసుకోనే బాధ్యతను నిర్ణయించింది: కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉమ్మడి జాబితా. రాజ్యాంగం రూపొందించిన ఈ విధమైన విభజన కేంద్ర ప్రభుత్వానికి మరింత ఎక్కువ, మరింత సులువైన పద్ధతులలో పన్నులు వసూలు చేసుకునే వెసులుబాటు, వసతులు, వనరులు సమీకరించగల అధికారాలు కట్టపెట్టింది. రాష్ట్రాలకు మరింత ఎక్కువ ఖర్చులు పెట్టే బాధ్యతను అప్పచెప్పింది.

ఈ అసమతుల్యతను 2018–19 కేంద్ర బడ్జెట్‌లో చూడవచ్చు. ఇందులో రాష్ట్రాలు, కేంద్రం కలిసి సమీకరించిన మొత్తం వనరులలో కేంద్రం 62.7 % సమీకరించగా, రాష్ట్రాలు పెట్టిన ఖర్చులు, మొత్తం కేంద్రం రాష్ట్రాలు కలిసి పెట్టిన ఖర్చులలో 62.4% ఉన్నాయి. రాష్ట్రాలు పెట్ట వలసిన ఖర్చులు అధికంగా ఉండడం వలన కేంద్రం, రాష్ట్రాలకు నిధులు మంజూరు చేయవలసి ఉంటుంది.

2018–19 గణాంకాల ప్రకారం రాష్ట్రాలు సరాసరిన తమకు అవసరమైన వనరులలో 44.8 % మాత్రమే సమీకరించుకోగలవు. అంటే, మిగిలిన 55.2% నిధులు కేంద్రం బదిలీ చేయవలసిందే. అందువలన రాజ్యాంగం ఈ అసమానతలు సరిచేయడానికి ఫైనాన్స్ కమిషన్‌ని ఏర్పాటు చేసింది. అది వాస్తవ పరిస్థితుల ఆధారంగా, ఆయా కాలాలలో వివిధ రాష్ట్రాల మధ్య వనరులను, విభజించవలసిన తీరును సూచిస్తుంది.

ఆరవ ఫైనాన్స్ కమిషన్ ఈ అసమానతని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రాలకు వనరుల పంపకం చూపించాల్సి ఉంది. కేంద్రం సమీకరించిన వనరులు, రాష్ట్రాలకు పంపకాలు జరగవలసిన వనరులు కనీసం 50:50గా ఉంటే బాగుంటుంది. ప్రధానంగా పంపకం జరగాల్సిన నిధులు కుంచించుకు పోతున్న నేపథ్యంలో ఈ సూచన ప్రాధాన్యత సంతరించుకుంది. ఇందుకు ప్రధాన కారణం, కేంద్రంతో పోల్చి చూస్తే, రాష్ట్రాలకు నిర్వర్తించవలసిన బాధ్యతలు, పెట్టాల్సిన ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. ప్రధానంగా విద్య, ఆరోగ్యం, పోలీసు, శాంతి భద్రతలు, వ్యవసాయం అందుకు సంబంధించిన కార్యకలాపాలు, నీటి పారుదల, అడవులు, పర్యావరణ పరిరక్షణ, ఇంధనం, రోడ్లు, సామాజిక సంక్షేమం, తాగు నీరు, పరిశుభ్రత వగైరా.

రాష్ట్రాలు నెరవేర్చవలసిన ఈ బాధ్యతలు కోవిడ్ సమయంలో మరింత స్పష్టంగా కనిపించాయి. లాక్‌డౌన్ విధించగానే రాబడులు నిలిచిపోయాయి. రాష్ట్రాలు విధించే పన్నులు, పన్నేతర ఆదాయాలు తగ్గాయి. కానీ అంటురోగాలు అదుపులో ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవలసిన బాధ్యతలు పెరిగాయి. రాష్ట్రాలు నిర్వర్తించవలసిన బాధ్యతలకు గాను కేంద్రం మరిన్ని నిధులు సమకూర్చవలసిన పరిస్థితి ఏర్పడింది.

జిఎస్‌టి అమలుతో రాష్ట్రాలు తమ నిధులను తామే సమకూర్చుకునే స్వతంత్రతని కోల్పోయాయి. కేంద్రంపై నిధులకోసం ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రాల ఆర్థిక స్వతంత్రత దెబ్బతినింది. జిఎస్‌టి అమలు కాకముందు రాష్ట్రాలు వాటి కవే వీలయినన్ని అదనపు నిధులను సమకూర్చుకోగలిగాయి. పన్ను రేట్లను తమకనుగుణంగా నిర్ధారించుకోగలిగాయి. కానీ ఇప్పుడు పన్ను రేట్లను జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంటుంది. పన్నులు వేయగల ప్రతి వస్తువు జిఎస్‌టి పరిధిలోకి వచ్చింది. అందువలన రాష్ట్రాలు పన్నులు వేసుకోగల వెసులు బాటు కోల్పోయాయి.

> ❝ రాష్ట్రాల మధ్య జరిగే పంపకాలలో ఆయా రాష్ట్రాల ఆర్థిక అవసరాలు, వాటాలు, పనితీరు, ఆర్థిక ఇబ్బందులు, ద్రవ్య క్రమశిక్షణ వగైరాలు పరిగణనలోకి తీసుకోబడతాయి. అయితే, ఈ అంశాలకి ఎంత ప్రాధాన్యత ఉంటుందనేది ఎప్పటికప్పుడు మారుతూ ఉం టుంది. ఇది అనేక రాష్ట్రాలకు నష్టం కలిగిస్తు న్నది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువ గా నష్టపోతున్నాయి. ❞

జిఎస్‌టి వ్యవస్థ వలన తమకు సేవా పన్నుల్లో వాటా వస్తుందని రాష్ట్రాలు భావించాయి. కానీ వాస్తవంలో రాష్ట్రాలే కేంద్రానికి ఎక్కువ మొత్తంలో చెల్లించవలసి వస్తున్నది. నిజానికి రాష్ట్రాలకి రావలసిన వాటా ఏమాత్రం అడ్డు లేకుండా వచ్చి ఉండవలసింది. కానీ, కేంద్రం ఇక్కడ ఒక మతలబు చేసింది. మొత్తం వసూళ్ళలో, పన్నులను తగ్గించి సెస్, సర్చార్జి వసూళ్లు ప్రారంభించింది. ఇందులో, రాష్ట్రాలకు వాటా ఇవ్వడం కేంద్రం ఇష్ట ఇష్టాలపై ఆధారపడి ఉంటుంది. రాజ్యాంగం ప్రకారం ఈ విధంగా సేకరించిన నిధులను రాష్ట్రలకు పంచాల్సిన పని లేదు.

రాష్ట్రాల మధ్య జరిగే పంపకాలలో ఆయా రాష్ట్రాల ఆర్థిక అవసరాలు, వాటాలు, పనితీరు, ఆర్థిక ఇబ్బందులు, ద్రవ్య క్రమశిక్షణ వగైరాలు పరిగణనలోకి తీసుకోబడతాయి. అయితే, ఈ అంశాలకి ఎంత ప్రాధాన్యత ఉంటుందనేది ఎప్పటికప్పుడు మారుతూ ఉం టుంది. ఇది అనేక రాష్ట్రాలకు నష్టం కలిగిస్తు న్నది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువ గా నష్టపోతున్నాయి.

పన్నెండో ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు తమిళనాడు మొత్తం పనులలో 5.3% వాటాను మాత్రమే పొందింది. పదిహేనో ఫైనాన్స్ కమిషన్ కేవలం 4.07% మాత్రమే సిఫారసు చేసింది. పంపకం చేయాల్సిన మొత్తం పన్నులలో తమిళనాడు వాటా తగ్గడంతో, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పన్నుల వాటా 2011-12లో 1.69% ఉండగా 2022-23కి 1.34%కి పడిపోయింది. వడ్డీల చెల్లింపులు, పెన్షన్లు, జీతాలు, మొత్తం పన్నులలో తమిళనాడు ప్రభుత్వం చెల్లించాల్సిన వాటా పెరగడంతో, రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తిలో చట్టపరంగా, రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య బాధ్యతగా, పెట్టుబడులు పెట్టాల్సిన వాటా నిష్పత్తి, ఏర్పాటు చేసుకున్న లక్ష్యం కన్నా దిగజారింది.

మొత్తం పన్నులలో రాష్ట్ర వాటా తగ్గడం, స్వతంత్రంగా పన్నులు వసూలు చేసుకోగల స్వతంత్రత కోల్పోవడమే కాక, తమిళనాడు మరో మూడు విధాలుగా నష్టపోయింది. మొదటిది, మెట్రో రైలు ప్రాజెక్ట్ రెండవ ఫేజ్‌కి నిధుల మంజూరులో తీవ్రమైన జాప్యం- ఇది కేంద్ర రంగంలో ప్రాజెక్ట్‌గా, పబ్లిక్ ఇన్వెస్ట్మెంట్ బోర్డు అను మతి పొందింది. ఇందులో రాష్ట్రానికి కేంద్రానికి కూడా యాజమాన్య హక్కులు ఉంటాయి. 2021లో రాష్ట్రం ఈ ప్రాజెక్ట్ అనుమతి పొందింది. అప్పటి నుంచి ఇది కేంద్ర కమిటీ ఆర్థిక విభాగం అనుమతి కోసం ఎదురుచూస్తున్నది. కేంద్రం అనుమతిస్తుందన్న నమ్మకముతో రాష్ట్రం తన నవనరుల నుండి ఈ ప్రాజెక్ట్‌కి ఖర్చులు పెడుతున్నది. దీనితో రాష్ట్రంపై తీవ్రమైన భారం పడుతున్నది. 2024లో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెడుతూ తమిళ నాడు ఆర్థిక మంత్రి "కేంద్రం ప్రాజెక్ట్ అనుమతికి చేస్తున్న జాప్యం కారణం గా రాష్ట్రం ఈ ప్రాజెక్టుకు రూ 9000 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. 2023-24లో అనుమతి వస్తే, రూ 12000 కోట్ల అదనపు భారం రాష్ట్రంపై పడుతుంది" అన్నారు.


రెండోది, ప్రకృతి వైపరీత్యాల కారణంగా తమిళనాడుకి అత్యంత స్వల్ప మొత్తంలో సహాయం అందుతోంది. 2023నే ఉదాహరణ గా తీసుకోండి. ఈ సంవత్సరంలో రెండు అసాధారణ ప్రకృతి విలయాలు సంభవించాయి. రాష్ట్రం రూ 37,906 కోట్లు సహాయం కోరుతూ వివరంగా నివేదిక సమర్పించింది. కానీ కేంద్రం రూ 276 కోట్లు మాత్రమే సహాయంగా అందించింది. కేంద్ర హెూమ్ మంత్రి, ఏప్రిల్‌లో రూ 284.54 కోట్లు ఒకసారి, రూ 397.13 కోట్లు మరో సారి, రెండు విడతలుగా మంజూరు చేయాలని ఆదేశించారు. కానీ జాతీయ విపత్తుల ప్రతిస్పందన నిధుల కింద కేవలం రూ 115.49 ఒకసారి, రూ 160.60 కోట్లు మరో సారి మాత్రమే విడుదల అయ్యాయి.

తాము తక్షణ సహాయం చేయడానికి మాత్రమే నిధులు మంజూరు చేస్తామనీ, దీర్ఘ కాలంలో పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చు లను రాష్ట్రాలు భరించుకోవాలనీ కేంద్రం వాదిస్తు న్నది. ప్రకృతి విలయాల నుండి కాపాడుకో డానికి రెండు రకాల నిధులు విడుదల చేస్తారు. తక్షణ సహాయం, పునర్నిర్మాణం. తక్షణ సహాయానికి చిన్నమొత్తాలలో నిధులు సమకూర్చబడతాయి. పునర్నిర్మాణం దీర్ఘకా లం పడుతుంది. అందువలన నిధుల ఆవశ్యకత కూడా ఎక్కువగా ఉంటుంది. అందువలన కేంద్ర సహాయ సహకారాలు లేకుండా, రాష్ట్రాలు ప్రకృతి విపత్తులను ఎదుర్కొడం కష్ట సాధ్యంగా ఉంటుంది. దీని వలన ఇతర అభివృద్ధి కార్యక్రమాలు కుంటు పడతాయి.

మూడోది, కేంద్ర పథకాల అమలు. ఈ పథకాల కింద మంజూరైన వాటిలో రాష్ట్రాల వాటా ఎక్కువగా ఉంటున్నది. ఉదాహరణకి ప్రధానమంత్రి ఆవాజ్ యోజన అనే గృహ నిర్మాణ పథకం కింద కేంద్రం రాష్ట్రాలకి ఒక్కొక్క గృహానికి కేవలం రూ 1.5 లక్షలు మాత్రమే మంజూరు చేస్తుంది. తమిళనాడు ప్రభుత్వం ఒక్కొక్క గృహానికి రూ7.5 నుండి 13 లక్షలు ఖర్చు చేస్తుంది. అదే గ్రామీణ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలకు ఒక్కో ఇంటికి కేంద్రం రూ 72000/- ఇస్తే రాష్ట్రమే రూ 1. 68 లక్షలు ఇస్తుంది. కేంద్రం ఇచ్చే అరకొర నిధులతో నివాసయోగ్యమైన ఇల్లు కట్టడం అసాధ్యమన్న విషయం అందరికి తెలిసినదే. వృధాప్య పెన్షన్ విషయంలో కూడా అంతే. కేంద్రం ఇచ్చే సంక్షేమ నిధులు అతి తక్కువగా ఉండడం వలన రాష్ట్రాలు తమ నిధుల లోనుంచి ఎక్కువ భాగం వెచ్చించాల్సి వస్తుంది.

నిధుల సమీకరణ అంతా కేంద్రీకృతమై, కార్యక్రమాల నిర్వహణ వికేంద్రీకరించబడిన ప్రభావం పౌరుల జీవితాలపై తీవ్రంగా ఉం టుంది. సమాఖ్య విధానంలో మంజూరులలో జాప్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తాయి. ఆర్థికాభివృద్ధి జరగాలంటే రాష్ట్రాలకి చట్ట బద్ధంగా రావాల్సిన నిధుల మంజూరులో జా ప్యం ఉండకూడదు. ప్రాంతీయ అసమానతలు లేకుండా సమతుల్యంగా అభివృద్ధి చెందినపుడు దేశం మొత్తం అభివృద్ధి పథంలో నడుస్తుంది. ఇదే ఈనాటి ప్రాధమిక కర్తవ్యం. **(అనువాదం: కె. ఉషారాణి)**

# ఖజానా రాజకీయాలు



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త, రచయితలు

సిపి చంద్రశేఖర్

కేంద్రం నెమ్మది నెమ్మదిగా రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తికి గండి కొడుతున్నది. ఇది ద్రవ్య సమాఖ్య తత్వాన్ని తలకిందులు చేయడమే. కేంద్ర-రాష్ట్రాల సంబంధాలు సమతూకం చేసి, రాష్ట్రాలకు సమన్యాయం చేయడానికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటుందా?

భారతదేశ ప్రజాతంత్ర పాక్షిక సమాఖ్య విధానం కుప్పకూలి కేంద్రీకృత నిరంకుశత్వం ఏర్పడబోతోందని అనిపిస్తున్నది. నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) తన పాశవిక ఆధిపత్యాన్ని కోల్పోయి, రెండు ప్రాంతీయ పార్టీలపై (జెడియు, టిడిపి) ఆధారపడి అధికారం నిలుపుకునే స్థాయికి దిగజారడాన్ని 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తెలియ చేస్తున్నాయి. ఇప్పుడిక బీజేపీ తన మనసుకు నచ్చినటల్లా చేయడం కుదరదు. ప్రాంతీయ పార్టీల డిమాండ్లకు తలొగ్గ వలసిందే. అయితే వారి ఆర్థిక డిమాండ్లపై కూడా ఎటువంటి స్పష్టత లేదు. నిజానికి వీళ్ళకు బాహాటంగా ప్రకటించిన రాయితీలు తక్కువగా ఉన్నాయి. లోపాయి కారీగా వారి మధ్య పెద్ద మొత్తాలకు ఒప్పందాలు జరిగి ఉండవచ్చని అనుమానాలు కలుగుతున్నాయి. వాటిని బయటపెడితే ఇతర రాష్ట్రాల నుంచీ, బీజేపీ పాలిట రాష్ట్రాల నుంచి కూడా, ఒత్తిడిని ఎదుర్కోవలసి వస్తుందని దాచిపెడుతున్నట్టు అనిపిస్తున్నది.

పైగా, రాష్ట్రాల అధికారాలకు కోతలుపెట్టే వివాదాస్పద చట్టాలు,"నిర్ణయాలు" చేయడానికీ, ఏకపక్షంగా పార్లమెంటులో ఏ చర్చలు లేకుండా వాటిని మొండిగా నెగ్గించుకునే అవకాశాలు కూడా ఇప్పుడు లేవు. చురుకుగా ఉన్న ప్రతిపక్షం, తన వాణి వినిపించేందుకు సిద్ధంగా ఉంది. మీడియా కూడా వారి భావాలు ప్రజలకు నివేదించడానికి సుముఖంగా ఉన్నది. ఇది పాలకపక్షాన్ని ఇరుకున పడేస్తున్నది. ఎన్నికల ఫలితాలు దేశ సామాజిక రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేశాయి. అందువలన మీడియా గానీ, న్యాయవ్యవస్థ గానీ కేంద్ర రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చినప్పుడు మరింత సంయమనం పాటించవలసిన పరిస్థితి ఏర్పడింది. తమకు అన్యాయం జరుగుతున్నదని రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇది గత దశాబ్దకాలంలో సమాఖ్య వ్యవస్థ పతనాన్ని తెలియచేస్తున్నది.

ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు చెందిన ఖైదు చేయబడిన నాయకులను విడుదల చేయడం, కోర్టు తీర్పులలో వచ్చిన మార్పును తెలియచేస్తున్నది. ఈ నాయకులంతా నెలల తరబడి తప్పుడు కేసులలో ఇరికించబడి ఖైదు చేయబడిన వారే. కోర్టులు ఇప్పుడు వారి కేసులు విచారించి బెయిళ్ళు మంజూరు చేస్తున్నాయి. ఆప్ పార్టీకి చెందిన ఢిల్లీ మంత్రి మనీష్ సిసోడియాని 17 నెలలు జైల్లో పెట్టారు. అతనిపై మోపిన అవినీతి ఆరోపణలు ఏవీ ఇంతవరకు రుజువు కానే లేదు. సుప్రీం కోర్టు 2023 అక్టోబర్‌లో అతనికి బెయిలు నిరాకరించి జూన్ వరకు జైలులో ఉంచడానికి అనుమతించింది. కానీ ఆగస్టులో "బెయిలు సాధారణం జైలు అసాధారణం'' అని తీర్పునిచ్చింది. విచారణ శీఘ్ర తరం చేయటం ప్రాథమిక హక్కని, సుదీర్ఘకాలం జైలులో బంధించడం తగదని ప్రకటిస్తూ ఆయనను విడుదల చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఇన్నాళ్ళుగా ఈ సహజ న్యాయ సూత్రాలను ఎందుకు ఉపేక్షించారు, ఇప్పుడే ఎందుకు గుర్తుకొచ్చాయి? అయితే ఇప్పటికీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలులోనే ఉన్నారు. ఒక కేసు తరువాత మరో కేసు ఆయనపై మోపుతునే ఉన్నారు. ఇప్పటికీ రాజకీయ నాయకులపై కొత్త కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. అయితే, ఇటువంటి పనులు ఆపమని కేంద్రంపై ఒత్తిడి పెరుగుతున్నట్టు కనిపిస్తున్నది.

అయినప్పటికీ, కేంద్రం తనకున్న ఏ అవకాశాలూ వదులుకునేందుకు సిద్ధంగా లేదు. కేంద్ర వ్యవస్థలను తనకనువుగా వినియోగించుకుంటూనే ఉంది. రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రాజ్యాంగ పెద్దలుగా వ్యవహరిస్తూ, బీజేపీ విధేయ గవర్నర్లు, బీజేపీకి అనువుగా లేని బిల్లులను తొక్కిపెడుతూ, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా ఆపుతూ, కొన్నిటిని ప్రెసిడెంట్ ఆమోదానికి పంపుత, బిల్లులు అమలు చేయకుండా ఉండడానికి వీలయినంత ఎక్కువగా కాలయాపన చేసస్తూ, బీజేపీకి సహకరిస్తున్నారు. ఒక రాజ్యాంగ పెద్దగా గౌరవప్రదంగా వ్యవహరించడం మాని, రాష్ట్ర ప్రభుత్వాలతో వైరానికి దిగుతున్నారు. వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైస్ చాన్సిలర్ల నియామకాలలో జోక్యం చేసుకుంటున్నారు. ఛాన్సలర్లుగా వారికున్న గౌరవప్రద పదవిని దుర్వినియోగ పరుస్తున్నారు. పదే పదే జరుగుతున్న ఇటువంటి సంఘటనలు చూసినప్పుడు, జెఎన్‌యు విశ్వవిద్యాలయం విషయం నుండి విశ్వ భారతి శాంతినికేతన్ వరకు అనేక సందర్భాలలో జరుగుతున్న సంఘటనలను పరిశీలించినప్పుడు, ఇవి కేవలం మొండి తనమనో, మంకు పట్టనో కొట్టిపారేయలేము. విశ్వవిద్యాలయాల్లో "సరైన ఆలోచనలను" విద్యార్థులకు, ఉపాధ్యాయులకు- అందించగల వైస్ ఛాన్సిల్లర్లను నియమించడమే ఈ జోక్యం చేసుకోవడంలోని ఆంతర్యం. ఇటువంటి జోక్యందారీ తనానికీ, బీజేపీ

> **❝ కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ ఎల్లప్పుడూ వివాదాస్పదమే అయినప్పటికీ, అత్యధిక రాష్ట్రాలు, కేంద్రం తన వద్ద అధికంగా వనరులు అట్టే పెట్టుకుని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులలో కోతలు పెడుతున్నదని భావిస్తున్నాయి. అంతేకాదు, రాష్ట్రాల మధ్య వివక్షత చూపుతున్నట్టుకూడా భావించడం జరుగుతున్నది. ❞**

విధానాలకూ వ్యతిరేకంగా వస్తున్న విమర్శలను, నిరసనలను శాంత పరచడానికి అని అనిపిస్తుంది. నిజానికి బీజేపీ కేవలం కేంద్రంలో అధికారంలో ఉంటూ, దేశానికి నాయకత్వం వహించడమే కాక, రాష్ట్ర రాజకీయాలలోకూడా క్రియాశీల పాత్ర పోషించడానికి వేసిన రాజకీయ ఎత్తుగడ. అయితే, వారు నరేంద్రమోడీ ప్రజాదరణ తగ్గుముఖం పట్టిందని నమ్మకపోవడం కాక, ప్రతిపక్షాలు బలపడడాన్ని కూడా అంగీకరించలేదు. అంతేకాదు, ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలలో వారు ఎన్నికలలో చేసిన వాగ్దానాలు అమలు పరచ నీయకుండా అడ్డుపడ్డారు. ఆ విధంగా చట్ట బద్ధంగా ఎన్నికలలో గెలిచేందుకు వారికున్న అవకాశాలను కుంచింపచేయడానికి ప్రయత్నిస్తున్నారు.

అందుకుగాను కేంద్రం అధీనంలో ఉన్న అన్ని సంస్థలను వినియోగించడమే కాక రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులలోకూడా కోతలు పెట్టారు. కేంద్రం పరిధిలో మొత్తం పన్నుల వసూళ్లు కేంద్రీకరించడంతో రాష్ట్రాలకు నిధుల పంపిణీ చేయడం కేంద్రీకృతమైంది. రాష్ట్రాలు, కేంద్రం మధ్య పంపకాల విషయాలు ఇదివరకు ప్లానింగ్ కమిషన్ (ప్రణాళిక సంఘం), నేషనల్ డెవెలప్మెంటల్ కౌన్సిల్ (జాతీయ అభివృద్ధి మండలి) రాష్ట్రాలతో చర్చించి నిర్ణయాలు తీసుకునేవి. ఇప్పుడు అవి పనిచేయడం లేదు. వాటి స్థానంలో నీతి ఆయోగ్ వచ్చింది. దానికి ఏ విధమైన అధికారాలు లేవు. కేవలం సలహాలు మాత్రమే ఇవ్వగలదు. పైగా అది కేంద్రం అనుసరించే ఉదారవాద విధానాలను సమర్ధవంతంగా తీర్చిదిద్దగల మేధోవర సంస్థగానే రూపొందించబడింది. అందువలన ఎన్‌డియేతర రాష్ట్ర ప్రభుత్వాలకు నీతి ఆయోగ్ పట్ల ఏమాత్రం నమ్మకం లేదు.అందువలన ఎన్‌డియేతర రాష్ట్ర ప్రభుత్వాలలో అత్యధికులు 2024 జూలైలో జరిగిన దాని పరిపాలన సంస్థ తొమ్మిదవ సమావేశాన్ని బాయికాట్ చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరైనప్పటికీ, తనను అయిదు నిమిషాలకన్నా ఎక్కువ మాట్లాడనివ్వలేదని నిరసన తెలుపుతూ వాక్ అవుట్ చేసారు.

కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ ఎల్లప్పుడూ వివాదాస్పదమే అయినప్పటికీ, అత్యధిక రాష్ట్రాలు, కేంద్రం తన వద్ద అధికంగా వనరులు అట్టే పెట్టుకుని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులలో కోతలు పెడుతున్నదని భావిస్తున్నాయి. అంతేకాదు, రాష్ట్రాల మధ్య వివక్షత చూపుతున్నట్టుకూడా భావించడం జరుగుతున్నది. ఈ ఆరోపణకు ప్రధానమైన కారణాలు మూడు. మొదటిది, ఫైనాన్స్ కమిషన్ సభ్యులలో ఎక్కువమంది తటస్థంగా ఉండేవారు కాక కేంద్రానికి మద్దతుగా నిలిచేవారు అవడం. ఫైనాన్స్ కమిషన్ సభ్యులను కేంద్రమే ఏకపక్షం నియమిస్తుండడం. రెండు, కేంద్రం అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాలకు వత్తాసుపలికే రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేస్తున్నామని అంటూ, నిధులు కేటాయింపులో వివక్ష చూపడం. కేంద్రం అనుసరిస్తున్న విధానాలనే రాష్ట్రాలు అనుసరించాలని ఫైనాన్సు మిషన్ వత్తిడి చేయడం. ఉదాహరణకు విద్యుత్ రంగ సంస్కరణలు. 'వ్యాపారాలను సులభతరం చేయడం' అనే పేరు మీద రాష్ట్రాలు, కేంద్ర విధానాలనే అమలు చేయాల్సిన పరిస్థితి. మూడవది, కేంద్రం చేస్తున్న వసూళ్ళలో పన్ను భాగం కన్నా సెస్ భాగం, సర్ ఛార్జ్ భాగం పెంచుకుంటూ పోవడం. ఈ వసూళ్ళలో రాష్ట్రాలకు వాటా లేకపోవడం. నిజానికి వసూలు చేసిన సెస్‌లు ప్రత్యేకమైన ఖర్చులకు వినియోగించాల్సి ఉంటుంది. కానీ కేంద్రం ఏ నాడూ ఆ ఖర్చుల వివరాలను తెలియచేయ లేదు. సెస్ వసూలు చేసిన రంగాలలో ఖర్చు చేస్తున్న దాఖలాలూ లేవు. పైగా ఈ వసూళ్లు, మొత్తం కేంద్రం చేస్తున్న పన్ను వసూళ్ళలో ఐదో వంతు ఉంటున్నది. అంటే, రాష్ట్రాలతో పంచుకోవాల్సిన వనరులను తగ్గించుకుంటూ పోతున్నది. అందువలనే 15వ ఆర్ధిక కమిషన్ మొత్తం వనరులలో రాష్ట్రాలకు 43%వాటా ఇవ్వాలని సిఫారసు చేసినా, 32% మాత్రమే పంచారు. ప్రతి ఫైనాన్స్ కమిషన్ ఈ విషయాన్ని గ్రహించి నప్పటికీ దాన్ని సరిచేసే చర్యలు ఏవీ తీసుకోలేదు.

కేంద్ర రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదం ఇదొక్కటే కాదు. రాజ్యాంగంలోని 293(3) అధికరణం ప్రకారం రాష్ట్రాలు పాత అప్పులు ఉండగా కొత్త అప్పులు చేయాలంటే కేంద్రం అనుమతి తీసుకోవాలి. రాష్ట్రాలకు ఇదో సంకటంగా తయారయింది. రాష్ట్రాలకు పాత అప్పులు ఎప్పుడూ ఉండనే ఉంటాయి. కాబట్టి వాస్తవంలో రాష్ట్రాలు ఏ కొత్త అప్పులు చేయాలన్నా కేంద్రం అనుమతి తప్పనిసరి. ద్రవ్య క్రమబద్ధత పేరుమీద రాష్ట్రాలు తమ స్థూల జాతీయ ఉత్పత్తిలో పరిమితంగా అప్పులు చేయగలుగుతున్నాయి. దీనిని విత్త బాధ్యత, బడ్జెట్ యాజమాన్య చట్టం అమలు అంటున్నారు. ఈ నిబంధనల వలన రాష్ట్రాల ఆధీనంలోని ఏ సంస్థ అప్పులు చేయాలన్నా రాష్ట్రం చేసిన మొత్తం అప్పులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటున్నది కేరళ ప్రభుత్వం, కేరళ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్ బోర్డు అప్పు తెచ్చుకోవాలంటే, ఆ ప్రభుత్వం చేసిన అప్పులన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, అప్పు తీసుకోగల పరిమితులు దాటినట్టు చెప్పడం ద్వారా ఈ విషయంలో వివాదం మొదలయింది. కారణం, ఈ సంస్థలు చేసిన అప్పులుతీర్చడానికి -అసలు, వడ్డీ కూడా- ప్రభుత్వం తన బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తుంది. పోనీ అప్పులు చేయడానికి కేంద్రం ఇదే సూత్రాన్ని అనుసరిస్తున్నదా అంటే, లేదు. అందువలన కేవలం రాష్ట్రాలు మాత్రమే నిధులు అందుబాటులో లేక ఇబ్బందులు పడవలసి వస్తున్నది. ఇది రాష్ట్రాల అభివృద్ధికి ఆటంకంగా మారింది. రాష్ట్రాలు క్రమశిక్షణ పేరుతో తమ గొంతు నులుముతున్నట్టు భావిస్తున్నాయి.

కేరళ రాష్ట్రం తన బడ్జెట్‌లో అధిక మొత్తాలను, సామాజిక బాధ్యతగా సంక్షేమానికి కేటాయిస్తుంది. ఇటువంటి పరిమితులు పెట్టడం వలన రాష్ట్రం తాను అనుసరిస్తున్న సంక్షేమ పథకాలను

> ❝ ఈ విషయంపై కోర్టు పదునైన పదాలతో ఇలా వ్యాఖ్యానించింది. "భారతదేశ సమాఖ్య విధానం సమతుల్యంగా లేదు. కేంద్రం వైపు మొగ్గు చూపుతున్నది. దానర్థం బలమైన కేంద్రం ఉండాలని. బలమైన కేంద్ర ప్రభుత్వం ఉండాలని. కానీ అది బలహీనమైన రాష్ట్రాలు ఏర్పడడానికి కారణం అవుతున్నది. భారతదేశంలోని రాష్ట్రాలు రాజ్యాంగ పరిధిలో సార్వభౌమాధికారాలు కలిగి ఉన్నాయి. వాటికి చట్ట బద్ధత ఉంది..." ❞

కొనసాగించలేని దుస్థితి ఏర్పడింది. అందు వలన రాష్ట్ర ముఖ్య మంత్రి తన క్యాబినెట్ మంత్రులతో కలిసి ఢిల్లీ వీధులలో నిరసనలు తెలపవలసి వచ్చింది. ఆ నిరసనలు ప్రతిపక్షాల మద్దత్తు కూడగట్ట గలిగాయి.

సంక్షోభం తీవ్రతరమవడానికి మరో రెండు కారణాలు కూడా ఉన్నాయి. ఒకటి. జిఎస్‌టి అమలుకు ముందు రాష్ట్రాలలో వసూలయిన పరోక్ష పన్నులకంటే జిఎస్‌టి అమలు తరువాత ఏటా కనీసం 14 % పెరుగుదల ఉంటుందని వేసిన అంచనా తప్పడం. రాష్ట్రాలు వసూలు చేసిన పరోక్ష పన్నుల కంటే జిఎస్‌టి వలన తక్కువ వసూలైతే ఆ లోటును కేంద్ర సెస్ ద్వారా అయిదేళ్ల పాటు భర్తీ చేస్తుందని కేంద్రమిచ్చిన మాట నిలుపుకోక పోవడం, రాష్ట్రాలు ఎన్ని సార్లు ఎంతగా కోరినా, కేంద్రం రాష్టాల వాటాను పెంచక పోవడం. ఇందువలన రాష్ట్రాలు నష్టపోతున్నాయి. జిఎస్‌టి అమలుతో రాష్ట్రాలు, తాము వసూలు చేసుకునే ఎన్నో పన్నులను వదులు కున్నాయి.అవి ఇప్పుడు కేంద్రం పరిధిలోకి వచ్చాయి. పైగా ఇప్పుడు ఫైనాన్స్ కౌన్సిల్ సభ్యులలో అత్యధికులు కేంద్రం చెప్పుచేతలలో ఉండేవారు. రెండోది, కేంద్రం రాష్ట్రాలకు అందించే నిధులలో అత్యధిక శాతం కేంద్రం స్పాన్సర్ చేసిన పథకాలకు సంబంధించినవి. వాటికే కేంద్రం కేటాయింపులు చేస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వాలను- ముఖ్యంగా బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలను తన గుప్పెట్లో పెట్టుకోడానికి ఈ పథకాలకు నిధుల విడుదల ఒక అస్త్రంగా వాడుకుంటున్నది . కేంద్రం చెప్పే 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఈ రకమైన గుప్పట్లో పెట్టుకోడంలో భాగమే. కొత్తగా ఏర్పడిన కేంద్ర ప్రభుత్వానికి బీహార్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల మద్దత్తు అవసరం ఎంతయినా ఉంది. అందువలన ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాల నిధులలో మరింత కోతలు పడే అవకాశాలు ఉన్నాయి. పైగా కేంద్రం నిధులిచ్చే పథకాలకు కేంద్రం పేర్లే ఉంటాయి. ప్రధానమంత్రి పేరుమీదో, మరో కేంద్రం సూచించిన వారి పేరు మీదో ఉంటాయి. వారు ఆ పేర్లను ఉపయోగించకపోతే నిధుల కేటాయింపులు దక్కవు. రాష్ట్రాలలో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్రంలో పాలిస్తున్న పార్టీ వలన జరుగుతున్నదని చూపే ప్రయత్నం ఇది.

ఇవన్నీ కలిసి రాష్ట్రాల ఆర్థిక ప్రతిపత్తి గొంతు నులిమేశాయి. 2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వానికి, రాష్ట్రాలకు ఎన్నికల సందర్భంలో, దేశ వనరుల పంపిణి విషయంలో స్పర్ధలు తలెత్తాయి. 2014 తరువాత రాష్ట్ర ప్రభుత్వాలకు చట్ట బద్ధంగా ఇవ్వ వలసిన వాటాలను కేంద్రం ఇవ్వకుండా ఓటర్ల దృష్టిలో రాష్ట్ర ప్రభుత్వాలను చులకన చేయడం వలన రాష్ట్ర, కేంద్రాల మధ్య స్పర్ధలు పెరిగాయి. ప్రధానంగా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్రం వివక్షత చూపుతున్నది. ఇప్పుడు ఏర్పడిన 16వ ఫైనాన్స్ కమిషన్‌కి చేసిన సూచనలు, వాటి అమలు కోసం నియమించ బడిన ప్రభుత్వం పట్ల సానుకూల వైఖరి గల "నిపుణుల" ను పరిశీలించినపుడు కేంద్రం, రాష్ట్రల పట్ల చూపే ఈ వివక్షతకి చట్టబద్ధత కల్పించే ధోరణి కనిపిస్తున్నది.

అయితే యుద్ధం ఇంకా ముగియలేదు. కేరళ ప్రభుత్వం, కేంద్రం రాష్ట్రాలు తెచ్చుకునే అన్ని రకాల అప్పులపై పరిమితులు విధించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు నమోదు చేసింది. ఇది రాజ్యాంగంలోని 293 అధికారణాన్ని ఉల్లంఘిస్తున్నదని వాదించింది. జిఎస్‌టి వసూలు చేయడం, దాని వలన రాష్ట్రాల వనరుల సమీకరణలో ఏర్పడిన పర్యవసానాలు, రాజ్యాంగం ప్రకారం దేశ వనరులలో రాష్ట్రాలకు దక్కవలసిన న్యాయబద్ధమైన వాటాలు, రాష్ట్రలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాల తీవ్రత, కోర్టుల దృష్టికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ మధ్య సుప్రీం కోర్టులో, 35 ఏళ్ల నాటి ఒక కేసులో, తన సహజ వనరులపై కేంద్రం విధించే రాయాలిటీ పై సెస్ విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని తీర్పు ఇవ్వడంతో, తమకు కొంత ఊరట దొరికే అవకాశాలు ఉన్నాయని రాష్ట్రాలు భావిస్తున్నాయి. అత్యున్నత న్యాయస్థానం రాయల్టీ పన్ను కాదని, 'ప్రతిఫల ఒప్పందం' అని, రాయల్టీపై వేసే సెస్ పన్ను అని పేర్కొనింది. మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్మెంట్ అండ్ రెగులేషన్ ) చట్టం 1957 ప్రకారం, కేంద్రానికి రాయల్టీ విధించే హక్కు ఉంది. కానీ రాష్ట్రాలకు పన్నులు వేసే హక్కు ఉంది. రాజ్యాంగం రాష్ట్రాలకు భూమి, భవనాల పై పన్నులు వేసుకునే హక్కును కల్పించింది. అయితే దాని మరింత పొడిగించే అవకాశం ఉన్నది.

ఈ విషయంపై కోర్టు పదునైన పదాలతో ఇలా వ్యాఖ్యానించింది. "భారతదేశ సమాఖ్య విధానం సమతుల్యంగా లేదు. కేంద్రం వైపు మొగ్గు చూపుతున్నది. దానర్థం బలమైన కేంద్రం ఉండాలని. బలమైన కేంద్ర ప్రభుత్వం ఉండాలని. కానీ అది బలహీనమైన రాష్ట్రాలు ఏర్పడడానికి కారణం అవుతున్నది. భారతదేశంలోని రాష్ట్రాలు రాజ్యాంగ పరిధిలో సార్వభౌమాధికారాలు కలిగి ఉన్నాయి. వాటికి చట్ట బద్ధత ఉంది. అవి రాజ్యాంగం వాటికి దఖలు పరిచిన బాధ్యతలు ఎంతో కొంత మేరకు స్వతంత్రంగా నిర్వహించుకోగల స్థితిలో ఉండాలి. రాజ్యాంగం కల్పించిన ఫెడరల్ స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకుని చట్టాలను అన్వయించుకోవాలి. రాజ్యాంగ కోర్టు, రాష్ట్ర శాసన సభలు తమ నిర్దిష్ట పరిధులలో పనిచేయుగలగాలి. ఆ మేరకు కేంద్రం అదుపాజ్ఞలు వాటిపై ఉండాల్సిన అవసరం లేదు."

ఇటువంటి భూమికలో పార్లమెంటులో జరిగే ఓటింగ్‌లో మొగ్గు ఎటువైపు ఉంటుందో చూడాలి. ప్రతి పక్షాలు ఉత్తేజంగా పార్లమెంటులో తమ గళం వినిపించడం వలన, సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ,కేంద్ర-రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీలో, ఇతర అనేక అంశాలలో ఉన్న అసమతుల్యతను కొంతవరకైనా సమతుల్యం చేస్తుందేమో చూడాలి.

**(అనువాదం: కె. ఉషారాణి)**

**జాతీయ పరిణామాలు**

# అక్రమాల ఊబిలో సెబి ఛైర్మన్

**ఎ కోటిరెడ్డి**



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

నయా-ఉదారవాద యుగంలో పెట్టుబడిదారులు, ప్రభుత్వం, ఉన్నతాధికారులు కలిసి ఏ విధంగా అక్రమాలకు పాల్పడతారో, ప్రజల డబ్బును కొల్లగొడతారో 'సెబి' ఛైర్మన్ మాధబిపురి బచ్‌పై వచ్చిన ఆరోపణలు స్పష్టం చేస్తున్నాయి. అదాని సంస్థల వాటాల ధరలను కృత్రిమంగా పెంచటం కోసం అదాని సోదరుడు మారిషస్‌లో ఏర్పాటు చేసిన షెల్ కంపెనీలో సెబి ఛైర్మగా ఉన్న మాధబిపురి పెట్టుబడులు పెట్టారని, సింగపూర్, భారతదేశంలో ఉన్న కన్సల్టెన్సిలలో ఆమెకు వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ షార్ట్ సెల్లింగ్ సంస్థ ఆరోపణలు చేసింది. తద్వారా సెబి ఛైర్మన్‌గా ఉన్న మాధబిపురి అక్రమంగా ప్రయోజనం పొందారని హిండెన్‌బర్గ్ చెప్పింది. అదాని కంపెనీల షేర్ల ధరలు కృత్రిమంగా పెంచటం ద్వారా అక్రమంగా లాభాలు సంపాదించటానికి మారిషన్‌లోని షెల్ కంపెనీలను వినియోగిస్తున్నారు. అదాని సంస్థలో మారిషస్‌లోని షెల్ కంపెని వాటాలు కొనుగోలు చేయటంపై సెబి విచారణ జరుపుతున్న కాలంలోనే, 2016-17 సంవత్సరంలో మాధబిపురి మారిషస్ షెల్ కంపెనీలో పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ ఆరోపించింది.

దేశ స్టాక్ మార్కెట్ రెగ్యులేటరి సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) ఛైర్మన్ మాధబిపురి బచ్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చి అండ్ షార్ట్ సెల్లింగ్ సంస్థ చేసిన ఆరోపణల తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆ ఆరోపణలపై విచారణ జరిపించి ఉండాల్సింది. ఆరోపణల్లో వాస్తవం ఉందని విచారణలో వెల్లడైతే సెబి ఛైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి. తప్పని తేలితే ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించి, హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ అబద్ధాలను ప్రచారం చేస్తున్నదని, స్టాక్‌మార్కెట్‌కు నేతృత్వం వహిస్తున్న వ్యక్తి విశ్వసనీయతను దెబ్బతీయటానికి ప్రయత్నం చేస్తున్నదని రుజువు చేయాలి. అలా చేస్తే సెబిపైనా, ప్రభుత్వంపైనా ప్రజలకు విశ్వాసం పెరిగేది. కానీ, ప్రజలలో పెరుగుతున్న సందేహాలను నివృత్తి చేయటం కోసం ఆర్థికమంత్రి లేదా ఇతర మంత్రులు ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఆరోపణలపై విచారణకు కమిటీని నియమించే అంశం గురించి ఎక్కడా ప్రస్తావించటం లేదు.

హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ చేసిన ఆరోపణలకు అదాని కంపెని స్పందన సందేహాలను తీర్చేదిగా లేదు. అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేస్తే వాటిని తిప్పికొట్టటానికి అవసరమైన సమాచారాన్ని వెల్లడించటానికి, తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవటానికి అదాని సంస్థలు పూనుకోలేదు. తమ కంపెనీని అస్థిరపరచటానికి, దేశంలోని ప్రభుత్వాన్ని రాజకీయంగా అపఖ్యాతి పాలు చేయటానికి ప్రయత్నిస్తున్నారని అదాని గ్రూపు హిండెన్‌బర్గ్ సంస్థపై ప్రత్యారోపణలు చేసింది. అసలు విషయాన్ని వదిలివేసి, చేసిన ప్రత్యారోపణలలో కూడా ఏ మాత్రం పసలేదు. తమ కంపెనీయే భారతదేశం అన్నట్లుగా అదాని సంస్థ ప్రత్యారోపణలు ఉన్నాయి. ఒక కంపెనిపై వస్తున్న ఆరోపణలు, నిర్వహణ లోపాలు ఆ కంపెనీకి మాత్రమే సంబంధించినవి అవుతాయి. ఆ కంపెనీ అక్రమాలకు పాల్పడిందని రుజువైతే దాని ప్రతిష్ఠ పోతుంది. అటువంటి కంపెనిపై తగిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ ప్రతిష్ఠ కూడా పోతుంది. సక్రమంగా వ్యవహరిస్తే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం పెరుగుతుంది.

మోడి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అదాని గ్రూపు కంపెనీల పెరుగుదల అసాధారణంగా ఉంది. మోడి అధికారంలోకి వచ్చేనాటికి అదాని కంపెనీల విలువ 500 కోట్ల డాలర్లు-41,500 కోట్ల రూపాయలు-గా ఉంది. అదాని దేశంలోని శత కోటీశ్వరులలో 11వ స్థానంలో ఉన్నాడు. 2022 ప్రారంభం నాటికి అదాని కంపెనీల సంపద 9,000 కోట్ల డాలర్లు-74.4 లక్షల కోట్ల రూపాయలు-గా ఉన్నది. హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ మొదటిసారి అదాని అక్రమాలను బయటపెట్టిన తర్వాత షేర్ల విలువ పడిపోయింది. అదే సంవత్సరం ఏప్రిల్ నాటికి 43,300 కోట్ల డాలర్లు-33.5 లక్షల కోట్ల రూపాయలు-కు విలువ తగ్గింది. అదాని అక్రమాలను కప్పిపెడుతూ కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థకు పూర్తి మద్దతు ఇస్తుండటంతో కొద్దికాలం తర్వాత తిరిగి షేర్ల విలువ పెరగటం ప్రారంభమైంది. తాజాగా హరూన్ సంస్థ వెల్లడించిన శతకోటీశ్వరుల జాబితాలో ముఖేశ్ అంబానిని అధిగమించి, అదాని భారతదేశ పెట్టుబడిదారులలో మొదటి స్థానానికి చేరారు.

### హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ ఆరోపణలు-వాస్తవాలు

హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ చేసిన ఆరోపణలపై విచారణ జరగలేదు. వాస్తవాలేమిటో వెల్లడి కాలేదు. ప్రధాని మోడితో అదానికున్న సాన్నిహిత్యం, అనేక అంశాలలో, చివరికి కొన్ని విదేశాలతో చేసుకుంటున్న ఒప్పందాలలో కూడా అదానికి ప్రయోజనం కలిగించేలా నిబంధనలు రూపొందించటంతో అదాని సంస్థలలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించటం లేదు. కాబట్టి అదానిపై వచ్చిన ఆరోపణలపై జరిగే విచారణను ప్రజలు విశ్వసించాలంటే స్వతంత్ర సంస్థ చేత దర్యాప్తు జరిపించాలి.

> **❝ ఈ సెప్టెంబరు నెలలో షేర్ల అమ్మకం ద్వారా 8,300 కోట్ల రూపాయలు-బిలియన్ డాలర్లు- సమీకరించాలని అదాని ఎంటర్‌ప్రైజెస్ ప్రయత్నాలు చేస్తున్నది. అదాని ఎనర్జీ ఆగస్టు నెలలోనే అమెరికాలోని కొనుగోలు దారులు, ప్రభుత్వ నిర్వహణలోని ఫండ్‌ల నుండి 100 కోట్ల డాలర్లు సమీకరిం చింది. దేశ, విదేశీ కొనుగోలుదారుల నుండి మరింత డబ్బును వసూలు చేయటానికి ముందే సెబి ఈ ఆరోపణల నిగ్గు తేల్చాలి. ❞**

కార్పొరేట్ సంస్థల చరిత్రలోనే అతి పెద్ద మోసానికి అదాని సంస్థ పాల్పడుతున్నదని హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ 2023, జనవరిలో మొదటి సారి ఆరోపించింది. హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలన్నింటినీ అదాని గ్రూపు తిరస్కరించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపమని సుప్రీంకోర్టు సెబిని ఆదేశించింది. రెగ్యులేటరి వ్యవస్థలో ఏవైనా లోపాలు జరిగాయా అన్న అంశాన్ని పరిశీలించటం కోసం ఒక నిపుణుల కమిటిని నియమించింది. రెగ్యులేటరీ వ్యవస్థలు వైఫల్యం చెందాయని నిర్ధారించటానికి ఎటువంటి సాక్ష్యాలు లేవని నిపుణుల కమిటి సుప్రీంకోర్టుకు తెలిపింది. నివేదికలను పరిశీలించిన తర్వాత, మరిన్ని దర్యాప్తులను అదాని గ్రూపు ఎదుర్కోవాల్సిన అవసరం లేదని, సెబి చేస్తున్న దర్యాప్తు సరిపోతుందని ఈ సంవత్సరం జనవరిలో సుప్రీంకోర్టు చెప్పింది. కానీ, ప్రస్తుతం వచ్చిన కొత్త ఆరోపణలు, వాటిపై సందేహాలు ముసురు కొంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు గతంలో తాను నియమించిన కమిటీని పునరుద్ధరించటం లేదా కొత్త కమిటీని నియమించి తిరిగి దర్యాప్తు చేయించాలి. సెబి ఛైర్మన్ చట్ట విరుద్ధంగా లాభాలు పొందుతున్నదా అన్న అంశంపై వాస్తవాలను నిగ్గుదేల్చాలి.

**సెబి ఛైర్మన్ అక్రమలబ్ధి పొందినట్లు రుజువులు**

సెబి ఛైర్మన్ మాధబిపురి బచ్ సింగపూర్‌లో నివసించేటపుడు 2015లో తన భర్త బాల్య స్నేహితుడు నడుపుతున్న ఫండ్‌లో పెట్టుబడులు పెట్టానని చెప్పారు. దేశదేశాలలోని సంస్థలలో పెట్టుబడులు పెట్టటం కోసం సాలెగూడులాగా అల్లుకుపోయిన సంస్థలలో ఒకటి ఆ సంస్థ. గౌతమ్ అదాని సోదరుడు వినోద్ అదాని భాగస్వాముల నుండి ఆ సంస్థకు డబ్బులు అందేవని ఇతరులతో పాటు ఫైనాన్షియల్ టైమ్స్ చేసిన దర్యాప్తులో కూడా వెల్లడైంది. ఈ విధమైన రహస్య నెట్‌వర్క్ ద్వారా అదాని, భాగస్వాములు విస్తారమైన సామ్రాజ్యాన్ని నిర్మించారు. తమ సంస్థలలో షేర్లు కొన్నవారిలో తమ కుటుంబాలకు చెందిన వారు లేరని వారు పదే పదే చెబుతుంటారు. మాధబిపురి భర్త స్నేహితుడు అదాని కంపెని డైరెక్టర్‌గా ఉన్నారు. సెబి ఛైర్మన్ ఆయన ద్వారా పెట్టుబడులు పెట్టి ప్రయోజనం పొందారనేది ఆరోపణలలో కీలకమైనది. సెబిలోని సహచరులు కొందరు ఆమెకు మద్దతు తెలియజేయటం కోసమంటూ వెల్లడించిన అంశాలు సందేహాలను మరింత పెంచేవిగా ఉన్నాయి.

హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ తాజా ఆరోపణలు చేసిన తర్వాత తాను అన్ని నిబంధనలను అమలు జరిపానని మాధబి పురి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటికి ఈ పెట్టుబడుల విషయం గతంలోనే తెలిసివున్నట్లైతే ఇపుడు ఈ ఆరోపణలపై స్పందించాల్సిన అవసరం లేదు. కాని ఈ అంశం ఇప్పుడు వెల్లడైంది. కాబట్టి 2017లో సెబి సభ్యురాలిగా, 2022లో ఛైర్మన్‌గా నియమితు రాలైనందున, ఫైళ్ళను పరిశీలించి, ఆమె నిబంధనలను సక్రమంగా పాటించారా, అవసరమైన అంశాలను సకాలంలో వెల్లడించారా, నిజాయితీగా వ్యవహరిం చారా అన్న అంశాలను నిపుణుల కమిటి వెల్లడించాలి. వ్యవస్థలపై విశ్వసనీయత ఉండాలంటే ఉన్నత స్థానాలలో ఉన్నవారు తమపై వచ్చిన ఆరోపణలపై సక్రమంగా, సకాలంలో స్పందించాలని అనేకమంది నిపుణులతో పాటు సెబి మాజి ఛైర్మన్ చంద్రశేఖర్ భావే చెప్పాడు.

మాధబిపురి కేవలం అదాని సంస్థలలో పెట్టుబడులు పెట్టారనే అంశానికి మాత్రమే హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ పరిమితం కాకుండా, సెబి ఛైర్మన్‌కు సింగపూర్‌లో ఒకటి, ఇండియాలో మరొకటి, మొత్తం రెండు కన్సల్టెన్సీలు ఉన్నాయన్న అంశాన్ని కూడా వెల్లడించింది. ఆమెను సెబి ఛైర్మన్‌గా నియమించిన రెండు వారాల తర్వాత సింగపూర్‌లోని కన్సల్టెన్సీని తన భర్త పేరుతో ట్రాన్స్‌ఫర్ చేసినట్లు సెబికి తెలిపింది. కాని భారతదేశంలోని కన్సల్టెన్సీలో 99 శాతం వాటాలు ఆమె పేరుతోనే ఉన్నాయి. ప్రస్తుతం తన భర్త కన్సల్టెన్సీని నడుపుతూ, దేశంలోని ముఖ్యమైన పరిశ్రమలకు చెందిన ఖాతాదారులతో వ్యవహరిస్తున్నాడని ఆమె చెబుతున్నారు. కాబట్టి సెబి ఛైర్మన్‌గా ఉంటూ కన్సల్టెన్సీ ద్వారా ఆదాయం పొందటానికి–ఒకే సమయంలో విభిన్నమైన లాభాలను పొందటానికి– ఆమెను ఎలా అనుమతించారన్న విషయాన్ని ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించాల్సి ఉంది.

ఈ సెప్టెంబరు నెలలో షేర్ల అమ్మకం ద్వారా 8,300 కోట్ల రూపాయలు–బిలియన్ డాలర్లు– సమీకరించాలని అదాని ఎంటర్‌ప్రైజెస్ ప్రయత్నాలు చేస్తున్నది. అదాని ఎనర్జీ ఆగస్టు నెలలోనే అమెరికాలోని కొనుగోలు దారులు, ప్రభుత్వ నిర్వహణలోని ఫండ్‌ల నుండి 100 కోట్ల డాలర్లు సమీకరించింది. దేశ, విదేశీ కొనుగోలుదారుల నుండి మరింత డబ్బును వసూలు చేయటానికి ముందే సెబి ఈ ఆరోపణల నిగ్గు తేల్చాలి. గత ఆరు నెలలలోనే కోటిమంది కొత్తగా షేర్ మార్కెట్లోకి ప్రవేశించారు. మొత్తం 10 కోట్లమంది ప్రజలు షేర్ మార్కెట్ లావాదేవీలలో పాల్గొంటున్నారు. దేశంలోని మ్యూచ్యువల్ ఫండ్స్ అదాని కంపెనీలలో 40,000 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాయి. ఇదంతా సాధారణ ప్రజల డబ్బే. ప్రజల డబ్బుకు భద్రత కల్పించాల్సిన బాధ్యత సెబికి, ప్రభుత్వానికి ఉన్నాయి. ఇంత బృహత్తరమైన బాధ్యతను నిర్వర్తించాల్సిన సెబి ఛైర్మన్‌పై వచ్చిన ఆరోపణలను పట్టించుకోక పోవటం అంటే దేశ, విదేశాల్లో ఉన్న సామాన్య షేర్ల కొనుగోలుదార్లకు ద్రోహం చేయటమే అవుతుంది. కాబట్టి ప్రభుత్వం సత్వరమే విచారణ జరిపి, ఆరోపణలు రుజువైతే సెబి ఛైర్మన్‌పై చర్యతీసుకోవాలి. సెబిని సక్రమంగా పనిచేయించాలి. దానిపై విశ్వసనీయతను పునరుద్ధరించాలి.

**ఫిరాయింపులు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఎన్నికలలో ఓడిపోయి అధికారం కోల్పోయిన పార్టీల నుండి అధికార టిడిపి, కాంగ్రెస్, బిజెపిలలోకి ఎంఎల్‌ఎలు, ఎంపిలు ఫిరాయిస్తున్నారు. కొందరు ఇప్పటికే చేరిపోగా, మరికొందరు మార్గం సుగమం చేసుకొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు వైసిపి రాజ్యసభ సభ్యులు తమ రాజ్యసభ సభ్యత్వానికి, వైసిపికి రాజీనామా చేశారు. వారు టిడిపిలో చేరతారని ప్రచారం జరుగుతున్నది. కొందరు

> **"తెలంగాణలో బిఆర్ఎస్ అధికారం కోల్పోవటంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. గతంలో బిఆర్ఎస్ కూడా ఇలాగే చేసింది కాబట్టి తాను చేయటంలో తప్పులేదని కాంగ్రెస్ అంటున్నది. వీలైతే కాంగ్రెస్‌లో చీలిక తీసుకువచ్చి, అధికారాన్ని చేపట్టటానికి బిజెపి కాచుకుని కూర్చున్నది. ప్రజల తీర్పుతో నిమిత్తం లేకుండా ఫిరాయింపులను ప్రోత్సహిం చటం, శాసనసభ్యులను కొను గోలు చేయటం, ప్రజల తీర్పును వమ్ము చేయటం ద్వారా అధికారాన్ని చేపట్టటంలో బిజెపి ఆదిగురువుగా ఉన్నది."**

ఎంఎల్ఎలు, నాయకులు కూడా వైసిపి నుండి టిడిపిలో చేరనున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. అక్కడక్కడా టిడిపి నాయకులు కూడా తాము గేట్లెత్తితే వైసిపి ఖాళీ అవుతుందని చెబుతున్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నపుడు టిడిపి తరఫున గెలిచిన వారు కొందరు వైసిపిలో చేరారు. అధికారాన్ని వినియోగించుకొని వ్యాపారాలు, కాంట్రాక్టులు, వివిధరకాలుగ ఆర్థిక లబ్ధి పొందాలని వివిధ బూర్జువా పార్టీలలో చేరుతున్న వారికి తాము ఉన్న పార్టీ ఎన్నికలలో ఓడిపోతే సంపాదించుకోవటం కోసం తిరిగి ఎన్నికలు వచ్చే వరకు, ఐదు సంవత్సరాలు వేచి చూసే ఓపిక ఉండటం లేదు. అంత 'నష్టాన్ని' భరించటానికి వారు ఏ మాత్రం సిద్ధం కాదు. అందువలననే అధికార పార్టీలోకి ఆంధ్ర, తెలంగాణలలో ఫిరాయింపులు జరుగుతు న్నాయి. 2019లో అధికారం కోల్పోయిన తర్వాత టిడిపి రాజ్యసభ సభ్యులు మొత్తంగా బిజెపిలోకి ఫిరాయించారు. గత నాలుగు సంవత్సరాలకు పైగా టిడిపికి రాజ్యసభలో ఒక్క సభ్యుడు కూడా లేదు. ఇప్పుడు వైసిపి అధికారం కోల్పోయింది కాబట్టి అదే స్థితి ఆ పార్టీకి ఏర్పడినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

తెలంగాణలో బిఆర్ఎస్ అధికారం కోల్పోవటంతో ఆ పార్టీ ఎంఎల్ఎలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. గతంలో బిఆర్ఎస్ కూడా ఇలాగే చేసింది కాబట్టి ఇప్పుడు తాము చేయటంలో తప్పులేదని కాంగ్రెస్ అంటున్నది. వీలైతే కాంగ్రెస్‌లో చీలిక తీసుకువచ్చి, అధికారాన్ని చేపట్టటానికి బిజెపి గోతికాడ నక్కలాగా కాచుకుని కూర్చున్నది. ప్రజల తీర్పుతో నిమిత్తం లేకుండా ఫిరాయింపులను ప్రోత్సహించటం, శాసనసభ్యులను కొనుగోలు చేయటం, ప్రజల తీర్పును వమ్ముచేయటం ద్వారా వివిధ రాష్ట్రాలలో అధికారాన్ని చేపట్టటంలో బిజెపి ఆదిగురువుగా ఉన్నది.

బూర్జువా రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న అవకాశవాద విధానాలను తిప్పికొట్టాలి. ఆ పార్టీల నాయకులు సిద్ధాంతాలు, విలువలు, సూత్రాలు, నీతి నియమాల గురించి పట్టించుకోవటం లేదు. అధికారం సంపాదించటం, అధికారం వచ్చిన తర్వాత ధనాన్ని సాధించటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆ విధంగా అధికారం ఉంటే డబ్బు కోసం, డబ్బు ఉంటే అధికారం కోసం అంగలారుస్తున్నారు. దీనిలో ప్రజలకు స్థానం లేదు. ఎన్నికలలో ఓట్లు వేయటంతోనే ప్రజల పాత్ర ముగిసిందని, మళ్ళీ ఎన్నికలు వచ్చే వరకు తమ ఇష్టం వచ్చినట్లు చేయవచ్చునని బూర్జువా పార్టీల నాయకులు, ఎన్నికైన ప్రతినిధులు భావిస్తున్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న తరం కనుమరుగు కావటం, దేశంలో సరళీకరణ విధానాల అమలు, ప్రజలను రాజకీయ రహితం చేయటానికి దశాబ్దాల తరబడి బడా పెట్టుబడిదారులు, బూర్జువా రాజకీయ పార్టీలు చేసిన ప్రచారం, పాలక పార్టీలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకతను అధిగమించటానికి కుల, మత, ప్రాతీయ, భాషా వివాదాలను, అభివృద్ధి నిరోధక భావాలను పెంపొందించటం తదితరాల వలన అవకాశవాదులకు ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఇవి కమ్యూనిస్టు, అభ్యుదయ పార్టీలు, సంస్థలు, ప్రజా ఉద్యమాలపై ప్రభావం చూపుతున్నాయి.

ప్రజలు కేంద్రంగా పనిచేసే, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పార్టీలు, సంస్థలు, ఉద్యమాలు ముందుకు రావటం ద్వారానే ఇటువంటి పరిస్థితులను మార్చగలం. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలను ప్రచారం చేయాలి. విలువలకు కట్టుబడేవారు ప్రజా నాయకులుగా ఎదిగి, ప్రజల అభిమానాన్ని చూరగొనాలి. కమ్యూనిస్టు, అభ్యుదయ భావాలను, అభివృద్ధికి దోహదం చేసే విధానాలను ప్రజల వద్దకు తీసుకువెళ్ళాలి. వారి మద్దతు సంపాదించాలి. అప్పుడు మాత్రమే సరళీ కరణ విధాన ప్రభావాలను, అవకాశవాద, ఫిరాయింపు రాజకీయాలను వెనక్కు కొట్టగలం.

❄

# కొత్త క్రిమినల్ చట్టాలు : ప్రజా హక్కులు

**(12వ పేజీ తరువాయి)**

విషయంలో నూతనంగా తీసుకువచ్చిన చట్టాలు ఎటువంటి అదనపు ప్రయోజనాలను కక్షిదారులకు అదించలేకపోగా న్యాయవ్యవస్థ అధికారాలను కుదిస్తూ కార్యనిర్వహక వ్యవస్థకు అధికారాలు కట్టబెట్టడం తీవ్ర పరిణామం. కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ప్రజా ఉద్యమాలను తీవ్రంగా అణచి వెయ్యాలనే ఉద్దేశ్యంతో ప్రజల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను అములలోకి తీసుకువచ్చింది. ఇటువంటి నిరంకుశ చట్టాల అమలను తక్షణం నిలుపుదల చెయ్యాలని సుప్రీమ్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కపిల్ సిబాల్, సీనియర్ న్యాయవాది ఇందిరా జయ్‌సింగ్ ఇంకా అనేక మందిన్యాయ నిపుణులు, న్యాయవాదులు, మేధావులు, రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో చట్టాలను అమలు చేయ పూనుకున్నది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఇంకా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాల అమలను నిలుపదల చేయవలసినదిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశాయి. పలు హైకోర్టులలో కేసులను కూడా దాఖలు చేశాయి.

సహజ న్యాయ సూత్రాలకూ, సుప్రీమ్ కోర్టు వారి తీర్పులకు, మార్గదర్శకాలకు వ్యతిరేకంగా చేసిన నూతన క్రిమినల్ చట్టాల అమలును నిపుదల చెయ్యాలనీ, లా కమిషన్, బార్ కౌన్సిల్స్‌ను, న్యాయనిపుణులను ఇంకా ఇతర స్టేక్ హోల్డర్స్ అందరినీ సంప్రదించి తగు సవరణలను చేయాలనీ దేశవ్యాప్తంగా న్యాయవాదులు, న్యాయవాద సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారు. ఈ ఉద్యమంలో న్యాయవాదులు, ప్రజాతంత్ర వాదులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తేవాలి. ఆ విధ:గా పౌర స్వేచ్ఛకు, హక్కులకు విఘాతం కలిగించే కొత్త క్రిమినల్ చట్టాలను త్రిప్పికొట్టాలి.

❄

# మార్క్సిస్టు విలువల మేలి ముత్యం కామ్రేడ్ బుద్ధదేవ్

*(2వ పేజీ తరువాయి)*

బెంగాల్ ఐటి పాలసీని రూపొందించారు. రాష్ట్ర ఐటి పరిశ్రమ 70 శాతం వృద్ధిని సాధించింది. విప్రో ఛైర్మన్ అజీజ్ ప్రేమ్‌జీ.. బుద్ధదేవ్‌ను దేశంలోనే అత్యుత్తమ ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. 2006లో జరిగిన ఎన్నికల్లోనూ బుద్ధదేవ్ వామపక్ష సంఘటనకు నాయకత్వం వహించారు. వామపక్ష సంఘటన మళ్లీ ఘన విజయం సాధించింది. బుద్ధదేవ్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ఈ కాలంలో పారిశ్రామికీకరణ కోసం అలుపెరుగని కృషి చేశారు. ఈ కృషికిగాను బుద్ధదేవ్‌కు 'బ్రాండ్ బుద్ధ' అనే పేరు వచ్చింది. 2007లో పశ్చిమ మిడ్నాపూర్‌లోని నందిగ్రామ్‌లో కెమికల్ హబ్ ఏర్పాటు కోసం 95 శాతం భూ సేకరణ సజావుగానే జరిగింది. మిగతా 5 శాతం మంది భూ యజమానులకు సంబంధించిన భూములను సేకరించే విషయంలో జరిగిన చిన్నపాటి తప్పులు పెద్ద అలజడికి కారణమయ్యాయి. ఈ విషయంలో మమతా బెనర్జీ నాయకత్వంలో నిర్వహించిన నిరసనల్లో సంఘ వ్యతిరేకులు, ఓ తీవ్రవాద సంస్థకు చెందినవారు పాల్గొని హింసాత్మక ఘటనలకు ఆజ్యం పోశాయి. ఫలితంగా పోలీసులు కాల్పులు జరపగా 14 మంది మరణించారు. 2008లో సింగూరులో రతన్ టాటా నానోకార్ల ప్రాజెక్టు భూ సేకరణపై కూడా మమతా బెనర్జీ ఆనాడు చేసిన రాద్ధాంతం వల్ల ఆ ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించారు. తమ పరిశ్రమ ఏర్పాటుకూ, అభివృద్ధికీ, సంస్థలో ఉపాధి కల్పనకూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో సహకరించిందని, అయినా తమ సంస్థను కొనసాగించే పరిస్థితులు లేనందువల్ల బాధగానే బెంగాల్ వీడుతున్నానని, ఈ విషయంలో బెంగాల్ ప్రభుత్వమూ, ప్రజలూ తనను మన్నించాలని రతన్ టాటా విచారం వ్యక్తం చేశారు. నందిగ్రామ్, సింగూరు ప్రాజెక్టులు బెంగాల్ పారిశ్రామికీకరణకు ఎంతో తోడ్పడేవి అయినా.. సిపిఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష సంఘటనను కూలదోయడానికి ప్రత్యక్షంగా తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, పరోక్షంగా పీపుల్స్‌వార్.. అల్లర్లను, దుష్ప్రచారాలను సాధనాలుగా మలుచుకున్నాయి. మీడియాను తమ గుప్పెట్లో పెట్టుకొని బరితెగించి వ్యతిరేకంగా పని చేయించారు. ఫలితంగా 2011 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష సంఘటన ఓటమి పాలయింది. బెంగాల్‌లో పారిశ్రామికీకరణ ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించాలన్న బుద్ధదేవ్ లక్ష్యం నెరవేరలేదు. ఓటమిని తట్టుకొని గట్టిగా నిలబడ్డారాయన.

బెంగాల్‌లో సాంస్కృతిక సంస్థల అభివృద్ధికి, ప్రగతిశీల సాంస్కృతిక విలువలను కొనసాగించడానికి బుద్ధదేవ్ గణనీయ కృషి చేశారు. సాహిత్యం అంటే ఆయనకు వల్లమాలిన అభిమానం. ఆయన స్వయంగా కవి, నాటక రచయిత కూడా. రవీంద్రనాథ్ ఠాగూర్ పద్యాలు కంఠోపాఠంగా ఆయన నాలుకమీద ఆడుతుండేవి. అనేక అంతర్జాతీయ సాహితీ రచనలను బెంగాలీలోకి అనువదించారు. లాటిన్ అమెరికా నోబెల్ బహుమతి గ్రహీత గార్సియా, ప్రముఖ సోవియట్ కవి వ్లాదిమిర్ మయకోవ్‌స్కీ వంటి ప్రముఖుల ముఖ్యమైన రచనలను బెంగాలీలోకి అనువదించారు. చైనాలో వస్తున్న మార్పులపై ఆయన విస్తృతంగా రాశారు. ఈ అంశంపై ఓ పుస్తకాన్ని కూడా రాశారు. బుద్ధదేవ్‌ను 2022లో 'పద్మభూషణ్' పురస్కారానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆ పురస్కారాన్ని ఆయన తిరస్కరించారు.

ప్రపంచంలోనే ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై 34 సంవత్సరాలు అధికారంలో ఉన్న సిపిఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష సంఘటన ప్రభుత్వంలో 20 సంవత్సరాలపాటు మంత్రిగా, 11 సంవత్సరాలపాటు ముఖ్య మంత్రిగా పనిచేశారు బుద్ధ దేవ్. తాను 2000లో ముఖ్యమంత్రి పదవి అలంకరించిన తరువాత జరిగిన మూడు ఎన్నికల్లో (2001 అసెంబ్లీ, 2004 పార్లమెంట్, 2006 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష సంఘటనకు అద్భుత విజయాలు తెచ్చిపెట్టారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో 294 అసెంబ్లీ సీట్లకుగాను 235 స్థానాలు గెలుపొంది సంచలనం సృష్టించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క బెంగాల్ నుంచే వామపక్ష సంఘటనకు 35 స్థానాలు గెలిపించి బెంగాల్ చరిత్రలో రికార్డును లిఖించారు. ఆ యేడు సిపిఐ(ఎం) ఒక్కదానికే దేశవ్యాప్తంగా 45 స్థానాలు వచ్చాయి. ఈ రికార్డు స్థానాలు అవిభక్త కమ్యూనిస్టు పార్టీలోనూ, సిపిఐ(ఎం)లోనూ ఎప్పుడూ రాలేదు. వామపక్షాలకు మొత్తం 60 స్థానాల వరకూ వచ్చాయి. ఈ సీట్లతోనే యుపిఏకి వామపక్షాలు చాలా కాలం ఊపిరిపోశాయి.

అంకితభావం కలిగిన కమ్యూనిస్టుగా.. బుద్ధదేవ్ తన భార్య మీరా భట్టాచార్యతో కలిసి నిరాడంబరమైన జీవితం గడిపారు. వారికి సుచేతన్ భట్టాచార్య అనే కుమారుడున్నాడు. బుద్ధదేవ్ ముఖ్యమంత్రి కాకపూర్వం నుంచీ కోల్‌కతా బాలిగంజ్ పామ్ అవెన్యూలోని అపార్టుమెంటులో రెండు గదుల ఫ్లాటులో సాదాగా నివసించారు. ముఖ్యమంత్రి అయ్యాక అధికారిక నివాసంలోకి మారకుండా పూర్వం నుంచీ ఉంటున్న ఆ రెండు గదుల ఇంట్లోనే నివాసాన్ని చివరికంటా కొనసాగించారు. 30 ఏళ్లనాడు మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం సమకూర్చిన అంబాసిడర్ కారునే ముఖ్యమంత్రిగా వైదొలిగే వరకూ ఉపయోగించారు. భర్త ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ భార్య మీరా భట్టాచార్య ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేశారు. ఇప్పటి మాదిరి ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ఇచ్చేలాంటి భద్రత, రక్షణ ఆమెకు ప్రభుత్వం కల్పించలేదు. సాధారణ ఉపాధ్యాయినిలా ఆమె పాఠశాలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ట్రామ్‌ల ద్వారానే వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేవారు. ఆమె ముఖ్యమంత్రి భార్యలా ఎప్పుడూ వ్యవహరించలేదు. బుద్ధదేవ్ మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో తన జీతం మొత్తాన్ని పార్టీకి ఇచ్చి వేశారు. పార్టీ ఇచ్చిన కొద్దిపాటి అలవెన్సుతోనూ, భార్య మీరా టీచరు ఉద్యోగం ద్వారా వచ్చిన కొద్దిపాటి జీతంతోనూ వారి కుటుంబం సాగింది. బుద్ధదేవ్ సామాన్య కార్యకర్త మాదిరి వ్యవహరించేవారు. ఎప్పుడూ పచ్చి వక్కను నములుతూ ఉండేవారు. సిగిరెట్టు కాలుస్తూ.. చేతితో ఆంగ్ల నవల పట్టుకొని జనంలో సంచరించేవారు. అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం ఆయన నిరంతరం పోరాడారు. బుద్ధదేవ్ మూడు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించారు. డివైఎఫ్ఐ నాయకుడిగా 1979లో వరంగల్‌లో జరిగిన డివైఎఫ్ఐ రాష్ట్ర తొలి మహాసభలకు హాజరయ్యారు. అప్పుడు ఆయన మంత్రిగా పనిచేస్తున్నారు. 2005లో హనుమకొండలో జరిగిన సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు అతిథిగా హాజరయ్యారు. విజయవాడలో జరిగిన సిపిఐ(ఎం) మహాసభల బహిరంగ సభలోనూ ప్రసంగించారు. అప్పుడాయన బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి. దీర్ఘకాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడ్డారు. ఆగస్టు 8న ఆయన భౌతికంగా శాశ్వతంగా దూరమయ్యారు. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 4 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# అభ్యుదయ సాంస్కృతికోద్యమ చరిత్ర : ఒక పరిశీలన

( 23వ పేజీ తరువాయి)

1970 నుండి 90వ దశకం వరకూ ఫిలిమ్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక స్పృహ కలిగిన విదేశీ, దేశీ సినిమా చిత్ర ప్రదర్శన క్రమం తప్పకుండా జరుగుతూ ఉండేది. అభిరుచి కలిగిన ప్రేక్షక సమూహాలకు ఫిలిమ్ సొసైటీ వేదికగా ఉండేది. టెలికమ్యూనికేషన్ రంగంలో వచ్చిన సాంకేతిక విప్లవం మూలంగా ఇవాళ వినోద, వార్తా ప్రసారాలకు స్మార్ట్ ఫోన్‌లు ఆలంబనగా మారడం, ఓటిటి ఛానళ్ళ విస్తరణతో ఫిలిమ్ సొసైటీల ప్రభావం తగ్గిపోయింది.

**16. ప్రస్తుత సవాళ్లు :**

90వ దశకం తరువాత నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల వెల్లువలో భాగంగా సాంకేతికంగా టీవీ, ఇంటర్నెట్ తదితర మాధ్యమాలు జనసామాన్యం రోజువారీ జీవితంలో అంతర్భాగం అయిపోయాయి.

'మరో ప్రపంచం సాధ్యమే' (అనెదర్ వరల్డ్ ఈజ్ పాజిబుల్) వేదికలు, డర్బన్ సదస్సు, బీజింగ్ మహిళా సదస్సు – ఇవన్నీ తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి.

సాహిత్యరంగంలో అరసం నుండి విడగొట్టుకుని విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. విప్లవ సిద్ధాంతాన్ని (నక్సలైట్ సిద్ధాంతాన్ని) విశ్వసించేవారు మాత్రమే ఈ సంఘంలో సభ్యులుగా ఉండాలనే అప్రకటిత షరతుతో విరసాన్ని నడిపారు.

కా॥ యం.బి. చెప్పినట్లు – రచయితలు, కవులు సమాజాన్ని సాధారణ ప్రజానీకం కన్నా కాస్త ముందుగా, లోతుగా అర్థం చేసు కుంటారు కాబట్టి ఈ సమాజం మారిపోవా లనే ఆకాంక్ష వారిలో ఎక్కువగా ఉంటుంది. ఈ ఆకాంక్షల నుండి విప్లవాలు వస్తాయను కుని శ్రీశ్రీ లాంటివారు సహా చాలా మంది అభ్యుదయవాదులు విరసంవైపు కొట్టుకు పోయారు. నక్సల్ ఉద్యమంలో తలెత్తిన సైద్ధాంతిక విభేదాలకు అనుగుణంగా విరసం కూడా చీలికలకు గురయింది.

స్త్రీవాద సాహిత్యం, దళితవాద సాహిత్యం, ముస్లింవాద సాహిత్యం – ప్రబలంగా ముందుకొచ్చాయి. స్త్రీవాద సాహిత్యం పురుషాధిపత్య భావజాలాన్ని ప్రశ్నించేదిగా, మహిళల ప్రత్యేక సమస్యలు, జెండర్ సమానత వంటి అంశాలను బలంగా ముందుకు తీసుకు వచ్చింది. దళిత సాహిత్యం సామాజిక వివక్షతను, ఆధిపత్య భావజాలాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఉద్యమ స్థాయిలో వెలువడింది. అదే సందర్భంలో ఈ సామాజిక చెడుగులకు మూలకారణమైన పాలక శక్తులను వదిలిపెట్టి కమ్యూనిస్టు భావజాలాన్ని తప్పుపట్టే పొర బాటు ధోరణులను కూడా అనుసరించింది. మరోప్రక్కన మతతత్వ శక్తుల విచ్ఛిన్నకర ధోరణుల ప్రమాదం నానాటికీ పెరుగుతూ వస్తుంది.

**17. ప్రత్యామ్నాయ సాంస్కృతిక కృషి :**

వివిధ ప్రవంతుల సాహితీ ఉద్యమాలలో పనిచేస్తున్న సంస్థలను, లౌకిక, ప్రజాస్వామ్య, అభ్యుదయ భావాలు కల వ్యక్తులను ఒక దగ్గర చేర్చి విశాల ప్రాతిపదికన కృషి జరపవలసిన అవసరం నేడెంతో ఉంది. ఆయా సంస్థల స్వతంత్రతకు, కార్యకలాపాలకు ఆటంకం లేకుండానే వివిధ సందర్భాలలో అందరినీ ఒక దగ్గర కలిపే కృషి నేడు అవసరం. ఎవరో ఒక సంస్థ నాయకత్వంలో నడవాలన్న పద్ధతి బదులు అన్ని సంస్థలూ కుదిరిన మేరకు కలిసి పని చేయాలి. సాహితీస్రవంతి ఈ ఆలోచన నుండే వర్తమాన సాహితీ ధోరణుల మీద దర్పణం, గమనం, ప్రస్థానం, దిక్సూచి, కథనశాల వంటి ప్రత్యేక సంచికలు వెలవరించడం జరిగింది. 2000 తర్వాత ఈ కృషి నిలకడగా కొనసాగుతోంది. అరసం, విరసం, సాహితీస్రవంతి, జనసాహితి తదితర సంస్థలకు చెందిన ప్రముఖులు ఒక దగ్గర చేరి సాహిత్యశాలలు, గోష్ఠులు నిర్వహించడం మొదలైంది. శ్రీశ్రీ, గురజాడ, కందుకూరి, జాషువా వంటి ప్రముఖుల వర్ధంతులు, జయంతుల సందర్భంలో ఉమ్మడి కృషి జరుగుతోంది.

వేమన, పోతులూరి వీరబ్రహ్మం, అంబేద్కర్, కుసుమధర్మన్న వంటి సంస్కర్తల విశిష్టతను ముందుకు తెచ్చే విధంగా కళారూపాలు, రూపకాల ప్రదర్శనలు జరుగుతున్నాయి.

పది, పన్నెండు జిల్లాల్లో ఏర్పడిన విజ్ఞాన కేంద్రాలు సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలకు కేంద్రాలుగా రూపొందే ప్రయత్నం చేస్తున్నాయి. అడపా దడపా కార్యక్రమాలు చేస్తూ ఉనికిని కాపాడుకునే స్థాయి నుండి పాలకవర్గ సంస్కృతి ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతి స్థాయికి పెంపొందడమే, ఎదగడమే మన ముందున్న కర్తవ్యం.

**(ప్రొ॥ మాలినీ భట్టాచార్య, ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ లకు కృతజ్ఞతలతో)**

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15**, సంవత్సర చందా:**రూ.150**, పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

చందాదారుని చిరునామా

పోస్టు స్టాంపు

ఇంటి నెంబరు ......................................................

వీధి ....................................................................

గ్రామం ...............................................................

మండలం లేదా పట్టణం ......................................

జిల్లా ..................................................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.